తెళ్లూరు నాగేశ్వరరావు

సాయంత్రం అయిదు గంటలు.

ఆఖరి పిరియడ్ బెల్ మోగింది.

షేక్స్పియర్ డ్రామా 'ఏజ్ యు లైక్ ఇట్' లో ఒక దృశ్యాన్ని గురించి చెబుతూ మధ్యలో ఠక్కున ఆపివేసింది స్వరూప. పిరియడ్ అయిపోయినట్టు గంట మోగింతర్వాత స్టూడెంట్స్ ఒక్క క్షణంసేపు కూడా నిలకడగా బెంచీల

మీద కూర్చోలేరు. అందులో ఆఖరి పిరియడ్. స్టూడెంట్స్ ప్రాణాలన్నీ ఇళ్ళవైపు పుగులాడుతూ వుంటాయి. పాఠ్యాంశాన్ని లెక్చరర్ ఒక్క నిముషం పొడిగించినా వాళ్ల మొహాల్లో అశాంతి పొగలు ఆవురావురుమంటూ లేస్తాయి. అది కనిపెట్టిన వాళ్ళు వెంటనే తమ లెక్చర్‌ను ఆపుచేస్తారు. బాదస్తంగల లెక్చెరర్లు మరో మూడు నిముషాలపాటు గొంతు చించుకొని స్టూడెంట్స్ అశాంతికీ, విసుగుదలకూ, అయిష్టతకూ గురవుతారు. స్వరూప ఆ తరగతికి చెందింది కాదు. అందుచేతనే వెంటనే పుస్తకం మూసేసి క్లాసునుంచి బయటకొచ్చేసింది. బి. ఏ. మొదటి సంవత్సరపు విద్యార్థినులంతా బిలబిలమంటూ లేచి, ఆమె వెంటే బయటికొచ్చారు– బందిఖానానుంచి బయటపడ్డంత రిలీఫ్‌తో.

స్వరూప నేరుగా స్టాఫ్‌రూమ్‌లోకి వచ్చింది. అప్పటికే కెమిస్ట్రీ లెక్చరర్ సుజాతా, బోటనీ లెక్చరర్ సుభాషితా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ జనరల్ స్టాఫ్‌రూమ్‌లో ఓ మూలగా తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ జానికమ్మ, హిందీ లెక్చరర్ వెంకటలక్ష్మి కూర్చుని చెస్ ఆటలో తీవ్రంగా నిమగ్నులై వున్నారు. వారికి ఆఖరి బెల్ కూడా వినబడినట్టులేదు.

"ఏమిటోయ్! లాస్ట్ పిరియడ్ కూడా లాస్ట్ మినిట్‌దాకా స్టూడెంట్స్ పేషన్సును టెస్ట్ చేసినట్టుంది," అంది సుజాత ఇంగ్లీషు లెక్చెరర్ స్వరూపను ఉద్దేశించి.

"నాకు ఫస్టుపిరియడైనా ఒకటే, లాస్ట్‌పిరియడైనా ఒకటే! ఆ తేడా స్టూడెంట్స్‌లో వుండాల్సిందే గానీ, నాలో వుండదు," అంది స్వరూప వాళ్ల ఎదురుగ్గా కూర్చుంటూ. చేతిలో పుస్తకాల్ని, చాక్‌పీస్, డస్టర్ను టేబుల్‌మీద పెట్టింది.

"అదేమిటోయ్! కుర్చీలో చతికిలబడ్డావు. అయిదయింది. ఇంటికెళదాం, పద. నీకోసమే వెయిట్‌చేస్తున్నాం," అంది సుభాషిత.

"మీ రెళ్లండి. నేనో అరగంటసేపు టెస్ట్‌పేపర్లు దిద్ది వస్తాను. రేపు ఫస్టు పిరియడ్‌లో ఇవ్వాలి," అంది స్వరూప.

"చంపావు పో. నీకోసం నిరీక్షిస్తూంటే, కొసకు నిరాశపరుస్తావా?" అంది సుభాషిత.

"ఇందులో నిరాశా, నిస్పృహ ఏముందే సుభా! ఓ అరగంటలో వస్తానుగా. ఈ లోపల ఇంటికెళ్ళి నాగరత్నమ్మచేత వంటపని మొదలెట్టించండి," అంది స్వరూప.

"ఆ పేపర్లేవో ఇంటిదగ్గర దిద్దుకోకూడదూ !" అంది సుజాత.

"మళ్ళీ యీ దుకాణం ఇంటిదగ్గర దేనికి ?" అంది స్వరూప.

"సరే ! నీ ఇష్టమే స్వరూ ! చెబితే వినే ఘటానివి కాదుగా ! నీ మతమే నీది. ఉద్యోగం పురుషలక్షణం అనేవాళ్ళు పూర్వం. ఇప్పుడు నీలాంటిదాన్ని చూసి ఉద్యోగం ఆడలక్షణం అనవల్సివస్తోంది," అంటూ లేచింది సుభాషిత.

సుభాషితా, సుజాతలు రూమ్‌నుంచి బయటకు వెళ్ళగానే, బీరువాలోంచి టెస్ట్ పేపర్లకట్ట తీసింది స్వరూప.

సాయంత్రపు ఎండ పల్చబడిపోయింది.

మెయిన్ రోడ్డుమీద జనం హడావుడి, వాహనాల రాకపోకలు జాస్తి అయినాయి. సుభాషితా, సుజాతలు రోడ్డుపక్కన నిలబడ్డారు. ఒక రిషా వచ్చి ఆగింది.

"అరండేల్ పేట వస్తావా ?''

రిక్షావాడు తల ఆడించాడు.

"ఎంత ?"

"ఎక్కడ ?"

ఫలానా చోట అని చెప్పింది సుజాత.

"ఇద్దరా ! ఒక్కరా ?'' అలవాటుగా అడిగాడు రిషావాడు.

"ఇద్దరూ."

"రూపాయిన్నర ఇప్పించండి."

"రోజూ వెళుతూనే వున్నాం. రూపాయిపావలా" అంది సుభాషిత.

"పావలాదేముంది అమ్మగారూ - పేదోణ్ణి పూర్తిగా రూపాయిన్నర ఇవ్వండి," అన్నాడు రిక్షావాడు ప్రతిమాలింపు స్వరంతో.

"అదేంలేదు. రూపాయిపావలా మామూలే !" అంది సుజాత.

అంతలో మరో రిషావాడు గంట మోగించుకుంటూ వచ్చాడు. ఆ పోటీని గ్రహించి,– "ఎక్కండమ్మగారూ !" అన్నాడు మొదటి రిక్షావాడు.

ఇద్దరూ రిషా ఎక్కి కూర్చున్నారు.

ఎండ తీవ్రత తగ్గినా, గాలి అనుకూలంగా లేకపోవటాన వాతావరణం చిటపటగా ఉంది. ఉక్కపోస్తుంటే రిక్షా టాప్ తీయించారు.

"రోజూ రెండుపూటలా రిక్షావాళ్ళతో బేరాలాడడం చికాగ్గా ఉందే! నెలకింతని ఓ రిక్షాను కాంట్రాక్టుకు మాట్లాడుకుంటే బావుంటుంది" అంది సుజాత.

"మనం ముగ్గురం కదా! రెండు రిక్షాలు మాట్లాడుకోవాలి'' అంది సుభాషిత.

"పోనీ అలానే మాట్లాడుకుందాం."

"కాని వాళ్ళతో ఓ ఇబ్బంది ఉందే!''

"ఏమిటది ?"

"వాళ్ళు టైంకు రారు. మనం ఇచ్చిన టైంలో ఏదైనా మంచి బాడుగ తగిల్తే, మనల్ని మర్చిపోయి, అటే పోతారు. మన పని ఖాళీ. అటు కాలేజీకి టైం అయిపోతుంది; ఇటు కాంట్రాక్టు రిక్షా వున్నతర్వాత డబ్బులిచ్చి మళ్ళీ రిక్షా ఎక్కలేం. ఎక్కక తప్పదు. లేనిపోని వర్రీ. ట్రబుల్ కొని తెచ్చుకోవడమే!"

వాళ్ళు అట్లా మాట్లాడుకొంటూ వుండగా రిక్షా రైల్వేబ్రిడ్జి దగ్గర కొచ్చింది. పైకి తొక్కలేక రిక్షా దిగి నడిపించసాగాడు రిక్షావాడు. బ్రిడ్జి పేవ్‌మెంట్లమీద అటూ ఇటూ జనం నిర్విరామంగా పోతున్నారు కార్ల హారన్‌లు, సైకిల్ బెల్‌లు, స్కూటర్ల కిర్‌కిర్‌లు, రిక్షావాళ్ళ కేకలతో బ్రిడ్జిమీద సందడి జోరుగా వుంది.

రిక్షా బ్రిడ్జి ఎక్కింది.

పడమట అస్తమిస్తోన్న సూర్యుడు నెత్తురుగడ్డలా వున్నాడు.

రిక్షా బ్రిడ్జి ఎక్కగానే, పట్టిన చెమటనంతా ఒక్కసారి కుడిచేత్తో తుడుచుకొని, ఊపిరి పీల్చుకొని, ఇంక మిగిలిందంతా 'డౌన్' అనే హుషారుతో గబుక్కున రిక్షా ఎక్కాడతను.

వివిధ రకాల చప్పుళ్లమధ్య మాటలు వినబడక మాట్లాడుకోవడం మానేశారు సుజాత, సుభాషితలు. పల్లం కావటాన రిక్షా తొక్కకుండానే జోరుగా పోతోంది.

రిక్షాలో ఎడంపక్కన కూర్చున్న సుజాత ఎడంవైపునున్న దుకాణాలనూ, కుడిపక్కన కూర్చున్న సుభాషిత కుడివైపునున్న దుకాణాలనూ అప్రయత్నంగా చూడసాగారు.

వెనకనుంచి ఏదో స్కూటర్ వేగాతివేగంగా వొచ్చి ఆ రిక్షాను 'ఢీ' కొంది.

రిక్షాలో వున్న సుజాతా, సుభాషితలు రోడ్డుమీద అటూ ఇటూ రబ్బరు బంతుల్లా పడ్డారు.

అంతా క్షణంలో సగం సేపు. యాక్సిడెంట్.

రోడ్డు స్తంభించింది. రోడ్డుమీది జనం ఆగిపోయారు; వాహనాలు ఆగిపోయాయి.



రిక్షాను కొట్టిన స్కూటర్ మటుకు ఆగలేదు.

రిక్షా బిళ్ళబీటుగా పడింది. రిక్షావాడు అంత దూరంలో రోడ్డుకు కరుచుకున్నాడు.

'అరెరెరే...' 'ఎంతదారుణం !' 'పాపం !... ఆడవాళ్లు !' 'ఏదీ ఆ స్కూటర్ ?' మొదలైన మాటలతో రోడ్డుమీద జనం గుమిగూడారు.

అప్పుడే కాలేజీనుంచి సైకిల్ మీద వస్తున్న శ్రీకాంత్ ఆ దృశ్యాన్ని చూశాడు. గబగబా సైకిలు దిగాడు. 'ఏం జరిగింది ? ఏం జరిగింది ?' అంటూండగానే, తెల్ల చీరకైన దుమ్మును దులుపుకుంటూ లేస్తూన్న సుజాత అతని కంటబడింది. "అక్కా !" అంటూ రెండు అంగల్లో ఆమె దగ్గర కెళ్ళాడు ఇటు చూస్తే నల్ల చీరపైన దుమ్మును దులుపుకుంటూ సుభాషిత కనబడింది. "అక్కా !" అంటూ మరో అంగ ఇటు వేశాడు శ్రీకాంత్.

సుజాతకు మోచేలూ దోక్కుపోయింది. కొద్దిగా నెత్తురు కారసాగింది. ఆ నెత్తురు తెల్లచీర కంటుకొని మరకలుగా ఏర్పడింది. కుడిచేతి గాజులు పగిలి పోయాయి. కాలు చిటికెనవ్రేలు కొంచెంగా చిట్లింది. అయితే రక్తం ఎక్కువగా రావడంలేదు. ఆమెకు కొద్దిలో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. తల పేవ్‌మెంట్‌కు కొట్టుకోవాల్సింది. మోచేయి అడ్డం పెట్టింది. సుభాషితకు కింది పెదవి పైన దెబ్బ తగిలింది. రక్తం కారుతుంటే, చేతిరుమాలుతో అదిమిపెట్టింది. ఆమె చేతిగాజులు పగిలిపోయి, రోడ్డుమీద చెల్లాచెదరయ్యాయి. రిక్షావాడి కూడా అదృష్టవశాత్తూ పెద్ద దెబ్బలు తగలలేదు. రోడ్డును కావిలించుకున్నాడు గానీ, ఎదురూగ్గా వస్తోన్న కారును దాని డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి అదుగు

దూరంలో ఆపుచేశాడు. లేకపోతే రిక్షావాని తల కారుకింద పడి పచ్చడిపచ్చడి అయ్యేదే.

రిక్షాలో ఎక్కినవాళ్లకూ, రిక్షా తొక్కేవానికి ఎక్కువ దెబ్బలు తగల్లేదు గానీ- రిక్షాకు దెబ్బ తగిలింది. ముందు చక్రం వొంగిపోయింది. టైరు పగిలి పోయింది. టార్పాలిన్ గుడ్డ చిరిగిపోయింది. రిక్షా మొత్తం మూడు అంకెలా తయారై, నడపటానికి వీల్లేకుండా పోయింది.

"ఎట్లా జరిగింది అక్కా యాక్సిడెంట్ ?" అని ఇద్దర్నీ అడిగాడు శ్రీకాంత్ ఆదుర్దాతో కూడుకున్న ఆవేశంతో.

కాని వాళ్ళు సమాధానం చెప్పే స్థితిలో లేరు. దెబ్బలు అట్టే తగలకపోయినా అంతమందిలో అవమానం భరించరానిదైంది. ఇద్దరూ ఉమెన్స్ కాలేజీలో లెక్చ రర్లు. బాగా చదువుకున్నవారు. సమాజంలో హోదాగలవారు. అవివాహితులు. అంతమంది జనం మధ్య రోడ్డుమీద పడడం, చీరలకు దుమ్ము కొట్టుకోవడం, అందరి కళ్ళూ వాళ్ళమీద వాలడం, ఆశించని సానుభూతికి అవకాశం కలగడం, చేయని తప్పుకు అవజ్ఞపాలు కావడం- అందుకే వాళ్ళు బిత్తరపోయి, మొహాలు వ్రేళ్ళాడవేసుకొని, దుర్భరమైన ఆ దృశ్యంనుంచి అదృశ్యం కావడానికి తహ తహ లాడజొచ్చారు. ఆ యాక్సిడెంట్ ఏ మారుమూల వీధిలోనో, జనంలేని ప్రదేశంలోనో జరిగితే అంత అవమానం పొందాల్సింది కాదు.

వాళ్ళ మొహాల్లోని ఆదుర్దానూ, అవమానాన్నీ, జంకునూ, భయోత్పాతాన్నీ అర్థం చేసుకోకుండా- యాక్సిడెంట్‌కు కారకులైన వాళ్లను చెప్పమని కోపా వేశంతో అడగసాగాడు శ్రీకాంత్.

"ఎవరిదో స్కూటర్‌వొచ్చి రిక్షాను కొట్టింది. స్కూటర్ ఆగకుండా పారి పోయింది," అన్నారు ఎవరో గుంపులోంచి.

అంతలో బీట్‌కానిస్టేబుల్ వచ్చాడు విజిల్‌వేస్తూ. ట్రాఫిక్ జామ్‌ను తొల గించడానికి ప్రయత్నిస్తున్నాడు.

రోడ్డుమీద పడ్డ పుస్తకాల్ని ఓ కుర్రాడు జాగ్రత్తగా ఏరి సుజాతకిచ్చాడు.

"ఒక్క నిముషంలో తప్పించుకున్నాడు ఆ దుర్మార్గుడు. నేనుంటే ఆ స్కూటర్‌మీద వాడ్ని కూర్చోబెట్టి పెట్రోల్‌పోసి మరీ తగలబెట్టేవాడ్ని..." అన్నాడు శ్రీకాంత్ చల్లారని కోపోద్రేకంతో.

అతని మాటల్ని ఎవ్వరూ పట్టించుకోలేదు

ఆ స్కూటర్ ఎట్లా వుంది ? ఏ రంగు ? దాని మీదున్నది యువకుడా! మధ్య వయస్కుడా ? ముసలివాడా ? తెల్లగా వున్నాడా ? నల్లగా వున్నాడా ? ఎటుకేసి

వెళ్ళాడు? మొదలైన ప్రశ్నల్ని అక్కడ వున్నవాళ్ళను శ్రీకాంత్ వేశాడు. అయితే ఎవ్వరూ సూటిగా, కళ్లతో చూసినట్లుగా సమాధానాలు చెప్పలేక పోయారు.

సుజాత కొద్దిగా ఆ షాక్‌నుంచి తేరుకొని, శ్రీకాంత్‌ను మరో రిక్షా మాట్లాడి పెట్టమన్నది.

ఇంకో రిక్షాను మాట్లాడి, అక్కలిద్దర్నీ అందులో ఎక్కించి, బాడీగార్డ్‌లా తాను ఆ రిక్షాపక్కనే సైకిలు తొక్కుకుంటూ ఇంటికెళ్ళాడు శ్రీకాంత్.

రిక్షా దిగి వంచిన తలలు ఎత్తకుండా ఇంట్లోకొచ్చి పడ్డారు సుజాత, సుభాషితలు. రిక్షాకు డబ్బులిచ్చి, తన సైకిల్ను వరండాలో పెట్టి, లోపల కొచ్చాడు శ్రీకాంత్.

లోపల గదిలో ఎదురుబదురు కేన్ కుర్చీల్లో కూలబడి, బరువెక్కిన మొహా లతో మాటా పలుకూ లేకుండా వుండిపోయిన అక్కల్ని చూసిన శ్రీకాంత్- "అసలేం జరిగింది?" అన్నాడు సీరియస్‌గా.

"మా నుదుట ఏం వ్రాసివుందో అదే జరిగింది" అంది సుభాషిత.

"అదికాదక్కా! ఆ యాక్సిడెంట్ దానంతట అది జరిగిందా? ఎవరైనా దుండగులు కావాలని చేశారా? అని" అన్నాడు శ్రీకాంత్.

"అది పోలీసు ఇన్వెస్టిగేషన్‌లో తేలే విషయం. మన కెట్లా తెలుస్తుంది?" అంది సుభాషిత.

"పోలీసు రిపోర్టు ఇచ్చారా?" అన్నాడు శ్రీకాంత్ కుతూహలంగా.

"జరిగిన అవమానానికే తలలు నేలకేసి కొట్టుకొంటూంటే, పైగా పోలీసు రిపోర్టా?" అంది సుజాత.

"ఇందులో అవమానమేముందక్కా. మనం వీధిన పోతూంటే, బజారుకుక్క వచ్చి మనవెంట పడిందనుకో. అది మనకు అవమానమా?" అన్నాడు శ్రీకాంత్.

"మరి కాదా? వీధిలో వందలకొద్దీ జనం నడుస్తూంటే అందరివెంటా పడ కుండా, మన వెంటే పడితే మనలో ఏదో లోపం వున్నదన్న మాటేగా?" అంది సుజాత.

"అది వేరు, ఇది వేరు" అన్నాడు శ్రీకాంత్.

"ఏది ఏమైనా అవమానంతో బయటపడ్డాం గానీ, అవయవాలు సక్రమంగానే వున్నాయి. అందుకు లేచిన వేళావిశేషాన్ని మెచ్చుకోవాలి." అంది సుభాషిత.

"ఈ కర్మ సిద్ధాంతంతో నాకు నమ్మకం లేదక్కా! నొసటి వ్రాతల ప్రకారం, చేతిలోని రేఖల ప్రకారం జీవితంలో సంఘటనలు జరిగితే, మానవుని

మనుగడ దేనికి? ఇవాళ మీ ఇద్దరికీ రైల్వే బ్రిడ్జిపైన రిక్షా యాక్సిడెంట్ జరగాలని భగవంతుడు ముందే నిర్ణయించి వుంచాడంటావా! అంతా నాన్సెన్స్! ఇవాళ జరిగిన యాక్సిడెంట్ యాదృచ్ఛికమైంది కాదు" అన్నాడు శ్రీకాంత్.

"మరి" అంది సుజాత చివుక్కున తలెత్తి.

వంటమనిషి నాగరత్నమ్మ మూడు కప్పుల్లో వేడి వేడి కాఫీ తీసుకొచ్చింది.

సాయంత్రపు పొద్దు పూర్తిగా వాలిపోయింది. మునిచీకట్లు మెత్తగా ప్రవేశించాయి.

ఇరవయ్యేళ్ళ కోడెవయస్సులో వున్న శ్రీకాంత్ తన ఆర్గ్యుమెంట్ చెప్పబోతూండగా- బయట రిక్షావచ్చి ఆగిన శబ్దమైంది.

"స్వరూ వచ్చినట్టుంది" అంది సుభాషిత కుర్చీలో వుండే. లేచి, వాకిట్లోకి తొంగి చూడటానికి ఆమెకు బద్ధకమేసింది.

శ్రీకాంత్ వీధి వాకిట్లోకి తొంగి చూశాడు. నిర్ఘాంతపోయాడు.

నుదురు మీద నెత్తురు మరకల తెల్లని కట్టుతో, కుంటుకుంటూ స్వరూప మెల్లగా ఇంట్లోకి వస్తూంది.

"ఏమైంది అక్కా!" అంటూ వరండాలోకి ఒక్క గంతువేశాడు శ్రీకాంత్.

సుజాత, సుభాషితలు కూడా ఆదుర్దాగా బయటికొచ్చారు.

"ఏమైందే!" అన్నారిద్దరూ, ఒక్కసారిగా.

గంభీరమైన మొహంతో మౌనంగా లోపలకొచ్చి కూర్చుంది స్వరూప.

"ఏం జరిగిందక్కా?" అన్నాడు శ్రీకాంత్.

"రిక్షా యాక్సిడెంట్" అంది స్వరూప పేలవంగా.

"ఎక్కడ?"

"ఎట్లా జరిగింది?"

"రిక్షా దేనికైనా తగిలిందా? ఏదైనా వచ్చి రిక్షాను కొట్టిందా?"

"యాక్సిడెంట్‌కు కారణమైనవాడు దొరికాడా?"

"దెబ్బలు బాగా తగిలినట్లున్నాయ్!"

—మొదలైన ప్రశ్నల వడగళ్లతో ఉక్కిరిబిక్కిరి చేశారు స్వరూపను.

ఓ గ్లాసు మంచినీళ్ళు త్రాగాక యాక్సిడెంట్ వివరాలను మెల్లగా చెప్పింది స్వరూప. ఒక్కతే కాలేజ్‌నుంచి రిక్షాలో వస్తూన్నదట. రిక్షా రైల్వే ఓవర్ బ్రిడ్జి దాటుతూండగా వెనకనుంచి ఓ స్కూటర్ వేగంగా వచ్చి కొట్టిందట. ఆమె ఎగిరి రోడ్డుమీద పడిందట. జనం గుమిగూడటం, ట్రాఫిక్ బంద్, జనం సానుభూతి

వాక్యాలు; నుదురు మీద కొంచెంగా దెబ్బతగిలితే, ఎవరో గుడ్డతో కట్టుగట్టారట ఆ స్కూటర్ ఆగకుండా వెళ్ళిపోయిందట.

"ఆ స్కూటర్‌ను నువ్వు గుర్తుపట్టగలవా అక్కా ?" అన్నాడు శ్రీకాంత్.

"నేను అసలు దాన్ని చూడలేదు. రోడ్డుమీద పడగానే, ఎవరో పుణ్యాత్ముడు లేవదీశాడు," అంది స్వరూప

"నా అనుమానం నిజమైంది," అన్నాడు శ్రీకాంత్ ఆగ్రహంతో మిళితమైన గంభీరస్వరంతో.

అందరూ అతనికేసి అదోరకంగా చూశారు.

"ఏమిట్రా నీ అనుమానం ?" అంది స్వరూప.

"ఇందాక అలాంటి యాక్సిడెంటే సుజాత, సుభాషితల వాళ్ల రిక్షాకూడా జరిగింది. వాళ్ల రిక్షానుకూడా ఒక స్కూటర్ వెనగ్గా వచ్చి కొట్టింది." అన్నాడు శ్రీకాంత్.

'నిజమా ?' అన్నట్టు స్వరూప స్నేహితురాండ్రకేసి చూసింది. వాళ్ళు నిజమే నన్నట్టు తలలు ఆడించారు.

"దీన్ని బట్టి నేను గ్రహించిందేమిటంటే- ఈ యాక్సిడెంట్లు సహజమైనవి కావు; ముందుగా ప్లాన్‌వేసుకొని, జరిపించినవి ఈ యాక్సిడెంట్ల వెనుక బలమైన అదృశ్య హస్తమేదో వుంది. ఎవరో దుర్మార్గుడు ఏదో దురుద్దేశంతో ఈ యాక్సిడెంట్లు చేయించాడని నా అనుమానం. ఏమంటారు ?" అన్నాడు శ్రీకాంత్ ముగ్గురు అక్కలకేసి పరిశీలనగా చూస్తూ.

వంటగదిలోంచి వంకాయ వేపుడు వాసన వేస్తోంది.

శ్రీకాంత్ మాటలు వాళ్ళ మనసుల్లో ఓ రకమైన భయోత్పాతాన్ని కలిగించాయి. అయితే ఆ భావాన్ని వాళ్ళెవరూ మొహాలపై ప్రస్ఫుటంగా ప్రకటించ లేదు. పైపెచ్చు నిర్లక్ష్యం ముసుగులో దాచిపెట్టారు.

"నీ దొట్టి ఆధారంలేని అనుమానం శ్రీకాంత్," అంది సుభాషిత.

"కొండను తవ్వి ఎలకను పట్టినట్టుంది నీ అనుమానం" అంది సుజాత.

"నువ్వు మరీ 'సినిక్'వు అయిపోతున్నావురా శ్రీకాంత్. మా మీద దుర్మార్గం చేయాల్సిన అవసరం ఎవరికుంటుందిరా ? మాకు విరోధు లెవరున్నారు ? మా సంగతి ఎవరికి పట్టింది ?" అంది స్వరూప

"అట్లా కాదక్కా ! అంత తేలిగ్గా తోసిపారెయ్యకు. మీకు ఎవరి సంగతి పట్టకపోయినా, మీ సంగతి పట్టినవాళ్ళు ఎంతోమంది లేకపోలేదు. ఆ విషయం

మీరు గమనించకపోవచ్చు. కాలేజీలో మీ డ్యూటీని మీరు సక్రమంగా నిర్వహిస్తూ, ఒకే ఇంట్లో అన్యోన్యంగా కలిసి మెలిసి వున్నంతమాత్రాన, ఎవరి జోలీ మీకు పట్టకపోయినా— మీ గురించి ఎవ్వరూ ఆలోచించటం లేదనుకోవటం శుద్ధ పొరపాటు. మిమ్మల్ని అల్లరిచేయడం, ఆటపట్టించటం కొందరికి సరదా కావచ్చు; మిమ్మల్ని భయపెట్టి, బెదిరించటం పైశాచిక ఆనందం కావచ్చు; మిమ్మల్ని బాధపెట్టి, వక్రిపాలు చేయటం వింత సంతృప్తిని కలిగించవచ్చు. సమాజంలో అట్లా సరదాపడేవాళ్ళు ఉండకపోరు. అట్లాంటివారిని కనిపెట్టి, మసులుకోవడం మన కర్తవ్యం! ఆడవాళ్ల అమాయకత్వాన్ని బలహీనతగా తీసుకొని రెచ్చిపోయే మగవాళ్ళుంటారు. అట్లాంటి వాళ్ళను 'కుక్క-కాటుకు చెప్పుదెబ్బ' లా ప్రతిఘటించకపోతే, ఈ సమాజంలో స్వేచ్ఛగా బ్రతకడం కష్టం," అన్నాడు శ్రీకాంత్ ఉపన్యాస ధోరణిలో.

శ్రీకాంత్ వయస్సులో తమకంటే చిన్నవాడైనా లోకం తీరుతెన్నుల పరంగా చాల దూరంగా ఆలోచిస్తున్నాడని ఆ ముగ్గురూ అనుకున్నారు. బి కాం. మొదటి సంవత్సరం చదివే విద్యార్థి అయినా, సమాజ స్వభావ స్వరూపాల్ని బాగా జీర్ణించుకొని ముందుచూపుతో జాగ్రత్తలు చెబుతున్నాడని వాళ్లు గ్రహించినా, ఆ సంఘటనలు 'ప్లాన్' ప్రకారం జరిగినాయనే దాంట్లో వాళ్ళకు విశ్వాసం కుదరటం లేదు.

"ఏమోరా శ్రీకాంత్! నువ్వు అనవసరంగా లేనిపోనివి ఊహించుకొని కొత్త ప్రాబ్లమ్స్ తెచ్చిపెడుతున్నావు. మమ్మల్ని గోలచేయాలని ఎవరికైనా, ఎందుకుంటుంది?" అంది స్వరూప.

"మనమీద శ్రీకాంత్‌కు ప్రేమాభిమానాలు ఎక్కువై మనల్ని ఎవరో ఏదో చేస్తారని భయపడుతున్నాడు. ప్రాబ్లమ్ అంత సీరియస్ కాదని నా అభిప్రాయం" అంది సుజాత.

"రోజూ ఈ గుంటూరు పట్టణంలో ఎన్నో రిక్షాలకు ఎన్నో రకాలుగా యాక్సిడెంట్లు జరుగుతూవుంటాయి. మన ఖర్మ చాలక ఆ యాక్సిడెంట్లు అన్ యూజువల్‌గా మనం ఎక్కిన రిక్షాలకే జరిగాయి. దాని కింత ప్రాముఖ్యం మన మెందుకివ్వాలి?" అంది సుభాషిత.

వాళ్ళ అభిప్రాయాలకు చిరాకేసి ఎడంచేత్తో నుదురు పట్టుకున్నాడు శ్రీకాంత్.

ఆ సమయంలోనే నాగరత్నమ్మ వంటగదిలోంచి వచ్చింది.

"అమ్మగారూ! పప్పుచారులో ములక్కాడలు వేయమంటారా? వొద్దా?" అంది స్వరూప నుద్దేశించి.

వంటమనిషి మీద శ్రీకాంత్‌కు తాటిప్రమాణాన కోపం వచ్చింది— మధ్యలో అడ్డుగా వచ్చినందుకు.

"ములక్కాడలు కాదు, నాలుగు మాసం ముక్కలు తెచ్చి వేయి. మేమేదో సీరియస్‌గా ఆలోచిస్తుంటే, మధ్యలో నువ్వొకదానివి," అన్నాడు శ్రీకాంత్ చిరాగ్గా.

సొరకాయలాంటి మొహాన్ని దోసకాయంత చేసుకొని వంటింట్లోకి వెళ్ళింది నాగరత్తమ్మ.

"చీటికీ మాటికీ నీకంత చిరాకు దేనికిరా ? దానిక్కోపం వొచ్చిందంటే పప్పుచారులో మూడు దారెళ్ల ఉప్పు వేస్తుంది," అంది స్వరూప.

సుజాత, సుభాషితలు పక్కన నవ్వారు.

శ్రీకాంత్ మొహం కోపంతో సడెన్‌గా కొండరాయిలా మారింది.

"మీకంతా ఎగతాళిగా వుంది. సీరియస్‌గా ఆలోచించడం లేదు. ఆ స్కూటర్ వాడెవడో కనుక్కోకపోను. వాడి ఎముకల్లో సున్నం రాలగొడతాను. మళ్ళీ ఇలాంటి పోకిరీపనికి పూనుకోకుండా ఏకీలుకాకీలు సపరేట్ చేసి చేతికిస్తాను." అన్నాడు శ్రీకాంత్ అంతలోనే కోపావేశంతో వూగిపోతూ.

"మా గురించి నువ్వెందుకు ఆవేశపడతావురా! నీ గురించి నువ్వు చూసుకోరా. వయస్సు ఆవేశంతో కాలు దువ్వినా, కర్తవ్యాన్ని గుర్తించి అదుపులో పెట్టుకోవాలి. పోకిరీవాళ్లు ఏదో చేశారని, చదువు పాడుచేసుకొని వాళ్ళమీద ప్రతీకార వాంఛను పెంచుకుంటావా ? ముందు శ్రద్ధగా చదువుకో. ఆ పైన జీవితంలో పైకి రావడం ముఖ్యం. ఈ చిన్న చిన్న ఇన్సిడెంట్లతో మనస్సును పాడుచేసుకొంటే, వచ్చేదేముంది ? వెళ్ళి స్నానం చేసి, భోంచేసి - పుస్తకాలు ముందేసుకు కూర్చో. మా గురించి జాగ్రత్త పడటం మాకు తెలుసు. నీ రక్షణేమీ మా కక్కర్లేదు," అంది స్వరూప తమ్ముడ్ని కాస్త మందలింపు స్వరంతో.

శ్రీకాంత్ రోషంతో తల విదిల్చుకుని, చివుక్కున అక్కడ్నుంచి లేచి వెళ్ళాడు.

స్వరూప, సుజాత, సుభాషితలు ఒకళ్ళమొహాలొకళ్లు నిశ్శబ్దంగా చూసుకున్నారు.

2

ఆ రోజు రాత్రి ఎనిమిదిన్నరకు భోజనాలు చేశారు నలుగురూ. భోజనాలు చేస్తున్నంతసేపు ఎవరూ ఏం మాట్లాడలేదు. ట్రాన్సిస్టరు రేడియోనుంచి వివిధ

భారతి సినిమాపాటలు వింటూ నిశ్శబ్దంగా భోజనాలు ముగించారు. నిజంగానే ఆ పూట పప్పుచారులో ఉప్పు ఎక్కువైంది. నాగరత్తమ్మ వేయాల్సే ఓ చేరెడు ఎక్కువ ఉప్పు వేసింది. అయినా దాన్ని గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు.

భోజనం చేసింతర్వాత శ్రీకాంత్ నేరుగా తన స్టడీటేబుల్ దగ్గరకు వెళ్ళి 'వ్యాపార వ్యవస్థ: నిర్వహణ' పుస్తకం తీసి అందులో మొహం దూర్చాడు.

స్వరూప వీక్లీ పుచ్చుకొని మంచమెక్కింది.

సుభాషిత బోటనీ పాఠ్యగ్రంథం తీసుకొని రేపు చెప్పవల్సిన పాఠంగురించి చూడసాగింది.

సుజాత రేడియోలో పాటలు వింటూ పడకకుర్చీలో మేనువాల్చింది.

ఆ నలుగురూ నాలుగు తరహాల వ్యాపకంలో నిమగ్నులై వున్నప్పటికీ—వాళ్ళ మనస్సులు మటుకు రిక్షాల యాక్సిడెంట్లను గురించే ఆలోచిస్తున్నాయి. యాదృచ్ఛికంగా జరిగిన దుర్ఘటనలైతే అంతగా పుర్వాపరాల్ని గురించి ఆలోచించనక్కర్లేదు. రెండు రిక్షాలనూ ఒకేచోట పావుగంట తేడాగా ఒకే స్కూటర్ వెనగ్గా వచ్చి కొట్టడం. ముందుగా దురాలోచనతో ప్లాన్ చేసుకోనిదే ఆ దుష్కృత్యానికి పాల్పడటం అసంభవం. అయితే ఆ పని చేసిందెవరు? తమపై ఎవరికి ఆ దురుద్దేశముంది? శ్రీకాంత్ వూహ సరైందే కావచ్చు. తమకు తెలీకుండానే తమపై ఎవరైనా కన్ను వేసి వుండొచ్చు తమని అల్లరి పెట్టడానికి ప్లాన్ వేసి వుండొచ్చు. ఈ దుర్ఘటనలు నాందికి సూచనలేమో! తాము ముగ్గురు ఆడవాళ్ళు ఇల్లు అద్దెకు తీసుకొని వుంటూన్నట్టు, కాలేజీలో ఉద్యోగాలు చేస్తూన్నట్టు ఈ పేటలో చాలమందికి తెలుసు. అయితే ప్రత్యక్షంగా తమతో ఏ మగవాడికీ పరిచయం లేదు. తమ వెంట ఏ మగవాడూ పడినట్టు దాఖలా లేదు. ఏమిటో! రోజులు బావుండలేదు. మగదిక్కు లేకుండా ఆడది ఉద్యోగం చేయడం; అద్దె కొంపలో వుండటం; రిక్షాలో తిరగడం— ఏ క్షణంలోనైనా ప్రమాదమే! ఎన్నో కళ్ళు ఎన్నో ఉద్దేశాల్ని నింపుకొని చూస్తూవుంటాయి. కొంతలో కొంత నయం. మగదిక్కుగా శ్రీకాంత్ ఇంట్లో వున్నాడు... ఆ విధంగా ముగ్గురి మనస్సులూ ఆలోచించసాగాయి.

"స్వరూ! మీ తమ్ముడ్ని అట్లా కసురుకున్నావు గానీ, వాడి మాటల్లో నిజం లేకపోలేదు," అంది సుజాత.

"నాకూ అలానే అనిపిస్తుందే" అంది సుభాషిత బోటనీ పుస్తకం మూసివేసి

"మరి ఎవరి పని అయివుంటుంది?" అంది స్వరూప.



"అదే అర్థంకావడంలేదు. మనపైన ప్రత్యేకంగా ఎవరికీ పగ ఉన్నట్టు లేదు" అంది సుజాత.

"పగ కావాలేమిటి? జెలసీ వున్నా చాలు," అంది సుజాత.

"ఎందుకైనా మంచిది. పోలీసు రిపోర్టు ఇద్దామేమిటి?" అంది స్వరూప.

"బావుందే నీ ఐడియా. దొంగలుపడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టు, ఇప్పుడా రిపోర్టు ఇవ్వడం. అయినా ఎవరిమీద ఇచ్చేట్టు? ఆ స్కూటర్ వాడే ఎవ్వడో తెలీదు. వాడ్ని గురించి ఎవ్వరూ చెప్పలేదు బ్లూకలర్ స్కూటరన్నారు, అంతే! ఆ స్కూటర్ నంబర్ని కూడా ఎవ్వరూ నోట్ చేసుకోలేదు," అంది సుభాషిత.

మళ్ళీ ఆలోచనలో పడ్డారు ముగ్గురు.

పుస్తకం తెరిచినా శ్రీకాంత్ మనస్సు ఏ మాత్రం దానిమీదకు మళ్ళలేదు. రిక్షాలను కొట్టిన స్కూటర్ అతని మస్తిష్కంలో పురుగులా తొలుస్తూనే ఉంది. ఆ స్కూటర్‌వాడి ఉద్దేశ మేమిటి? వాడు గుంటూరులో ఎక్కడ ఉంటాడు? బహుశ ఈ పేటలోనే ఎక్కడో వుండి వుంటాడు తమ ఆచూకీ, ఇల్లూ, ఇంట్లో మనుషులూ అంతా తెలిసే వుంటుంది... అట్లా ఆలోచిస్తూనే అక్కడ అక్కలు మాట్లాడుకోవడం విన్నాడు. వాళ్లు పైకి గంభీరంగా వున్నా, లోలోపల భయపడుతున్నట్టుగానే గ్రహించాడు. పుస్తకం మూసేసి మళ్ళీ అక్కల దగ్గర కొచ్చాడు.

"మీరేం భయపడకండి! పదిమంది మగవాళ్ళపెట్టు నేనున్నాను. ఎంత రౌడీనైనా చిత్తుగా వోడించి, నల్లచెరువు నీళ్ల తాగిస్తాను," అన్నాడు శ్రీకాంత్.

"నువ్వూరుకోరా! అసల్ నీది వుడుకు రక్తం. చిన్నప్పుడ్నుంచీ కొట్లాటకు కాలుదువ్వే తత్వం నీది. ఇతర్లను కొట్టడం, ఇతర్లచేత కొట్టించుకోవటం నీకు హాబీ. హింసామార్గంతో సమస్యలు పరిష్కారమవుతాయా?" అంది స్వరూప.

"టిట్ ఫర్ టాట్! ఇట్లాంటి సమస్యలకు హింసా మార్గమే మంచిది అక్కా! రౌడీలకు రౌడీలే బుద్ధి చెప్పాలి. రౌడీల దౌర్జన్యానికి మనం దడిచామంటే, వెంటబడి తరిమితరిమి కొడతారు. ఎదురుబడి 'రారా' అంటే వెనుకంజ వేస్తారు," అన్నాడు శ్రీకాంత్.

"అంటే శ్రీకాంత్ నువ్వు రౌడీగా మారతావా?" అంది సుభాషిత.

"రౌడీగా మారనక్కరలేదు అక్కా! రౌడీగా కనబడితే చాలు," అన్నాడు శ్రీకాంత్.

"రౌడీ లంటే నాకు చచ్చే భయం. వాళ్ల జోలికి పోవొద్దు శ్రీకాంత్" అంది సుభాషిత.

నవ్వింది స్వరూప.

"ఎప్పుడేనా నీ వెంట రౌడీలు వెంట పడ్డారంటే!" అంది స్వరూప

నావెంట పడలేదనుకో! మనం యూనివర్సిటీలో చదివే రోజుల్లో దాబా గార్డెన్స్‌లో తల్లిని పెట్టుకొని జూఆలజీ ఎం.ఎస్సీ చదివే రాధారాణి వుండేది, జ్ఞాపకం లేదూ! సన్నగా, పొడుగ్గా, చెరుకుగడలాగా వుండేది. నుదురుమీద చిన్నబిడ్డనొప్పి మచ్చ," అంది సుజాత.

"ఆఁ! ఆఁ!... ఎలుకతోక లాంటి పొట్టిజడ. నర్సులా ఎప్పుడూ తెల్లటి చీర, జాకట్టు ధరించేది. స్టూడెంట్సంతా 'నర్సమ' 'నర్సమ' అంటూ ఎగతాళి చేసేవారు," అంది సుభాషిత.

"అవును. అయితే ఆమెవెంట రౌడీలు పడ్డారా?" అంది స్వరూప.

"పడటమేమిటి! చెరచటానికి ప్రయత్నంకూడా చేస్తేనూ! ఒకరోజు రాత్రి ఆమె జగదాంబ థియేటర్‌కు సినిమాకెళ్లి ఒక్కతే రిక్షాలో ఇంటి కొస్తూన్నదట. ఆమె ఎక్కిన రిక్షాను ఇద్దరు రౌడీలు సైకిళ్ళమీద వెంబడించారట. ఒక వీధి చివర చీకట్లో ఆ రిక్షాను ముట్టడించారట. కత్తి చూపేసరికి రిక్షావాడు పారిపోయాడట. రౌడీ లిద్దరూ రాధారాణిని బలవంతాన ఎత్తుకొని

దగ్గర్లోవున్న ఓ పాడుపడ్డ పెంకుటింట్లోకి తీసుకెళ్ళారట. రాధారాణి అరవ టానికి ప్రయత్నించిందట. నోట్లో గుడ్డలు కుక్కారట. ఇంటి తలుపులు గడియ వేశారంట. ఇంట్లో కిరసనాయిలు దీపం తప్ప మరో వెలుగు లేదట. లైఫ్‌లో ఆ రాత్రి 'ఫినిష్' అయిపోయినట్టు అనుకొందిట రాధారాణి."

"మరి చివరి కేమైంది?" అన్నాడు శ్రీకాంత్.

"ఆ రౌడీల్లో పోటీ వచ్చిందట - ఎవరు ముందుగా ఆమెను అనుభవించాలని. ఆ పోటీతో వాళ్లు ఘర్షణపడి, ఆ ఘర్షణ కొట్లాటగా మారి, బలబలాలు తేల్చు కోవటానికి తలపడ్డారట. ఆ సమయం కనిపెట్టి రాధారాణి తెలివిగా తలుపు తెరుచుకొని, చీకట్లో ఒంట్లో సత్తువకొద్దీ పారిపోయి, మానాన్ని కాపాడు కుందట. ఆ ఇన్సిడెంట్ విన్న దగ్గరనుంచీ రౌడీ లంటే నాలో భయం పాతుకు పోయింది," అంది సుజాత.

"ఒంటరిగా వున్న ఆడవాళ్ళమీదకు ఒంటికాలుమీద వస్తారు రౌడీలు అక్కయ్యా! మీరు ఒంటరిగా లేరు కాబట్టి రౌడీల బెడద మీ కేమీవుండదు. వాళ్ళగురించి మీరేమీ భయపడక్కర్లేదు. నేను రేపు ఎంక్వయిరీ చేస్తా - ఆ స్కూటర్‌వాళ్ళ గురించి," అన్నాడు శ్రీకాంత్.

"ఎంక్వయిరీ చేసి ఏం చేస్తావురా? వాడిమీదకు వెళతావా?" అంది స్వరూప కొంచెం భయాన్ని కనబరుస్తూ.

అక్క భయాన్ని గ్రహించాడు శ్రీకాంత్.

"వాడిమీద కెళ్ళక్కర్లేదు. ఇన్‌ఫర్మేషన్ తెల్సుకుని వుంటే మంచిదిగా. మన జాగ్రత్తల్లో మనం వుండొచ్చు," అన్నాడు శ్రీకాంత్ సౌమ్యంగా.

"ది గ్రేట్ శ్రీకాంత్ వుండగా మనకు భయమెందుకే! నిశ్చింతగా ఉండొచ్చు," అంది సుభాషిత.

ఓ రకమైన గర్వంతో శ్రీకాంత్ వొళ్లు గగుర్పొడించిందే. కాలర్ సర్దుకున్నాడు. శ్రీకాంత్ మంచి స్పోర్ట్స్‌మాన్. హైస్కూల్లో చేరిన దగ్గర్నుంచీ రోజూ సాయంత్రాలు ప్రొద్దు గూకేవరకూ వాలీబాల్, కబాడీ, హైజంప్ ఆడేవాడు. అథెలిటిక్‌మీట్‌లో ఏటా ఎన్నో ప్రైజులు గెల్చుకునే వాడు. కాలేజీకి వచ్చేక క్రికెట్‌లో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించాడు. బ్యాట్‌మింటన్ బాగా ఆడతాడు. కాలేజీ తరపున వాలీబాల్ టీమ్‌కు కేప్టెన్‌గా వెళ్ళి ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్స్‌లో ట్రోఫీ గెల్చుకొచ్చాడు. అంతే కాకుండా కాలేజీ స్పోర్ట్స్‌మీట్‌లో జనరల్ ఛాంపియన్‌గా ఎన్నికయ్యాడు.

స్పోర్ట్స్ అనువుగా ఉండేట్లుగానే శ్రీకాంత్ చిన్నప్పట్నుంచే శరీర నిర్మాణాన్ని తయారుచేసుకున్నాడు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవాడు. ప్రొద్దున్నే హైస్కూల్ గ్రౌండ్‌కు వెళ్ళి ఓ గంటసేపు వొళ్ళు చెమట పట్టేదాకా రౌండ్స్ వేసేవాడు. కాలేజీలో చేరింతరువాత కూడా ప్రతి దినమూ ఉదయం కాలేజీ గ్రౌండ్స్‌కు వెళ్ళేవాడు. సాయంత్రాలు ఏదో గేమ్‌లో పాల్గొనేవాడు

శ్రీకాంత్ వయస్సు ఇరవై సంవత్సరాలు. మొదట్నుంచీ సుకుమారంగా, నీడపట్టున పెరిగినవాడు కాకపోడంచేత, వ్యాయామంచేసే శరీరం కాబట్టి అసలు వయస్సుకు కాస్త మించినట్టు కనబడతాడు అంత పొడగరి కాదు. పొడుగుకు తగిన లావు. కండలుతేలిన శరీరం. ప్రథమ వీక్షణంలోనే 'స్పోర్ట్స్ మాన్' అనే భావం ఎవరికైనా కలుగుతుంది. కించిత్ సోగమొహం. ఆ మొహానికి చివర్లు మెలితిరిగిన సన్నటి మీసాల కింద తీర్చిదిద్దినట్లుండే పెదవులు ఎంతో గాంభీర్యాన్ని తెచ్చిపెడతాయి.

సిగిరెట్లు, కిళ్ళీ మొదలైన అలవాటులేని ఆ పెదవులు చూడముచ్చటగావుండి 'ముద్దుపెట్టుకుంటే ఏంత బావుండు ?' అనే భావాన్ని అమ్మాయిల మనస్సుల్లో గిలిగింతలు పెడతాయనడంలో అబ్బురంలేదు. పదునుగా పెన్సిల్ చెక్కినట్టుండే ముక్కు, ఎముక పుష్టిగల చెక్కిళ్ళు, గుండ్రటి మెడ, ఎత్తు భుజాలు, వెడల్పాటి చెవులు, విశాలమైన నుదురు, మెరక కళ్ళు, నల్లటి వొంకుల జుత్తు, చెంపలకిందకు దిగిన పట్టీలు, చామన ఛాయకు మించిన రంగు - మొత్తంమీద ఏ ఏంగిల్‌నుంచి చూసినా శ్రీకాంత్ పర్సనాలిటీ ఆకర్షణీయంగా, కరుగ్గా, రఫ్‌గా వుంటుంది.

స్వరూప, సుజాత, సుభాషితలు ఆంధ్రా యానివర్సిటీలో చదువుకొనే రోజుల్లో హాస్టల్ మేట్స్. ముగ్గురిదీ మూడు వూళ్ళు అయినప్పటికీ, కాలేజీ చదువుల్ని మూడు చోట్ల పూర్తిచేసినా - యూనివర్సిటీలో ప్రవేశించింతర్వాత మంచి స్నేహితురాండ్రు అయినారు. హాస్టల్లో ఒకే రూమ్‌లో ఉండేందుకు వాళ్ళు దరఖాస్తులు పెట్టుకోలేదు. "అయినా మా అదృష్టాలకొద్దీ వార్డెన్ మమ్మల్ని ఒకే రూమ్‌లో వేసింది. జన్మకంతటికీ జ్ఞాపకంవుండే స్నేహాన్ని సంపాయించుకున్నాం" అనుకుంటారు వాళ్లు. రెండు మూడు నెలల తేడాగా వాళ్ల వయస్సులు కూడా ఒకటే. స్వరూప ఇంగ్లీషు లిటరేచర్ ఎం.ఏ; సుజాత కెమిస్ట్రీ ఎం.ఎస్సీ; సుభాషిత బోటనీ ఎం. ఎస్సీ. ఆ రెండేళ్ళు వాళ్ళు ఎంతో అన్యోన్యంగా,

ఆప్యాయంగా, స్నేహితిస్నేహంగా, ప్రాణానికి ప్రాణంగా ఒకే రూమ్‌లో హాస్టల్లో ఉన్నారు. ముగ్గురి మధ్య స్వల్పమైన కలహాలు, మనస్పర్థలుకూడా వచ్చేవి కావు. ముగ్గురిలో పరస్పరమైన సర్దుబాటు తత్వం అలవడింది. ఏ కష్ట మొచ్చినా, ఏ సంతోషం కలిగినా, ఏ సమస్య తలెత్తినా ముగ్గురూ ఆదుకొనేవారు; పాలు పంచుకొనేవారు; పరిష్కారం చేసుకొనేవారు. షికారు కెళ్ళినా, షాపింగ్ కెళ్ళినా, సినిమా కెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్ళేవారు. తీరిక వేళల్లో ముగ్గురూ కలిసి కబుర్లు చెప్పుకొనేవారు. చదువుకొనేటప్పుడు ముగ్గురూ పుస్తకాలకు అంకితమైపోయి చదువుకొనేవారు. సెలవులకు తమ ఊళ్ళకు వెళ్ళేటప్పుడు ఒకేసారి వెళ్ళేవాళ్లు. విజయవాడ వరకూ కలిసే వెళ్ళేవాళ్ళు. మళ్ళీ యూనివర్సిటీకి వచ్చేటప్పుడు విజవాడ స్టేషన్లో కలిసే వాళ్ళు.

ముగ్గురికీ ఫస్టుక్లాసులు వచ్చాయి. జీవిత దశలో ఆ అధ్యాయం వేరు ముగ్గురికీ లెక్చరర్ ఉద్యోగాలు వచ్చాయి. అంతేకాకుండా మూడు నాలుగు మాసాల తేడాతో ముగ్గురూ ఒకే కాలేజీకి లెక్చరర్లుగా వచ్చారు "ఇది నిజంగా మన జీవితాల్లో అత్యద్భుతమైన సంఘటనా విశేషం. అనూహ్యమైంది. మన స్నేహమాధుర్యాన్ని భగవంతుడు గుర్తించి, ఒకేచోట ఉద్యోగాలు చేసే సదవకాశాన్ని కల్పించాడు," అనుకున్నారు వాళ్ళు. ముగ్గురూ ఆ అరండేల్ పేటలో ఒక ఇల్లు తీసుకున్నారు. మొదట్లో స్వంతంగా వంట చేసుకుందామనుకున్నారు. కాని ఉద్యోగాలకూ, వంటకూ కుదరదని నిర్ణయించు కొని, ఓ వంటమనిషిని పెట్టుకున్నారు.

రెండు మూడు నెలలు గడిచింతర్వాత ఒకసారి స్వరూప పండుగ సెలవులకు ఇంటికి వెళ్ళి, తనతో తమ్ముణ్ణి వెంటబెట్టుకొచ్చింది స్నేహితు రాండ్రు ఇద్దరితో నిర్మొహమాటంగా చెప్పింది. "వీణ్ణి ఇంటర్‌లో చేర్పిస్తు న్నాను. మా ఫాదర్ వీడి చదువు బాధ్యత నా కప్పగించాడు, మనకు తోడుగా ఇక్కడే వుండి చదువుకుంటాడు. మీ కేమైనా అభ్యంతరమా ?"

"మా కేం అభ్యంతరం ! మహారాజాగా వుంచుకుందాం. పైపెచ్చు మనకు మగదిక్కుగా ఉంటాడు," అన్నారు సుజాత, సుభాషితలు.

అప్పట్నుంచీ శ్రీకాంత్ ఆ ఇంట్లోనే వుండసాగాడు. ఇంటర్మీడియట్ పాసయ్యాడు. బి.కాం. ఫస్టు ఇయ్యర్లో చేరాడు. ఈ మూడేళ్ళలో సుజాతకూ, సుభాషితకూ బాగా దగ్గరయ్యాడు సోదరుడిగా. వాళ్లకు నిజ జీవితంలో

తమ్ముళ్ళు లేరు. శ్రీకాంత్‌ను అసలు తమ్ముడిలాగానే పరిగణించేవారు. ముగ్గురినీ 'అక్కా' అని ఆప్యాయంగా అతను పిలవడంతో, కొత్తవాళ్ళకు 'ఎవరు నిజమైన అక్కయ్యో' తెలిసేది కాదు. ఎవ రేపని చెప్పినా చేసేవాడు. ఏ వస్తువు కొనుక్కురమ్మని చెప్పినా కొనుక్కొచ్చేవాడు. సినిమాలకు వాళ్ళతో తోడుగా వేళ్లేవాడు. తీరిక వేళల్లో కులాసాగా కబుర్లు చెప్పేవాడు.

శ్రీకాంత్‌కు స్పోర్ట్స్‌మీద మోజు ఎక్కువ. ఫ్రెండ్స్ ఎక్కువ. రోజూ కాలేజీ వొదలగానే సరిగ్గా ఇంటికి వచ్చేవాడుకాదు. కాలేజీ గ్రౌండ్స్‌లో ఆటలు ఆడుతూ ఏడు, ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చేవాడు. ఆటలు ఆడి వొచ్చిన అలసటలో పుస్తకం తెరవగానే కళ్ళు నిద్రాభారంతో మూసుకు పోయేవి. చదువుమీద అశ్రద్ధ కనబరుస్తున్నాడనీ, ఫ్రెండ్స్‌తో కాలం వేస్టు చేస్తున్నాడనీ అతడ్ని స్వరూపతోపాటు, సుజాత, సుభాషితలు కూడా మంద లించేవారు అప్పుడు రోషంతో నాలుగురోజులపాటు కాలేజీ వొదలగానే బుద్ధి మంతునిలా ఇంటికొచ్చి, శ్రద్ధగా చదువుకొనేవాడు. ఆ నాలుగురోజులు పోయాక మళ్ళీ పరిస్థితి మామూలే. అంచేత అప్పుడప్పుడూ మాటలద్వారా చురకలు తగిలిస్తూ శ్రీకాంత్‌ను సరైన మార్గంలో పెడుతూవుంటారు.

ఆ రోజు రాత్రి పడుకోబోయేముందు అక్కయ్యలతో అన్నాడు శ్రీకాంత్.

"రోజూ నేను కాలేజీకి వెళ్లేముందు మీ కాలేజీదాకా మీతో వస్తాను. వచ్చేటప్పుడు మీ కాలేజీ మీదుగా వస్తాను. నేనొచ్చేదాకా అక్కడే వుండండి."

"మరి గేమ్స్ ఎప్పుడు ఆడతావు?" అంది సుభాషిత.

"నా గేమ్స్ కంటే మీ సేఫ్టీయే ముఖ్యం నాకు" అన్నాడు శ్రీకాంత్.

సుజాత, సుభాషిత, స్వరూపలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

3

ఆ మరునాడు పదిగంటంకు భోజనాలైంతర్వాత ముగ్గురూ కాలేజీకి బయలుదేరారు వాళ్ళకు గార్డ్‌గా సైకిలుమీద శ్రీకాంత్ బయలుదేరాడు. ఉమెన్స్ కాలేజీకి రెండు రిక్షాలు వెళ్ళేంతవరకూ ఎవరెవరు ఆ రిక్షాలను ప్రత్యేకంగా చూస్తున్నదీ గమనించసాగాడు శ్రీకాంత్. అయితే అతని కంటికి అనుమానించదగినవాళ్ళెవ్వరూ కనిపించలేదు.

ఆ రోజు క్రితం జరిగిన రిక్షాల యాక్సిడెంట్లను సుజాత, సుభాషిత, స్వరూపలు సులభంగానే మర్చిపోసాగారు. స్వరూప నుదురుకు కట్టును కూడా తొలగించింది.

అయితే శ్రీకాంత్ ఆ రిక్షాల యాక్సిడెంట్‌ను గురించి మర్చిపోలేకపోయాడు. అక్కలను కాలేజీవద్ద దించి నేరుగా తన కాలేజీకి వెళ్ళాడు. అప్పటికే మొదటిగంట అయింది. నేరుగా క్లాసులోకి వెళ్ళాడు. మొదటి పీరియడ్ అకౌంటెన్సీ. రెండోగంట మోగిన వెంటనే లెక్చరర్ వచ్చాడు. క్లాసంతా నిశ్శబ్దం అటెండెన్స్ తీసుకున్నాక బ్యాంకు రీకన్సిలియేషన్ స్టేట్‌మెంట్‌ను గురించీ, దాన్ని తయారుచేసే విధానాన్ని గురించీ, దానివల్ల ప్రయోజనాలను గురించీ లెక్చరర్ విపులంగా చెప్పాడు రెండు ఉదాహరణలను బోర్డుమీద వేసి, వివరించాడు.

కాని క్లాసులో మూడో బెంచీ చివర కూర్చున్న శ్రీకాంత్ మనస్సు ఆ పాఠంమీద లేదు. మొహం ఎత్తి రెండుకళ్లూ అప్పగించి లెక్చరర్ కేసి చూస్తున్నాడు గానీ ఆలోచనలు వేరే ప్రపంచంలో ఉన్నాయి. నిన్నటి సాయంత్రపు రిక్షా యాక్సిడెంట్లను గురించే ఆలోచిస్తున్నాడు. ఆ స్కూటర్ వాడెవడు! ఒకసారి రిక్షాను కొడితే పొరపాటనుకోవచ్చు. రెండుసార్లు కొట్టడంలో ఉద్దేశ మేమిటి? వాడెవడో అక్కయ్యలకు బాగా తెలిసినవాడయి వుంటాడు. వాడొక్కడా? వాడి కింద రౌడీముఠా ఏమైనా ఉందా? వాడి ఉద్దేశమేమిటి? - అల్లరి పెట్టాలనా? అవమానం చేయాలనా? ఆ రెండిటి వల్ల వాడి కేమొస్తుంది? అదోరకమైన ప్లెజరా? కాలేజీ గరల్స్‌ను అల్లరి చేయడం వేరు, ఉద్యోగాలు చేసుకొనే ఆడవాళ్లను అల్లరిచేయడ మేమిటి?

ఛి ఛీ. దేశంలో రౌడీయిజం పెరిగిపోతోంది లా అండ్ ఆర్డర్ ఏమైనట్టు? బీట్ కానిస్టేబుల్‌ను అడిగితే ఏమన్నాడు? "మేం మేంచేస్తాం సార్! ఆ స్కూటర్‌వాడు దొరికితే కేస్ బుక్ చేసేవాడ్ని. కనీసం ఆ స్కూటర్ నంబర్ను కూడా ఎవ్వరూ చెప్పలేకపోతుంటిరి. ఎవరిమీద కేస్ బుక్ చేయను?"

అదీ నిజమే! తాను ఒక్క మూడు నిముషాలు ముందు వచ్చి వుంటే, యాక్సిడెంట్‌ను ప్రత్యక్షంగా చూసివుండేవాడు ముందుగా ఆ స్కూటర్‌వాడి మెడ పట్టుకునేవాడు. ఆ యాక్సిడెంట్ చేయడంలో వాడి దురుద్దేశ మేమిటో బయటపడేది. ఇంకా వాడివెనక ఏ గ్యాంగేమైనా వుంటే, వాళ్ళ పేర్లు బయటికొచ్చేవి. అప్పుడు డైరెక్ట్ ఎటాక్ చేసే పని......

శ్రీకాంత్ పరధ్యానాన్ని గమనించిన లెక్చరర్ ఓ ప్రశ్న వేశాడు.

"నేను చెబుతున్నదంతా అర్థమవుతున్నదా, మిస్టర్ శ్రీకాంత్?"

శ్రీకాంత్ చివుక్కున లేచి, "యస్సార్" అన్నాడు.

"బ్యాంకు రీకన్సిలియేషన్ స్టేట్ మెంట్ను ఎందుకు తయారుచేస్తారు ? చెప్పు" అన్నాడు లెక్చరర్.

తెల్లమొహం వేశాడు శ్రీకాంత్.

కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం. చెప్పలేకపోతున్నాడనేది లెక్చరర్ సులభంగా గ్రహించాడు.

"శాస్త్రీ ఇక్కడ, మనస్సు ఎక్కడో !" అన్నాడు లెక్చరర్.

క్లాసులోని విద్యార్థులంతా ఫక్కున నవ్వారు.

శ్రీకాంత్ మొహం కిందికి దించుకున్నాడు. అంతేగానీ అవమానాన్ని పొందలేదు; రోషంతో, కోపంతో మొహాన్ని కేరట్ దుంపలా చేసుకోలేదు. కారణం - తప్పు తనది కావటమే ! విద్యార్థి విద్యుక్త ధర్మాన్ని నిర్లక్ష్యంచేసి ప్రవర్తించాడు.

విద్యార్థుల సావధానతను గురించి ఓ అయిదు నిముషాలపాటు లెక్చర్ ఇచ్చాడు ఆ లెక్చరర్. విద్యార్థులు క్లాసులో నిశ్శబ్దంగా కూర్చున్నా, ఎక్కువ మంది పాఠాలు శ్రద్ధగా వింటున్నట్లు నటిస్తారేగానీ, వాళ్ళ మనసులన్నీ విడుదలకాబోయే సినిమా మీదనో, ఫేవరేట్ స్టార్ మీదనో, క్రికెట్ ఆట మీదనో, పాలిటిక్స్ మీదనో, వీధిలో తాము చూసిన అందమయిన అమ్మాయిల మీదనో వుంటాయనీ; ఆ పరధ్యానం వల్లనే లెక్చరర్ల కృషి వృధా అవుతున్న దనీ, విద్యార్థులు పాఠ్యగ్రహణ శక్తిని కోల్పోతున్నారనీ; తత్ఫలితంగా సదుద్దేశంతో రూపొందించిన విద్యా విధానం సత్ప్రయోజనాలను సాధించడం లేదనీ ఉపన్యాసం ఇచ్చాడు. ఆయన అట్లా ఉపన్యాస మివ్వడానికి తానే కారణమని గ్రహించిన శ్రీకాంత్ నొచ్చుకున్నాడు.

మధ్యాహ్నం ఇంటర్ వెల్ లో మిత్రుల్ని కలుసుకున్నాడు శ్రీకాంత్. కాలేజీ మొత్తానికి బి.ఎస్సి. మొదటి సంవత్సరం చదువుతూన్న శ్రీధర్, బి.కాం. ఫైనల్ ఇయర్ లో వున్న భావనారాయణ అతనికి ఆప్తమిత్రులు. స్పోర్ట్స్ ఆడే ఫ్రెండ్స్ ఇంకా చాలామంది ఉన్నారుగానీ ఏ సలహా కావల్సి వచ్చినా వాళ్లిద్దర్నే అడుగుతూ వుంటాడు శ్రీకాంత్. ఒకరకంగా శ్రీకాంత్ దూకుడు తత్వానికీ, ప్రగతిపూర్వక భావాలకూ, ఆవేశకావేశాలకూ సరిపడిన మిత్రులు వాళ్లిద్దరూ.

క్యాంటీన్ లో వాళ్లిద్దరకూ కాఫీ ఇప్పించి క్రితంరోజు జరిగిన రిక్షా యాక్సిడెంట్ల సంగతి చెప్పాడు శ్రీకాంత్. వాళ్లిద్దరూ ఆసక్తిగా విన్నారు. చివరకు, "మీ రేమంటారు ?" అన్నాడు శ్రీకాంత్.



"అదేదో రౌడీమూక పనే! మీ అక్కయ్యలమీద ఎవరో దుర్మార్గులు కన్ను వేశారు" అన్నాడు శ్రీధర్. ఇట్లాంటి యాక్సిడెంట్లను చేయడంలో శ్రీధర్‌కు అనుభవం లేకపోలేదు. ఒకసారి మరో మిత్రునితో పందెం వేసి, ఉమెన్స్ కాలేజీ విద్యార్థిని వెళుతున్న రిక్షాను వెనగ్గా వెళ్ళి తన సైకిల్‌తో కొట్టాడు. ఆ రిక్షా ఎలక్ట్రిక్ స్తంభానికి కొట్టుకుంది. ఆనవాలు చిక్కకుండా సైకిల్‌మీద వేగంగా వెళ్ళాడు. శ్రీకాంత్ చెప్పింతర్వాత స్వానుభవం గుర్తుకొచ్చింది శ్రీధర్‌కు

"నాకూ అల్లానే అనిపిస్తుందిరా! ఒకే స్కూటర్ మీ అక్కలు ఎక్కిన రెండు రిక్షాలను వెనగ్గా కొట్టిందంటే, అంతా ప్రీ ప్లానింగ్ ప్రకారం చేసిందే. సందేహం లేదు" అన్నాడు భావనారాయణ.

"మరి ఆ స్కూటర్‌వాడు ఎవడై వుంటాడు?" అన్నాడు శ్రీకాంత్.

"అదే తెల్సుకోవాలి," అన్నాడు శ్రీధర్.

"తెల్సుకుంటే వాడ్ని మట్టి తినిపించడ మేముంది?" అన్నాడు భావనారాయణ.

భావనారాయణ విప్లవ భావాలను జీర్ణించుకున్న విద్యార్థి. సాయుధ విప్లవం ద్వారానే సమాజంలో మార్పు రావాలనీ, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలనీ దేశం బాగుపడాలనీ అంటూ వుంటాడు క్లాసు పుస్తకాలను అవతలకు నెట్టి ఎప్పుడూ విప్లవ సాహిత్యాన్నే చదువుతూ వుంటాడు. అందుచేతనే ఇంటర్మీడియట్ ప్యాసు కావడానికి అయిదేళ్లు పట్టింది. బి.కాం. రెండు

సంవత్సరాల్లోనూ ఏ సబ్జక్టూ ప్యాసు కాలేదు. 'స్టూడెంట్ నక్సలైట్' అని కొంతమంది అతన్ని అంటూ వుంటారు. పోలీసుల ఎంక్వయిరీ లిస్టులో కూడా వున్నాడని మరికొంతమంది ఉవాచ. అయితే అతనెప్పుడూ తను నక్సలైట్ నని చెప్పుకోలేదు. స్టూడెంట్స్ ఎలక్షన్లో మూడుసార్లు పాల్గొన్నాడు కానీ ఎప్పుడూ గెలవలేదు. 'నక్సలైట్' అనే దుష్ప్రచారానికి గురై మూడుసార్లు ఘోరంగా ఓడిపోయాడు అయితే అతని ఆకారాన్ని చూసినవాళ్ళెవ్వరూ అతను నక్సలైట్ అంటే విశ్వసించడానికి సాహసించరు. సన్నగా, గాలికి పడిపోయేట్టు వుంటాడు. వాదనలోకి దిగితే ఉగ్రభైరవమూర్తి అవతారాన్ని ఎత్తుతాడు గానీ, సాధారణంగా ఎప్పుడూ ప్రశాంతంగా, జీవితం పట్ల నిరాశను పెంచుకున్న నిరాశావాదిలాగా ఆలోచిస్తూ వుంటాడు.

"ఆ తెల్సుకోవడమే ఎట్లాగా అని ?" అన్నాడు శ్రీకాంత్.

"నేను ట్రై చేస్తాలే !" అన్నాడు శ్రీధర్.

శ్రీకాంత్‌లో ఉత్సాహం వచ్చింది. "ఎట్లా ?"

"రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రక్కన ఇరానీ హోటల్ వుంది, చూశావా ! ఆ హోటల్ పక్కనున్న కిళ్ళీకొట్టువాడు నా ఫ్రెండ్. వాడ్ని అడుగుతాను. వాడికి చాలమంది పోకిరీవాళ్ళతో, రౌడీలతో, దగుల్బాజీలతో మంచి దోస్తీ వుంది. మనకు నలుగుర్ని రౌడీలను పంపించమన్నా పంపిస్తాడు ఫలానా వాడ్ని చూపెట్టి, సాయంత్రానికి సఫా చేయాలంటే, అడ్రసూ ఆనవాళ్లూ లేకుండా చేసేస్తారు. అలాంటి గ్యాంగు లున్నాయి, యిక్కడ. అయితే డబ్బు ఖర్చవుతుంది," అన్నాడు శ్రీధర్.

"మనకి అంతదూరం అక్కర్లేదు. ఆ దుర్మార్గు డెవరో తెల్సుకుంటే, మళ్ళీ అలాంటిది జరక్కుండా వార్నింగ్ ఇవ్వొచ్చు." అన్నాడు శ్రీకాంత్.

"ఈ రోజుల్లో వార్నింగ్‌లకు వంకాయలు కూడా బెదరవు. దెబ్బ పడితేనే దెయ్యం వొదిలేది" అన్నాడు భావనారాయణ.

"వాడ్ని గురించి రేపీపాటికి నేను కనుక్కుంటానుగా ! నువ్వేం దిగులు పడకు. వాడి మనస్సులో దుర్బుద్ధి వుంటే, వాడంతటితో వూరుకోడు మీ ఇంటిచుట్టూ తిరుగుతూనే వుంటాడు, ఏదో వేషంలో" అన్నాడు శ్రీధర్

"నా కంటికి కనబడ్డారా కత్తితో కంఠ చొప్పున తీస్తాను. మా అక్కయ్యలను కాపాడటం నా కర్తవ్యంరా. ఆ కర్తవ్యాన్ని నిర్వహించడంలో ఏ కొండనైనా 'ఢీ' కొంటాను" అన్నాడు శ్రీకాంత్ ఆవేశపూరితంగా.

బెల్ కొట్టడంతో వాళ్ళు క్లాసులకు వెళ్ళిపోయారు.

4

సాయంత్రం కాలేజీ విడిచిపెట్టగానే, కొంతమంది ఫ్రెండ్స్ వాలీబాల్ ఆడదామన్నా వినిపించుకోకుండా నేరుగా ఉమెన్స్ కాలేజీకి వచ్చాడు శ్రీకాంత్. అప్పుడే అక్కలు ముగ్గురూ కాలేజీనుంచి బయటి కొచ్చారు. రిక్షాలను తానే మాట్లాడి, వాళ్ళు ఎక్కింతరువాత వాటి వెంటనే బయలుదేరాడు.

ఇంటి కొచ్చేవరకు శ్రీకాంత్ పరిసరాల్ని పరిశీలిస్తూనే వున్నాడు. అయితే ఆ రిక్షాల కేసి ప్రత్యేకంగా ఎవ్వరూ చూడలేదు.

ఇంటికి మధ్య హాలులో పడకకుర్చీలో కూర్చున్న ఓ ముసలాయన్ని చూసి సుభాషిత ఆశ్చర్యపోయింది.

"ఎప్పుడొచ్చావు నాన్నా ?" అంది సుభాషిత చెప్పులు స్టాండ్ దగ్గర విడుస్తూ.

"ఓ గంటయింది" అన్నాడు ఆదినారాయణయ్య కుర్చీలోంచి లేస్తూ.

సుభాషిత తండ్రిని సుజాత, స్వరూపలు పలకరించి యోగక్షేమాలు అడిగారు. సైకిలు వరండాలో పెట్టి లోపల కొచ్చాడు శ్రీకాంత్. ఆదినారాయణయ్యకు నమస్కారం పెట్టి, "కులాసా" అని పలుకరించాడు.

పదినిముషాల్లో అందరికీ కాఫీలు తెచ్చి యిచ్చింది నాగరత్నమ్మ.

"అయ్యగారికి ఏదైనా టిఫిన్‌చేసి పెట్టకపోయావా ?" అన్నాడు శ్రీకాంత్ వంటమనిషి నుద్దేశించి.

"ఇంటిదగ్గర తినే వచ్చాన్రా అబ్బాయీ !" అంటూ లాల్చీజేబులోంచి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె బయటకు తీశాడు ఆదినారాయణయ్య.

సుజాత స్వరూపలు డ్రస్సులు మార్చుకునేందుకు గదిలోకి వెళ్ళారు.

సుభాషిత తండ్రి ఎదురుగానే కూర్చుంది. ఆదినారాయణ అప్పుడప్పుడూ ఏదో పనిమీద గుంటూరు వస్తూ వుంటాడు. వాళ్ళ వూరు అక్కడికి పన్నెండు మైళ్లదూరంలో వున్న కొలకలూరు. బస్సులో ఒక గంట ప్రయాణం. గుంటూరు వచ్చినప్పుడల్లా కూతుర్ని చూడకుండాపోడు. పైపెచ్చు భర్త గుంటూరు వెళుతుందే. సుభాషిత తల్లి కూతురికి అరిశెలో, చక్కిలాలో, సున్నివుండలో, వూరగాయ పచ్చళ్లో పంపుతూ వుంటుంది.

"టవున్లో ఏదైనా పనివుండి వచ్చావా నాన్నా ?" అంది సుభాషిత.

"ప్రత్యేకంగా పనేమీ లేదే !" అంటూ సిగరెట్టు వెలిగించాడు

ఆదినారాయణయ్య. అగ్గిపుల్ల అవతల పారేస్తూ, "అసలు వచ్చింది నీకోసమే !" అన్నాడు.

సుభాషిత గుండెలో భయం గుప్పుమంది. తండ్రి ఏదో పెళ్ళి సంబంధం తెచ్చాడనుకుంది. నిజం కూడా అంతే ! తాను వచ్చిన పనిని వెంటనే బయట పెట్టాడు ఆదినారాయణయ్య.

అప్పటికే సుజాత, స్వరూపలు చీరలు మార్చుకొని అక్కడ కొచ్చి కూర్చున్నారు.

"సుభా ! మన వూళ్లో సుబ్బరామయ్య లేడూ. తూర్పు వీధిన రావిచెట్టు దగ్గర ఇల్లు. ఆ సుబ్బరామయ్య నిన్నొక మంచి సంబంధం పట్టుకొచ్చాడు. దాని సంగతి మాట్లాడాలని వచ్చాను." అన్నాడు ఆదినారాయణయ్య ఉపోద్ఘాతంగా.

సుభాషిత ఎదురుగా గోడమీదున్న ఎల్.ఐ.సి. కాలెండర్ కేసి చూడ సాగింది.

కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం.

"ఏం సంబంధమండీ !" అన్నాడు శ్రీకాంత్ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"మన ఊరికి పదిమైళ్ళ దూరంలో వున్న పాలెం అబ్బాయిది. ఒక మాదిరి స్థితిపరులే. అతని భాగానికి రెండెకరాల కొండ్ర వస్తుంది. ఎకరం ఎల్లా లేదన్నా పద్దెనిమిదివేలు వస్తుంది. మొత్తంమీద అతనికి యాభై వేల రూపాయల స్థిరాస్తి వుందని చెప్పవచ్చు. వూళ్లో ఖాళీస్థలాలు కూడా వున్నాయట. నలుగురు పిల్లలుగల కుటుంబం. పెద్దవాడికి పెళ్ళయిందట. మచిలీపట్నంలో ఎల్.ఐ.సి.లో అసిస్టెంటుగా వుంటున్నాడట. రెండో అబ్బాయి ఇతను. మిగతావాళ్ళు ఆడపిల్లలు. ఇంకా పెళ్ళిళ్ళ వయస్సుకు రాలేదు" అన్నాడు ఆదినారాయణయ్య కూతుర్ని ఉద్దేశించి చెబుతూ.

"అబ్బాయి ఏం చదువుకున్నాడు ?" అంది స్వరూప.

"ఉద్యోగ మేదైనా చేస్తున్నాడా ?" అన్నాడు శ్రీకాంత్.

"పర్సనాలిటీ ఎట్లా వుంటుంది ?'' అంది సుజాత.

ముగ్గురూ మూడు ప్రశ్నలు అడిగేసరికి కొంచెం మొహం చిట్లించుకున్నాడు ఆదినారాయణయ్య. అమ్మాయితో ఏకాంతంగా మాట్లాడి, సంబంధాన్ని నచ్చజెప్పి, ఔననిపించుకుందామని వచ్చాడాయన. అటువంటిది సంబంధం మీద చర్చ బయలుదేరింది.

"అబ్బాయి ఎం.కాం. ప్యాసయ్యాడు," అంటూ మొదలెట్టాడు ఆదినారాయణయ్య.

"క్లాసు వచ్చిందా ?" అన్నాడు శ్రీకాంత్ అడ్డుతగులుతూ.

"క్లాసొచ్చిందో పిసొచ్చిందో నాకు తెలీదు. బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడట."

"ఏం ఉద్యోగం! గుమాస్తా! ఆఫీసరా ?" మళ్ళీ అడ్డుతగిలాడు శ్రీకాంత్.

"యు.డి.సి. కామోసు! ఆర్నెల్లలో ఆఫీసరుగా ప్రమోషనొస్తుందని వాళ్ల నాన్న అన్నాడట ఆర్నెల్లు కాకపోతే మరో ఆర్నెల్లు పడుతుందనుకో. ఈ రోజుల్లో బ్యాంకులో ఉద్యోగమంటే మాటలా! పెట్టిపుట్టాలి. అంతకంటే సుఖమైన ఉద్యోగం మరోటి లేదు. ఇప్పుడు కాకినాడలో చేస్తున్నాడు. పెళ్లయ్యాక గుంటూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు. అదేమంత కష్టంకాదు. వాళ్ల నాన్నకు ఎం. ఎల్. ఏ. బాగా తెల్సట. కుర్రవాడి పర్సనాలిటీకూడా బాగానే వుంటుందట. సుబ్బరామయ్య చెప్పిందే కాకుండా నేను కూడా ఇద్దరు ముగ్గుర్ని ఎంక్వయిరీ చేశాను. వాళ్ళుకూడా ఆ సంబంధాన్ని గురించి బాగా చెప్పారు. నువ్వు సరేనంటే వాళ్లకు మాట యిస్తాను" అన్నాడు ఆదినారాయణయ్య కూతుర్ని ఉద్దేశించి.

సుభాషిత 'ఊఁ!' అనలేదు, 'ఆఁ!' అనలేదు. కిటికీలోంచి బయటకు చూడ సాగింది.

"కట్నం కానుకలు ఏమైనా వున్నాయా ?" అన్నాడు శ్రీకాంత్.

"కట్నం కానుకలు లేనిదే ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్ళిళ్లు అవుతాయా ? ఆడపిల్లల్ని చదివిస్తే కట్నం తగ్గుతుందని, త్వరగా పెళ్ళిళ్ళు అవుతాయనీ కొంతమంది అంటారు. అదంతా అబద్ధం. ఆడపిల్లల్ని చదివించడానికి పెట్టుబడి పెట్టాలి. వాళ్ళకు పెళ్ళిళ్లు చేయడానికి పెట్టుబడి పెట్టాలి. ఈ రెండు పెట్టుబళ్ళమీద వచ్చే రాబడి శూన్యం. అయినా తల్లిదండ్రుల బాధ్యత తప్పించుకొనేది కాదుగా! కట్నం యాభై వేలు అడుగుతున్నారు. అంతకుముందు వాళ్ళకు డెభ్భైఅయిదువేలు ఇస్తామని ఓ సంబంధం వచ్చిందట పిల్ల నల్లగా వుందనీ, అట్టే చదువుకోలేదనీ వొదిలివేశాడట. మన అమ్మాయి బావుంటుందనీ, బాగా చదువుకుందనీ, ఉద్యోగం చేస్తూందని పాతికవేలు కన్సెషన్ యిచ్చారు" అన్నాడు ఆదినారాయణయ్య ఆడపిల్ల పెళ్ళిని గురించిన ఆవేదనను వ్యక్త పరుస్తూ.

"యూబై వేలే!" అన్నాడు శ్రీకాంత్ ఆశ్చర్యంతో కనుబొమల్ని వెడల్పు చేస్తూ.

ఆదినారాయణయ్య మొహం చిట్లించుకున్నాడు.

"కట్నం లేకుండా పెళ్ళిళ్లు చేసుకోనే ఆదర్శవంతమైన యువకులు ఇంకా బయలుదేరలేదు. ఉపన్యాసాలు యిచ్చేవారేగానీ, ఆచరణలోకి వచ్చేసరికి 'మా నాన్న ఒప్పుకోవటంలేదనో, మా అమ్మ ఆత్మహత్య చేసుకుంటానన్నదనో, ఏదో ఒక వంకతో తప్పించుకొనేవాళ్ళేగానీ, సదుద్దేశంతో నిలబడే వాళ్ళెంత మంది? ఇప్పటికి మూడునాలుగు సంబంధాలు చూశాం ఒకటి అమ్మాయికి చదువు ఎక్కువైందనీ, రెండు ఉద్యోగం చేస్తూంటే చేసుకోమనీ, మూడు కట్నం లక్ష రూపాయలు కావాలనీ, నాలుగోది మరో కారణంచేత కుదరలేదు. ఎంత ఉద్యోగం చేస్తూంటేమటుకు, అమ్మాయి పెళ్ళికానిదే తల్లితండ్రులకు మెడమీద గుదిబండ వున్నట్లే వుంటుంది. ఆ బాధ ఆడపిల్లల్ని కన్నవారికి గానీ తెలియదు."

"మీరు ఎన్నయినా చెప్పండి. కట్నాలు ఇవ్వడం; తీసుకోవడం అనే పద్ధతి నాకు నచ్చదు. ఇది వస్తుమార్పిడి పద్ధతి కాదు. ఈ దురాచారానికి నేను పూర్తి వ్యతిరేకిని. ఈ పెళ్ళికి నువ్వు ఒప్పుకోవద్దు అక్కా!" అన్నాడు శ్రీకాంత్ నిశ్శబ్దంగా ఆలోచిస్తున్న సుభాషితను ఉద్దేశించి

ఆదినారాయణయ్య మొహం కోపోద్రేకాలతో ఎరుపెక్కింది.'నువ్వెవడివోయ్' అన్నట్టు అతనికేసి తీవ్రంగా చూశాడు.

"నీ బోడి సలహా ఏమిట్రా! నువ్వేమైనా కట్నం ఇస్తున్నావా? నీకెందుకు మధ్యలో? అర్థంగాని విషయాల్లో నోరు జారొద్దని నీకెన్నిసార్లు చెప్పాను. బుద్ధి లేదూ!" కోప్పడింది స్వరూప తమ్ముడ్ని.

ఆదినారాయణయ్య కోపం కొద్దిగా జారిపోయింది.

అయినా శ్రీకాంత్ నోరుమూసుకు కూర్చోలేదు.

"మీరు పెద్ద పెద్ద చదువులు చదువుకున్నారు. చక్కగా ఉద్యోగాలు చేస్తున్నారు అయినా మీలో పాతసాంప్రదాయాలపట్ల, ఆచారాలపట్ల మోజు తగ్గ లేదు. ఇండిపెండెంటుగా బ్రతుకుతున్నా, వేలకువేలు డబ్బులు ధారబోసి డిపెండెంట్లు అవుదామనుకుంటున్నారు. నాకెంతో వింతగా వుంది. కట్నం ఇవ్వనంటే ఈ దేశంలో ఆడపిల్లకు పెళ్ళికాదా? కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకొనే యువకులు ఆంధ్రదేశంలో లేరా?"



"ఉండొచ్చు. కాని వాళ్ళు ఎక్కడున్నారో, వాళ్ళ కులమేమిటో, ఆర్థిక పరిస్థితులేమిటో విచారించవద్దూ. గాలికి తిరిగేవాడొచ్చి 'నేను కట్నంలేకుండా పెళ్ళిచేసుకుంటాను' అంటే వాడికి పిల్లనిస్తామా ?" అన్నాడు ఆదినారాయణయ్య ఆగ్రహావేశంతో.

శ్రీకాంత్ మళ్ళీ ఏదో అనబోయాడు.

"నువ్వూరుకోరా!" అని గట్టిగా మందలించింది స్వరూప.

అక్కణ్నుంచి లేచి గబగబా బయటికెళ్లాడు శ్రీకాంత్.

ఓ నిముషం పాటు వాన కురిసి వెలిసిన నిశ్శబ్దం ఆవహించింది.

ఇంకో సిగరెట్టు వెలిగించి, "ఏమంటావమ్మా!" అన్నాడు ఆదినారాయణయ్య కూతుర్ని ఉద్దేశించి.

సుభాషిత మొహం ఇంకా సీరియస్‌గానే వుంది. ఆమెకేసి స్నేహితురాం డ్రిద్దరూ చూశారు. వాళ్ళందర్లోకి సుభాషిత కొన్ని మాసాల వయస్సు చిన్నది. అందంగా ఉంటుంది. గుండ్రటి మొహం. ఎత్తుకు సరిపడిన లావు. పండిన పైన్‌యాపుల్ రంగు. మగవాడిని ఇట్టే ఆకర్షించే శక్తిగల కళ్లు. కొనదేలిన ముక్కు. పొడుగాటి జడ. నున్నటి నొక్కులులేని వెంట్రుకలు. సగటును మించిన సౌందర్యం. అయితే స్వభావరీత్యా చాల మెతక మనిషి మాటలద్వారా గానీ, చేష్టలద్వారాగానీ ఎదుటివాళ్లను నొప్పించదు. తనని గురించిగానీ, ఇతర్లను గురించిగానీ, అత్యవసర సందర్భాలలోగానీ నిర్ణయాలు త్వరగా తీసుకొనే అలవాటులేదు. జీవితాన్నిగురించి పెద్దగా ఆలోచించదు. ప్రతి విషయాన్నీ తేలిగ్గా అమాయకంగా తీసుకుంటుంది. అందుచేతనే పెళ్ళివంటి ముఖ్యవిషయంపట్లకూడా త్వరగా ఓ నిర్ణయానికి రాలేకపోతూంది.

కూతుర్నుంచి వెంటనే సమాధానం రాకపోయేసరికి మళ్ళీ అడిగాడు ఆదినారాయణయ్య. అప్పటికీ సుభాషిత ఓ నిర్ణయానికి రానట్టు ఇబ్బందికరంగా మొహం పెట్టింది.

"మీరైనా చెప్పండమ్మా! మంచి సంబంధం. ఇది పోతే మళ్ళీ ఇంకో సంబంధం రావడం కష్టం. ఇంకా ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి" అన్నాడు ఆదినారాయణయ్య బ్రతిమాలే స్వరంతో.

"అది వ్యక్తిగత సమస్య. ఆమెకు ఆమే తేల్చుకోవాలి బాబాయిగారూ! పెళ్లి చేసుకోవొద్దని మే మెప్పుడూ చెప్పం." అంది సుజాత.

"ఆలోచించుకొని చెప్పవే సుభా! ఇట్లాంటి సమయమూ సందర్భమూ అందరికీ వస్తాయి. ఒకళ్ళ సలహా సంప్రదింపులకంటె ఎవరి ఆత్మప్రబోధం ప్రకారం వాళ్లు ఓ నిర్ణయానికి రావడం మంచిది. జీవితానికి వివాహం చుక్కాని లాంటిది," అంది స్వరూప.

"రేపు శనివారం రాత్రి మనవూరు వస్తాన్లే నాన్నా! అప్పుడు చూద్దాం,"

"చూద్దాం గీద్దాం అంటే కాదు. అప్పటికైనా నువ్వు ఒక డెసిషన్‌కు రావాలి. ఇట్లా నాన్చుతూపోతే ఏళ్లు జరిగిపోతాయి. ఆ తర్వాత పెళ్లిచేసుకొనే వాడు దొరకటం మరీ కష్టమైపోతుంది. ఆడపిల్లకు పెళ్లి చేయలేకపోయాడనే అప్రదిష్ట నాపై పడుతుంది, ఏ అంటూ లేచాడు ఆదినారాయణయ్య

"భోంచేసి వెళుదురుగాని ఉండండి" అంది స్వరూప.

"అప్పుడే భోజనమేమిటమ్మా ! బస్సెక్కితే అరగంటలో మా వూరు చేరతాను" అంటూ వెళ్ళాడు ఆదినారాయణయ్య.

ఆయన వెళ్లిన అరగంటకుగానీ శ్రీకాంత్ ఇంటికి రాలేదు. వెంటనే భోజనం చేసి, పుస్తకం ముందువేసుక్కూర్చున్నాడు. సుభాషిత పెళ్ళి ప్రస్తావన ఆ రాత్రి మళ్ళీ రాలేదు. తొమ్మిదిన్నరగంటలకు స్నేహితురాండ్రు ముగ్గురూ పడుకున్నారు.

రాత్రి పదిన్నర ప్రాంతంలో బయట ఎవరో తలుపు తడితే స్వరూప ఉలిక్కిపడి లేచింది. భయంతో వెంటనే సుజాతను, సుభాషితనూ లేపింది. తలుపును ఎవరో సన్నగా కొడుతూనే ఉన్నారు. వాళ్ల ముగ్గురికీ అవ్యక్తమైన భయంవేసింది. అయితే పక్కగదిలో లైటు వెలుగుతుండటాన్నిబట్టి శ్రీకాంత్ మేల్కొనే వున్నాడనుకున్నారు. కాస్త ధైర్యం వచ్చింది.

శ్రీకాంత్ గబగబా బయటికొచ్చి తలుపుతీశాడు. ఎదురుగ్గా అతని ఫ్రెండ్ భావనారాయణ. ఆవేళలో అతను రావటం శ్రీకాంత్‌కూ ఆశ్చర్యాన్ని కలిగించింది

"ఏమిట్రా?" అన్నాడు శ్రీకాంత్.

"ఏంలేదు. పై క్రాస్ రోడ్‌లో ఓ ఫ్రెండ్ వుంటే అతని దగ్గర్నుంచి వస్తున్నాను. ఈ పుస్తకాలు ఇచ్చిపోదామని వచ్చాను. డిస్టర్బ్ చేశానా?" అంటూ భావనారాయణ క్రాఫ్ట్‌పేపరువేసిన రెండు పుస్తకాలను అందించాడు. ఆ రెండు పుస్తకాలు విప్లవ సాహిత్యానికి సంబంధించినవి.

లోపల కిటికీలోంచి చూసి ఆ వచ్చిన వ్యక్తి శ్రీకాంత్ మిత్రుడని గ్రహించారు స్వరూప, సుజాత, సుభాషితలు.

బయటనే శ్రీకాంత్, భావనారాయణలు కొంచెంసేపు మాట్లాడుకున్నారు. శ్రీకాంత్ ఎప్పుడు ఇంట్లోకొచ్చి పడుకుంది వాళ్ళకు తెలియదు. నిద్రపోయారు.

5

ఉదయం పదిగంటలు కావడంతోనే సుజాత, సుభాషిత, స్వరూపలు ముగ్గురూ రోడ్డుమీదకు వస్తారు రిక్షాకోసం. వాళ్ళ వెనుకే సైకిలుతో శ్రీకాంత్ వస్తాడు. వాళ్లకి రిక్షాలు మాట్లాడి, వాళ్ళవెంటే తానూ వెళతాడు. రోజూ ఆవేళప్పుడు జరిగే కార్యక్రమం అది. ఆ కార్యక్రమంలో అజ్ఞాతంగా మరో వ్యక్తి పాల్గొంటాడు. అతనిపేరు పూర్ణచంద్. వాళ్ళ ఇంటికి ఎదురుగ్గా ఉన్న డాబాలో వుంటాడు. ఆ డాబా అతని సొంత ఇల్లే.

ఆ రోజు పదిగంటలకు స్వరూప, సుభాషిత, సుజాతలు మామూలుగానే రోడ్డుమీద కొచ్చారు చేతుల్లో పుస్తకాలతో. వాళ్ళవెనుకనే సైకిల్‌తో శ్రీకాంత్

కూడా వచ్చాడు. సైకిలు క్యారియర్ మీద పుస్తకాలు పెట్టుకుని. సరిగ్గా అదే టైంలో ఎదురింటి పూర్ణచంద్ స్కూటర్ మీద షాపుకు బయలుదేరాడు. రోడ్డుకు ఇవతల వీళ్లు; అవతల పూర్ణచంద్. అతను నేరుగా షాపుకు వెళ్ళిపోవచ్చు. కాని అట్లా వెళ్ళడు ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టు, ఎవరో వచ్చి స్కూటర్ ఎక్కుతారన్నట్లు-వాళ్ళ రిక్షాలు కదిలేవరకు రోడ్డుకు అవతలగానే వుంటాడు. రోజూ దాదాపు అదే టైంలో ఆ స్కూటర్ను, ఆ స్కూటర్ పైనున్న వ్యక్తినీ అతని తాత్పారాన్నీ చూస్తున్నా ఆ ముగ్గురు స్త్రీలుగానీ, శ్రీకాంత్‌గానీ ఎప్పుడూ పట్టించుకోలేదు; పరిశీలనగా చూడలేదు.

ఆరోజు స్వరూప సీ బ్లూకలర్ ప్లెయిన్ వూల్లీచీర, దానికి మేచింగ్ జాకెట్టు ధరించింది. మెడలో లాకెట్‌గల ఒంటిపేట గొలుసు. ఒకచేతికి గురడా రిస్ట్‌వాచ్. మరోచేతికి రెండు బంగారు గాజులు. చీర రంగుతో మేచ్ అయ్యే రింగ్స్, కాళ్లకు చెప్పులు. హ్యాండ్‌బ్యాగ్ కూడా బ్లూకలర్‌దే వాళ్ళల్లో కొంచెం వయసున్నట్టు కనబడేది స్వరూపే. సహజమైన, సాధారణమైన సౌందర్యం ఆమెది. ఆ సౌందర్యానికి పౌడర్, స్నో, సింపుల్‌గావుండే అలంకరణలతో మరికొంత మెరుగు తీసుకురావటానికి ఆమె ప్రయత్నిస్తూ వుంటుంది. చామన ఛాయ. కళ్లు, ముక్కు, పెదవులు తీర్చిదిద్దినట్లుగా వుంటాయి. కళ్ళకు ఆర్టిస్టిక్‌గా కాటుక దిద్దటంతో ఆమె మొహంలో వింత ఆకర్షణ కొట్టవచ్చి నట్టుగా కనబడుతుంది. సుభాషిత పింక్‌కలర్ నైలెక్స్‌మీద లైట్ నిటింగ్ ఎంబ్రాయిడరీ చీర ధరించింది. మెడలో ఒంటిపేట గొలుసు. కృత్రిమ అలంకరణలద్వారా ఆకర్షణయుతమైన సౌందర్యానికి ఆమె ప్రాధాన్యత ఇవ్వదు. సుజాత పేరట్‌కలర్‌తో, ఆరంజి బోర్డరుగల వెంకటగిరి నేతచీర ధరించి, టు బై టు ఆరంజి కలర్ జాకెట్ వేసుకుంది. ముగ్గురిలోకి ఆమె పొడగరి. సన్నగా, నాజూగ్గా ఉంటుంది. యూనివర్సిటిలో చదివే రోజుల్లో విద్యార్థులు ఆమెకు 'సర్విచెట్టు' అనే పేరు పెట్టారు. కాని ఇప్పుడు కొంచెం లావుకావడంతో ఆపేరు ఆమెకు అంతగా వర్తించదని చెప్పవచ్చు. విశాల నయనాలు. అవే ముందుగా అందర్నీ ఆకర్షిస్తాయి. రెండోది, జఘనాల కిందికి వచ్చే పెద్దజడ. తెలియనివాళ్లు రెండు సవరాలు వేసుకుంది అనుకుంటారుగానీ, ఆమె వెంట్రుకలు సహజంగా అంత పొడగాటివి, మెత్తనివి, అసూయ కలిగించేవి. శరీరఛాయ కొంచెం తెలుపుకిందే లెక్క. ముక్కూ మొహమూ, నడకా, పర్సనాలిటీ సగటుకు మించినవి. ఒకచేతికి వాచీ, మరోచేతికి మట్టి

గాజులు, సింపుల్‌గా వుండటమే సౌందర్య రహస్యమని భావన ఆమెకుంది. స్నో, పౌడర్ అంటే ఆమె కిష్టముండదు. మొహం ఎప్పుడూ ఆయిలీగా వుంటుంది.

రోడ్డుకు ఇవతల ఎండలో నిలబడ్డ ఆ ముగ్గురికేసీ ఏదో పోగొట్టుకున్నట్టు, పోగొట్టుకున్నది వాళ్ళ మొహాల్లో లభించినట్లూ ఆశగా, ఆవేశంగా, ఆదుర్దాగా చూడసాగాడు పూర్ణచంద్ రోడ్డు అవతల స్కూటర్ మీద కూర్చుని. స్కూటర్ను స్టార్టు చేశాడు. కాని ఎవరికోసమో వెయిట్ చేస్తూన్నట్టు నటిస్తున్నాడు. ఆ ముగ్గురు స్త్రీలలో ఎవరు అందమైనవారు? ఎవరిలో లావణ్యం పాలు హెచ్చుగా వుంది? ఎవరిలో మగవాడ్ని ఆకర్షించే లక్షణాలు జాస్తిగా వున్నాయి? ఎవరు తనకు బాగా నచ్చారు? మొదలైన ప్రశ్నలు అతని బుర్రలో వేగంగా తిరుగుతూ, సమాధానాలకోసం సతమతమవుతున్నాడు.

ఒక రిక్షా వచ్చింది. బేరం కుదరలేదు

మరో రిక్షా వచ్చింది. దానికీ బేరం కుదరలేదు.

అయిదు నిముషాలు గడిచాయి.

రోడ్డుకు అవతల పూర్ణచంద్ స్కూటర్ మీద కూర్చుని వాళ్ళకేసి తదేక దీక్షగా చూస్తూనే ఉన్నాడు.

రిక్షాకోసం అంతసేపూ వెయిట్ చేయడం చిరాగ్గా వుంది సుజాతకు.

ఎండ కోడెవయసులో వుంది

"శ్రీకాత్ బేరాలు చేయక, వెంటనే రిక్షా మాట్లాడు. రోడ్డుమీద నిలబడడం న్యూసెన్స్‌గా వుంది" అంది సుజాత.

అప్పుడు చూశాడు శ్రీకాంత్-స్కూటర్ మీదవున్న పూర్ణచంద్‌ను. అతనింకా అక్కయ్యలకేసే చూస్తున్నాడు-తాపీగా సిగరెట్టు వెలిగించి.

అతని చూపుల తీవ్రతనుంచి తప్పించుకోడానికి సుజాత తహతహలాడి పోతోంది.

ఇంకో రిక్షా వచ్చింది. పావలా ఎక్కువైనా గబుక్కున అందులో ఎక్కేశారు సుజాత, స్వరూపలు. మరో రిక్షాలో సుభాషిత ఎక్కడానికి మరో అయిదు నిముషాలు పట్టింది. ఈ లోపల పూర్ణచంద్‌ను గమనించసాగాడు శ్రీకాంత్.

రెండు రిక్షాలు బయల్దేరిం తర్వాత పూర్ణచంద్ స్కూటర్ మీద షాపుకు బయలుదేరాడు. యాభై మీటర్ల దూరంలో అతను ఆ రిక్షాలను దాటాడు. దాటుతూ వెనక్కి తిరిగి చూస్తూనే పోయాడు.

వీడు మామూలు మనిషి కాదు. వీడి ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది. వీడ్ని ఓ కంట కనిపెట్టివుండాలి! అనుకన్నాడు శ్రీకాంత్ సుభాషిత రిక్షా వెనుకగా వెళుతూ

ఆరోజు సాయంకాలం కాలేజీనుంచి ఇంటికి వచ్చాక, డ్రస్ మార్చుకొని మొహం కడుక్కొని అట్లా వీధిలోకి వెళ్ళాడు శ్రీకాంత్. ఆ వీధిలో నాలుగు రోడ్ల కూడలిలో వేపచెట్టుంది ఆ వేపచెట్టుకింద కిల్లీబడ్డీ వుంది. ఆ కిల్లీబడ్డీ మస్తాన్ అతనికి మిత్రుడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదివి, కుటుంబ పరిస్థితులవల్ల చదువు మానేసి అన్న కిళ్ళీబడ్డీని నడుపుతున్నాడు మస్తాన్. ఏమీ తోచనప్పుడు అప్పుడప్పుడూ ఆ కిళ్ళీబడ్డీ దగ్గరున్న బెంచీమీద కూర్చుని మస్తాన్‌తో బాతాఖానీ వేయడం శ్రీకాంత్‌కు అలవాటు. ఆ సాయంత్రంకూడా అలాగే వెళ్ళాడు శ్రీకాంత్.

కిళ్ళీబడ్డీ గ్గర దరద్దీ ఏమీలేదు. మస్తాన్ ఖాళీగా కూర్చుని తమలపాకుల మొదళ్లు తుంచుతున్నాడు. శ్రీకాంత్‌ను చూడగానే ఆప్యాయంగా ఆహ్వానించి, "కూర్చో భాయీ" అన్నాడు.

శ్రీకాంత్ అరటిపండ్లగెల ప్రక్కనే బెంచీమీద కూర్చున్నాడు.

"సోడా ఇచ్చేదా బ్రదర్" అన్నాడు మస్తాన్.

"వొద్దు. ఏం తోచక వచ్చాను" అన్నాడు శ్రీకాంత్.

అయినా మస్తాన్ వూరుకోలేదు. మంచి గ్యాస్‌గల చల్లని సోడాను కొట్టి యిచ్చాడు. డబ్బులు పుచ్చుకోలేదు.

సరిగ్గా ఆదేసమయంలోనే పూర్ణచంద్ స్కూటర్ మీద ఇంటికెళ్ళాడు. అతన్ని చూపెడుతూ, "ఎవరు భాయ్?" అన్నాడు శ్రీకాంత్.

"బడా ఆద్మీ! మీ ఇంటి ఎదురుగ్గానే వుంటాడు - పూర్ణచంద్. ఓల్డు బస్‌స్టాండ్ దగ్గర పెద్ద ఆటోమొబైల్‌షాపు వుంది. నాలుగు లారీలున్నాయి. ఒకచేత్తో సంపాయిస్తాడు, మరోచేత్తో ఖర్చుపెడతాడు. టవున్లో పలుకుబడి జాస్తిగావుంది. లోకల్ ఎం. ఎల్. ఏ.కు రైట్‌హ్యాండ్. నెలకోసారి హైద్రాబాద్ పోతుంటాడు-చిన్నచిన్న సిఫార్సుల్ని భుజానవేసుకుని పైకి ఎంతో పెద్ద మనిషి. కాని ఒట్టి దుర్మార్గుడు.

"ఏం!"

"చేతిలో పాతిక ముప్పైమంది రౌడీలు వుంటారు. ఏ పని చెయ్యమంటే ఆ పని చేస్తారు. ఫలానావాడ్ని కొట్టమంటే సైకిల్ ఛెయిన్‌తో బాది వస్తారు. పోలీసు



ఆఫీసర్లకు మేపుతూ వుంటారు. వాళ్ళ అండ వుంది. ఏ కేసు లేకుండా చేస్తుంటారు. పూర్ణచంద్‌తో నీకేంపని భాయీ?"

"అబ్బే! నాకేంపని! వూరికెనే అడుగుతున్నా."

"దుష్టులకు దూరంగా వుండడం మంచిది భాయీ. వాడితో ఏం పెట్టుకోకు. వాడికి అన్ని దుర్గుణాలూ వున్నాయి. తాగుతాడు. రౌడీలకు రౌడీ. జూదగాడు. మోసగాడు. వ్యభిచారి ఆడాళ్ళను గోలచేయటం, బలవంతంచేయటం, చెరచడం అంటే మహా సరదా. వాడి కంటబడిన ఆడది తప్పించుకోవడం ఇంపాజిబుల్ భాయీ. ఏదో రకంగా వలలో వేయటానికే ట్రై చేస్తాడు. వలలో పడకపోతే అపకారం చేయటానికి ప్రయత్నిస్తాడు. ఇన్ని దుర్మార్గాలు వాడిలో వున్నా సమాజంలో పెద్దమనిషిగా చెలామణి అవుతున్నాడు. మళ్ళీ ఎక్కడా డైరెక్టుగా చిక్కడు. అదే వాడిలోవున్న చాకచక్యం. ఎవడెళ్ళి అడిగినా చందా లిస్తాడు. లేదని అనడు. వాడిది మరీ కాంప్లికేటెడ్ క్యారెక్టరు భాయీ! మీ ఇంట్లో ముగ్గురు ఆడంగులుంటున్నట్టున్నారు. ఎవ్వరికీ పెళ్ళిళ్ళు కాలేదుగా. జాగ్రత్త. వాడికంటబడకుండా చూడు" అన్నాడు మస్తాన్.

అయినా శ్రీకాంత్ రవ్వంత భయపడలేదు.

"ఏడ్చాడు వీడు మమ్మల్నేం చేస్తాడు? మా జోలికి వస్తే మక్కెలిరగ తన్ని మట్టిలో పాతిపెట్టనూ! మా అక్కయ్యలు నిప్పురవ్వలు."

"ఎంత నిప్పురవ్వలైనా నీటిచుక్కకు లోకువేగదా!"

"నీటిచుక్కను తాకనిస్తానా? నా సంగతి తెలీదూ మస్తాన్. మా అక్కయ్యల్ని ఈగవాలితే ఆ ఈగను చెప్పుకింద నలిపి, నాశనంచేసేదాకా నిద్రపోను. కాని మొన్న ఏం జరిగిందంటే మస్తాన్..."

"ఏం జరిగింది భాయీ!" అన్నాడు మస్తాన్ కుతూహలంగా.

రిక్షా యాక్సిడెంట్లనుగురించి చెప్పాడు శ్రీకాంత్. "ఆ స్కూటర్ వెధవ ఆచూకీయే ఒక్కలేదు. వాడికోసం గాలిస్తున్నాను."

మస్తాన్ ఓ నిముషంసేపు ఆలోచించాడు.

"ఏదో జరిగింది. వాటినిగురించి మర్చిపో భాయీ!"

"ఏం?"

"నా అనుమానం ఆ స్కూటర్‌వాడు పూర్ణచంద్ గ్యాంగ్‌లో వాడే! యాక్సిడెంటును యాక్సిడెంట్ అనుకొంటే పోలేదూ! దాన్ని గురించి బుర్ర పాడుచేసుకోవడం దేనికి? మనంతటకు మనంవెళ్ళి ముళ్ళకంపలో ఇరుక్కోవడం దేనికి?" అన్నాడు మస్తాన్ ముందు ఆలోచనతో సలహాయిస్తున్న ధోరణిలో.

"ముళ్ళ కంపలకూ, చిల్లకంపలకూ దడిచేవాడ్నికాదు నేను. ముళ్ళను తొలగించటం నాకు తెలుసు" అన్నాడు శ్రీకాంత్.

అతని గుండెధైర్యానికి మనోనిబ్బరానికి ఆశ్చర్యంవేసింది మస్తాన్‌కు. శ్రీకాంత్ ఆవేశపరుడు. తనకు అన్యాయమని తోచినదాన్ని ప్రతిఘటించ డానికి వెనుకంజవేయడు. ఎవ్వరు చెప్పినా వినడు. ముక్కుకు సూటిగాపోయి, ముక్కు బద్దలుకొట్టుకునే రకం అనుకున్నాడు మస్తాన్. అయినప్పటికీ మిత్రుని ధర్మంగా అన్నాడు.

"కొన్ని విషయాల్లో మూర్ఖత్వం పనికిరాదు భాయీ! కాలాన్నిబట్టీ, మనుషుల్నిబట్టీ పోతూండాలి. మీ సిస్టర్స్ మేలుకొరకైనా, దుష్టులకు దూరంగా వుండటం మంచిది. ఒక్కొక్కప్పుడు మనం ఎవర్ని ఎక్కువ అభిమానంగా చూసుకుంటామో, మనకు తెలియకుండానే వాళ్ళకు అపకారం తలపెడతాం. అట్లాంటి పరిస్థితి రాకుండా చూసుకో భాయి. పూర్ణచంద్ గురించి నాకు తెలిసిం దంతా చెప్పాను. పైగా వాళ్ళ నాన్న పెరాలిసిస్‌వచ్చి మంచంలో పడి వున్నాడు. తండ్రి మాటన్నా వాడికి లక్ష్యంలేదు. కాబట్టి వాడితో ఏదైనా ముందు ముందు వస్తే నా మాటల్ని గుర్తుంచుకో, మూర్ఖంగా తలపడకు."

అతి నిర్లక్ష్యంగా తల ఆడించాడు శ్రీకాంత్.

ఎవరో బీడీలకోసం వస్తే, బీడీలకట్ట యిచ్చి, చిల్లర ఇవ్వడంలో నిమగ్నుడైనాడు మస్తాన్.

సూర్యాస్తమయం కావడంతో మునిమాపు మెల్లగా అలుముకుంది. అయితే ఇంకా వీధి దీపాలు డ్యూటీలో ప్రవేశించలేదు.

"వస్తాను బ్రదర్" అంటూ అక్కణ్ణుంచి లేచి ఇంటికి వెళ్ళాడు శ్రీకాంత్.

6

మొదటి పీరియడ్ అయింది. రెండో పీరియడ్ ఖాళీ ఆ సమయంలో ఇంగ్లీషు కాంపోజిషన్ పుస్తకాలు ముందువేసుకొని కూర్చుంది స్వరూప మళ్ళీ మూడో పీరియడ్‌గానీ క్లాసు లేదు. ఆ క్లాసులో ప్రోజ్ వుంది. ప్రిపేర్ కావల్సిన పనిలేదు. ఆ విశ్రాంతి సమయంలో పదిపుస్తకాలైనా దిద్దుదామను కుంది. స్టాఫ్‌రూమ్‌లో ఎక్కువమంది లెక్చరర్లు లేరు. ఇద్దరు ట్యూటర్లు కాంపోజిషన్ పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు. ఇద్దరు లెక్చరర్లు తమకు ఈ లోకంతో నిమిత్తంలేనట్లుగా చెస్ ఆడుకుంటున్నారు.

"ప్రిన్సిపల్‌గారు రమ్మంటున్నారు" అన్నాడు ఓ ప్యూన్ వచ్చి స్వరూపతో.

స్వరూప చివుక్కున తలెత్తి, "ఎందుకు?" అంది.

"నాకేం తెలుస్తుందండీ" అన్నాడు ఆ ముసలి ప్యూను.

రెడ్ బాల్‌పాయింట్ పెన్‌కు మూసి, వెంటనే ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళింది స్వరూప-తనని ప్రిన్సిపాల్ ఎందుకు పిలిచిందో వూహించలేకుండా.

ప్రిన్సిపాల్ ఏవో ఆఫీసు కాగితాలు చూస్తూన్నది. కొన్ని క్షణాలపాటు ఆవిడ ఎదుట నిలబడి, గమనించే స్థితిలో ఆవిడ లేకపోయేసరికి కూర్చుంది స్వరూప పక్క రూమ్‌లోంచి టైపుమోత వినిపిస్తోంది.

ఓ నిముషం తర్వాత స్వరూపను చూసింది ప్రిన్సిపాల్. అయినప్పటికీ మాట్లాడలేదు.

"పిల్చారట" అంది స్వరూప ముక్తసరిగా.

ప్రిన్సిపాల్ తల ఆడించింది. ఆ రోజు వచ్చిన ఉత్తరాలలో ఒక ఉత్తరాన్ని తీసి, నిశ్శబ్దంగా స్వరూపకు ఇచ్చింది. దాన్ని చదువుకున్న స్వరూప మొహం అంతలోనే రంగులు మారిపోయింది.

"గవర్నమెంటు సర్వీసు అంటే అంతే మిస్ స్వరూపా! ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. ఒక్కోసారి క్లాస్‌రూమ్‌లో పాఠం చెబుతూండగానే, అర్థాంతరంగా వొదిలిపెట్టవల్సి వుంటుంది. అన్నిటికీ ప్రిపేరయ్యే ఈ సర్వీసులో చేరాలి" అంది ప్రిన్సిపాల్.

స్వరూప ఏం మాట్లాడలేకపోయింది. ఆమె మొహంలో హఠాత్తుగా మారిన రంగుల్నిబట్టి, ఎంతగా హతాశురాలైందో గమనించింది ప్రిన్సిపాల్.

స్వరూపకు కర్నూలు ఉమెన్స్ కాలేజీకి ట్రాన్స్ఫర్ వొచ్చింది. అంత త్వరగా ట్రాన్స్ఫర్ వస్తుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు.

"ఇవాళో రేపో మీకు ట్రాన్స్ఫర్ ఆర్డర్లు వస్తాయి" అంది ప్రిన్సిపాల్.

స్వరూప మెల్లగా తల ఆడించి అక్కడ్నుంచి లేచి వచ్చింది

ఆమెలో దుఃఖం పడదోసుకురాసాగింది. దాదాపు మూడేళ్ళపాటు ఆ కాలేజీకి అలవాటుపడి అంకితమైపోయింది స్వరూప. దాన్ని వొదిలి వెళ్ళాలంటే మహా బాధగావుంది. ఆమె మనసులో ముఖ్యంగా రెండు సమస్యలు మెదిలాయి. ఒకటి-అత్యంత సన్నిహితులైన స్నేహితురాండ్రను వొదిలిపోవడం; రెండోది శ్రీకాంత్-ఎక్కడుంటాడు అనేది

దిగులుగా ముద్రితమైన మొహంతో స్టాఫ్‌రూమ్‌కెళ్ళింది స్వరూప. మనసు కాంపోజిషన్ పుస్తకాలమీదకు పోలేదు. రెండు నిముషాలపాటు ఆలోచిస్తూ కూర్చుంది. ఆలోచించినకొద్దీ అవ్యక్తమైన దుఃఖం మనసులో మెరమెరలాడ సాగింది. వెంటనే లేచి కెమిస్ట్రీ లేబరేటరీకి వెళ్ళింది. అక్కడ ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులకు ఏదో చెబుతూన్న సుజాతదగ్గర కెళ్ళింది. స్వరూప మొహంలోని బరువైన మేఘాల్ని గమనించిన సుజాత, "ఏమిటే అలా వున్నావు? ఒంట్లో బావుండలేదా?" అంది ఆదుర్దాగా.

తనకు ట్రాన్స్ఫర్ వచ్చిన సంగతి చెప్పింది స్వరూప.

"మై గాడ్ ! అప్పుడే ఎట్లా వచ్చిందే ట్రాన్స్ఫర్ ?" అంది సుజాత ఆశ్చర్యంతో కనుబొమలు ఎగురవేస్తూ

"మన చేతుల్లో ఏముంది ?" అంది స్వరూప.

"హైద్రాబాద్ వెళ్ళి డి పి ఐ. ఆఫీసులో ట్రై చేస్తే !"

"దేనికి ?"

"ట్రాన్స్ఫర్ ఆపడానికి."

"ట్రై చేయడానికి ఎవరున్నారు ! అది అయ్యే పని కాదు ట్రాన్స్ఫర్ చేయడం వాళ్ళ ధర్మం. ఎక్కడికి ట్రాన్ఫర్ చేస్తే అక్కడికి వెళ్ళడం మన ధర్మం" అంది సుజాత నిమ్మకు నీరెత్తినంత నిబ్బరంగా.

తర్వాత వాళ్ళిద్దరూ బోటనీ లేబరేటరీకి వెళ్ళారు. ఆ దుర్వార్తను స్వరూపే సుభాషిత చెవిలో వేసింది. సుభాషిత ఆశ్చర్యంతో స్తబ్ధురాలైంది. తేరుకోవ డానికి ఆమెకు ఒక నిముషం పట్టింది.

"ఏంచేయడమే ?" అంది సుభాషిత అమాయకంగా.

"అదే అర్థంకావడంలేదు" అంది సుజాత అయోమయంగా.

"చేసేదేముం ది? తట్టా బుట్టా సర్దుకొని వారంరోజుల లోపల కర్నూలు కాలేజీలో జాయిన్ కావడమే కర్తవ్యం" అంది స్వరూప

"ట్రాన్స్‌ఫర్ ఆపడానికి ప్రయత్నం చేస్తే !" అంది సుభాషిత సలహాగా.

"ఎవరిద్వారా ?" అంది సుజాత.

సుభాషిత మాట్లాడలేకపోయింది. వాళ్ళకుగానీ, వాళ్ళ తల్లిదండ్రులకు గానీ, బంధువులకుగానీ మంత్రివర్గంలో, ఆఫీసర్లలో తెల్సినవాళ్లు ఎవ్వరూ లేరు. సిఫార్సు చేయించి ట్రాన్స్‌ఫర్ ఆపుచేయించే స్థితి ఎవరికీలేదు.

ఆ రోజు సాయంకాలం శ్రీకాంత్‌కు తెలిసింది అక్కయ్యకు వచ్చిన ట్రాన్స్‌ఫర్‌ను గురించి. ఏమీ వ్యాఖ్యానించలేదు అతను. పైపెచ్చు అక్కయ్య ఆవేదనకు అర్థంలేదన్నాడు.

"గవర్నమెంట్ ఉద్యోగం అన్న తర్వాత ట్రాన్స్‌ఫర్లు రాకుండా ఉంటాయా ? అవతల ఎవరో గుంటూరుకోసం ట్రై చేసుంటారు. ట్రాన్స్‌ఫర్ చేసుంటారు" అన్నాడు శ్రీకాంత్.

"నీ ఫ్రెండ్స్‌కు తెలిసినవాళ్ళెవ్వరూ లేరా – ట్రాన్స్‌ఫర్ ఆపించడానికి" అంది సుభాషిత.

"అది మంచిపద్ధతి కాదక్కయ్యా ! అలాంటి మార్గాలను నేను ప్రోత్స హించను. జీవితాంతం ఒకేచోట వుద్యోగం చేస్తే బోర్ కొడుతుంది. పదివూళ్లు తిరిగి, పదిచోట్ల వుద్యోగం చేస్తేగానీ జీవితంలో అనుభవాలు రావు" అన్నాడు శ్రీకాంత్.

"నాకు ఎక్కడికి వెళ్ళటానికైనా బాధలేదురా ! నీ గురించే వర్రీ !" అంది స్వరూప తమ్ముణ్ని ఉద్దేశించి.

"నా గురించా ? నీకు వర్రీ దేని కక్కయ్యా ! నే నేమైనా పాలుతాగే పిల్లాణ్ణా ! ఎక్కడైనా నిక్షేపంగా ఉండగలను. చదవుకోగలను" అన్నాడు శ్రీకాంత్ నిర్విచారంగా.

"ఎక్కడో ఉండడం దేనికి ? ఇక్కడే ఉండవుగాని" అంది సుజాత.

"శ్రీకాంత్ గురించి నువ్వేమీ దిగులు పెట్టుకోకు స్వరూ. ఈ ఇంట్లోనే, మా దగ్గరే వుంటాడు" అంది సుభాషిత

"మీకు బర్డన్ దేనికిలేవే ! ఎక్కడైనా రూమ్ తీసుకొని వుంటాడులే. నెల నెలా డబ్బు పంపిస్తాను" అంది స్వరూప.

"అదేమిటే కొత్తగా మాట్లాడుతున్నావు నీకు తమ్ముడు అయినవాడు మాకు మాత్రం కాడా ? వాడ్ని గురించి నువ్వేమీ వర్రీ పెట్టుకోకు. మా అదుపు ఆజ్ఞల్లో వుంచుతాం. చక్కగా చదివిస్తాం. ఏం ?" అంది సుజాత.

"వాడే మాకు మగదిక్కు. కాస్త అండగా వుంటాడు. బజారు కెళ్ళి సరుకులూ అవీ తెచ్చిపెడుతూంటాడు. వాడ్ని చదివించే బాధ్యత మాది. నువ్వేమీ దిగులుపడకు స్వరూ. ఇంతకాలమూ ఒక ఇంట్లో మనుషుల్లాగా కల్సిమెల్సి బ్రతికాం ఇప్పుడు నీకు ట్రాన్స్ఫర్ వస్తేమటుకు శ్రీకాంత్‌ను ఇక్కడ వుంచడానికేం ?" అంది సుభాషిత.

"అది కాదే!..." అంటూ ఏదో సందేహాన్ని వెలిబుచ్చబోయింది స్వరూప.

"నువ్వేమీ అడ్డు చెప్పకే ! శ్రీకాంత్‌ను జాగ్రత్తగా చూసుకుంటాం."

"నువ్వు ఇక్కడున్నట్లే వాడ్ని ట్రీట్ చేస్తాం." అన్నారు వాళ్ళిద్దరూ.

స్వరూప ఎదురు చెప్పలేకపోయింది. పైపెచ్చు స్నేహితురాండ్ర స్నేహపూరితమైన ఆప్యాయతకూ, ఆదరణకూ ఆమె మనస్సు కరిగిపోయింది. నేత్రాంచలాలు ఆర్ద్రమైనాయి. కొంతంత బరువు దిగిపోయినట్లయింది అంత అభిమానంతో, స్నేహవాత్సల్యంతో, మమతానుబంధంతో తమ్ముడ్ని వుంచుకుంటారని ఆమె అనుకోలేదు. బయట రూమ్ తీసుకొనివుంటే అల్లరచిల్లర స్నేహాలకు మరిగి, చదువుమీద శ్రద్ధపోయి, జులాయి వెధవలాగా తయారయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి ప్రమాదం రాకుండా వుండాలంటే వాడు ఆ ఇంట్లోనే వుంటే మంచిది. వాడు ఏంచేసినా ఉత్తరాలద్వారా తెలుస్తుంది. ఉడుకురక్తంతో ఏ ఆకతాయి కృత్యం చేసినా మందలించే చనువూ, హక్కూ, అధికారమూ సుభాషిత, సుజాతల కున్నాయి అనుకుంది స్వరూప.

వాళ్లు మాట్లాడుకొనేటప్పుడు శ్రీకాంత్ అక్కడే ఉన్నాడు. కాని వాళ్ళ సంభాషణలో జోక్యం చేసుకోలేదు వాళ్లతో ఆ యింట్లో వుంటాననీ అనలేదు; విడిగా రూమ్‌తీసుకొని చదువుకుంటాననీ అనలేదు.

చివరకు స్వరూప అంది :

"వాడు ఈ ఇంట్లో వుండటం మీకు ఒక రకంగా సమస్యేనే ! ఎందుకంటే వాడికి ఆవేశం ఆరుపాళ్లు, ఆలోచన మూడుపాళ్లు ప్రతిదానికి మోటుగా 'ఢీ'కొనే తత్వం. స్పోర్ట్స్‌లో వుండే టెంపర్‌మెంట్ లౌకిక ప్రపంచంలో పనికిరాదు. లోకంలో ఎక్కడ, ఎవరికి అన్యాయం జరుగుతున్నా తనకే

జరిగినట్టు 'ఫీల్' అవుతాడు. దానితో లేనిపోని ఇబ్బందుల్ని కొనితెచ్చు-కుంటూ వుంటాడు. అదే వాడ్ని గురించి నా భయం. ఏది ఏమైనా నాకు ట్రాన్స్‌ఫ రొచ్చింది. మంచికో, చెడుకో! వాడ్ని ఇంట్లోనే పెట్టుకుంటా మంటున్నారు గాబట్టి, వాడ్ని గురించిన వర్రీ కూడా నాకు లేదు - మీకు అనవసరంగా శ్రమ యిస్తున్నాననే బాధ తప్ప."

"మాకు ఇచ్చే శ్రమేముందే స్వరూ! పోన్లే ఎడ్జస్ట్‌మెంట్! మేం ఇక్కడ పర్మనెంటుగా వుంటామా, ఏమిటి? ఎప్పుడైనా మాకు ట్రాన్స్‌ఫర్లు రావొచ్చు. మరో ఏడు గడిస్తే శ్రీకాంత్ చదువూ అయిపోతుంది" అంది సుజాత.

"అంతే మరి" అంది సుభాషిత.

"నెలా నెలా నేను మీకు డబ్బు పంపిస్తాను గానీ, వాడు అడిగినంతా ఇవ్వకండి. రేషను ప్రకారం ఇవ్వండి" అంది స్వరూప.

'అల్లాగే' అన్నట్లు వాళ్ళు తలలు ఆడించారు.

కర్నూలు వెళ్లటానికి రైలు ఎక్కేవరకూ స్వరూప తమ్ముడికి నయానా, భయానా హితబోధ చేస్తూనే ఉంది. రోజూ కాలేజీకి వెళ్లమంది; శ్రద్ధగా చదువుకోమంది; ఇతర విషయాలలో జోక్యం పెట్టుకోవద్దంది; విప్లవ సాహిత్యం చదవొద్దంది; కాలేజీ పుస్తకాలు తప్ప మరే పుస్తకాలు చదవకూడదని ఆంక్ష పెట్టింది; ఆటలకోసం ఎక్కువకాలాన్ని వినియోగించవద్దంది; కాలేజీ వొదల గానే నేరుగా ఇంటికి రమ్మంది; అక్కయ్యల మాటలు వినమంది; వాళ్లకు ఎట్టి పరిస్థితులలోనూ ఎదురు చెప్పకూడదంది; అందరిలోనూ సఖ్యతగా, సౌమ్యంగా, సామరస్యంగా ఉండమంది; ఎక్కువగా సినిమాలు చూడవద్దన్నది; అక్కయ్యలకు రోజూ కాలేజీ వరకూ, కాలేజీనుంచి వచ్చేటప్పుడూ తోడుగా వుండమన్నది; ఆగ్రహం, ఆవేశం, మాట జారడం మొదలైనవి అదుపులో వుంచుకోమన్నది; డబ్బు ఎక్కువగా ఖర్చుచేయవద్దన్నది; వారానికో ఉత్తరం వ్రాయమంది; అతని ప్రవర్తనను గురించి ఉత్తరాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటానన్నది.

స్వరూపను ట్రైన్ ఎక్కించడానికి సుజాత, సుభాషిత, శ్రీకాంత్ స్టేషన్‌కు వచ్చారు.

తమ్ముడ్ని గురించిన జాగ్రత్తలు సేహితురాంద్రకు కూడా చెప్పింది స్వరూప.

"వాడేదైనా తప్పుచేస్తే, శ్రద్ధగా చదువుకోకపోతే నిర్మొహమాటంగా

మందలించండి. మీ మాట వినకపోతే నాకు ఉత్తరం వ్రాయండి, లేదా టెలిగ్రాం ఇవ్వండి. మీరేమీ బెరవకండి."

సుజాత, సుభాషితలు 'అట్లాగే' అన్నట్టు తలలు ఆడించారు.

ట్రైన్ బయలుదేరాక, కనుచూపుమేర వరకూ ప్లాట్‌ఫారం మీద స్వరూపకు తమ్ముడూ, స్నేహితురాండ్రూ చేతులు గాలిలో వూపుతూనే వున్నారు.

7

తెల్లవారితే ఆదివారమనగా ఆ రోజు శ్రీధర్‌తో కలిసి హిందీ సినిమాకు వెళ్ళాడు శ్రీకాంత్. అతను రెండో ఆట సినిమాకు వెళ్లటానికి సుజాత, సుభాషితలు ఒక పట్టాన ఒప్పుకోలేదు. వాళ్లను వొప్పించటానికి అతనికి పదినిముషాలు పట్టింది.

"పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. సినిమాలు, షికార్లేమిటి ?" అంది సుజాత.

"సినిమా కెళ్ళి రెండువారాలైంది అక్కా !" అన్నాడు శ్రీకాంత్ బ్రతిమి లాడుతూ.

"రెండువారాలైతే మాత్రం వెళ్ళాలని వుందా ? మేం చదువుకునే రోజుల్లో నెల కొక్క సినిమాయే చూసేవాళ్లం. అదైనా పరీక్ష లొస్తున్నాయంటే మూడు నెల్లు ముందుగా మానేసేవాళ్లం" అంది సుభాషిత.

"ఆ రోజులు వేరు అక్కా ! ఈ రోజుల్లో స్టూడెంట్స్ పరీక్ష రేపనగా కూడా సినిమా చూస్తారు - రిలేక్స్ కావటానికి. పంపించు అక్కా ! అవతల ఫ్రెండ్ వచ్చి కూర్చున్నాడు. పోకపోతే పరువుపోతుంది" అన్నాడు శ్రీకాంత్ దీనంగా అర్థిస్తూ.

సుజాత, సుభాషితలు మొహమొహాలు చూసుకొని మెత్తపడ్డారు.

"శనివారం రాత్రి సినిమా. ఆదివారం నిద్ర. చదువుకొనేదెప్పుడోయ్ !" అంది సుజాత కాస్త కరుగ్గా.

రేపు పగలు నిద్రపోనక్కా. ప్లే గ్రౌండ్‌కు కూడా పోను. తప్పకుండా చదువుకుంటాను" అన్నాడు శ్రీకాంత్ నమ్మకాన్ని కలిగించే గంభీరతతో.

"నమ్మమంటావా ?" అంది సుభాషిత.

"రేపు చూడక్కా !" అన్నాడు శ్రీకాంత్ ఉషారుగా.

ఆపైన అక్కలిద్దరూ అతను సినిమాకు వెళ్లటానికి అనుమతి యిచ్చారు.

"మా అక్కలు ఎంతో మంచివారు. నా కోర్కెను కాదనరు" అంటూ భుజాలు ఎగురవేస్తూ, ఎంతో సంతోషంగా వెళ్లాడు శ్రీకాంత్.

రెండో ఆట సినిమా వొదిలాక, నడుచుకుంటూ ఇంటికొచ్చాడు శ్రీకాంత్. అప్పటికి దాదాపు ఒంటిగంటైంది.

వీధి మలుపు తిరగ్గానే తన ఇంట్లో లైట్లు వెలుగుతూండటాన్ని చూశాడు శ్రీకాంత్. వాకిట్లో నలుగురైదుగురు మనుషులు కూడా వున్నారు. శ్రీకాంత్ గుండె దడదడలాడింది.

ఏమైంది ?

ఆ వేళప్పుడు ఇంట్లో లైట్లు ఎందుకు వెలుగుతున్నాయి ?

వాకిట్లో మనుష లెందుకున్నారు ?

ఎవరైనా దొంగలు పడ్డారా ?

శ్రీకాంత్ యాభై మీటర్ల దూరం పరుగెత్తి, ఇంటికి చేరుకున్నాడు

ఇరుగుపొరుగువారు వాకిట్లో ఎదురైనారు. వాళ్ళల్లో పూర్ణచంద్ కూడా వున్నాడు.

"ఏమైంది" అన్నాడు శ్రీకాంత్ గుండె గొంతులోకి వచ్చినంత ఆదుర్దాగా.

"ఎవడో దొంగ వచ్చాడట. ఆడవాళ్ళు కేకలువేస్తే మేం వచ్చాం" అన్నాడు పక్కింటి సుబ్రహ్మణ్యం. అతను బ్యాంకులో గుమాస్తా.

మూడు అంగల్లో ఇంట్లో కెళ్ళాడు శ్రీకాంత్. హాలులో సుభాషిత, సుజాతలు భయంతో వొణికిపోతూ కూర్చునివున్నారు. వాళ్ల మొహాల్లో దడుపు కొట్టవచ్చినట్టు కనబడుతూంది.

"ఏమైందక్కా ?" అన్నాడు శ్రీకాంత్ సుజాత నుద్దేశించి.

ఆమె పిచ్చిగా చూడటం తప్ప నోరు విప్పలేదు.

"ఏమైందక్కా ?" అన్నాడు శ్రీకాంత్ సుభాషిత నుద్దేశించి.

ఆమె మొహంలో వొణుకు కనబడుతూంది. మాట్లాడే స్థితిలో లేదు.

నాగరత్నమ్మ మండిగంమీద రుబ్బురోలులా కూర్చుంది. ఆవిడలో ఏ భయమూ, భ్రాంతీ, చలనమూ లేవు.

"ఏమైంది నాగరత్నమ్మా !" అన్నాడు శ్రీకాంత్.

"ఏమో బాబూ ! నేను కళ్ళతో చూశానా, పెట్టానా ! వంటింట్లో ముసుగుపెట్టి మామూలుగా నిద్రపోతున్నాను. సుజాతమ్మగారు ఒక్కసారి అరిచారు 'దొంగ' 'దొంగ' అని. గబుక్కున లేచాను. బయటికొచ్చేతలికి ఎవరూ అగుపడలా. అంతలో వాళ్లూ వీళ్లూ వొచ్చారు అంది నాగరత్నమ్మ దీర్ఘాలు తీస్తూ.

"ఆ దొంగను నువ్వు చూశావా అక్కా !" అన్నాడు శ్రీకాంత్, సుజాత నుద్దేశించి.

చూడలేదన్నట్టు కింది పెదవి విరిచింది సుజాత.

"మరి."

సుజాత, సుభాషితలు మాట్లాడలేదు. వాళ్ళను ఆవహించిన భయం ఇంకా సద్దుమణగలేదు. వాళ్ళ కళ్ళముందు ఓ ముసుగువ్యక్తి మెదులుతూనే వున్నాడు.

"ఏం జరిగిందో చెప్పండక్కయ్యా ! నే నొచ్చానుగా. ఇంకా భయం దేనికి ? మీరు వివరాలు సరిగ్గా చెబితే దొంగ ఆచూకీ తీయడానికి వీలుగా వుంటుంది" అన్నాడు శ్రీకాంత్.

అప్పుడే పక్కింటి సుబ్రహ్మణ్యం, ఎదురింటి పూర్ణచంద్ బయటినుంచి లోపలకు వచ్చారు. సుబ్రహ్మణ్యం తెల్ల లుంగీమీద బనీను వేసుకున్నాడు. యాభై ఏళ్ళకు పైగా వుంటాయి. అర్ధరాత్రిపూట ఇళ్ళల్లోకి దొంగలు రావటం ఆయనకు కొత్త విషయమేమీ కాదు. ఆయన సర్వీసులో ముప్పై ప్రదేశాలు చూశాడు. ప్రతి ఊళ్లోనూ దొంగల బెడద వుండనే వుంటుంది.

పంచరంగుల బాటిక్ ప్రింటిగ్ లుంగీమీద, గ్లాస్కో లాల్చీ ధరించాడు పూర్ణచంద్. కళ్ళు ఎర్రగా పత్తికాయల్లా వున్నాయి. అప్పటికింకా అతను నిద్రపోలేదు. విస్కీ తాగుతూనే వున్నాడు. జులపాల జుత్తు, చెంపలు దిగిన పట్టీలు. పొట్టి మీసాలు. ఉబ్బిన బూరెల వంటి బుగ్గలతో గంభీరమైన మొహం. పొడుగుకు సరిపడిన బొద్దుగా వుంటాడు.

"ఇంట్లో ఆడాళ్ళను వొదిలేసి రెండో ఆట సినిమాకు వెళ్ళావా బాబూ !" అన్నాడు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ నుద్దేశించి.

"ఇంటికి దొంగ వస్తాడని ఆ కుర్రాడు కలగన్నాడా ?" అన్నాడు పూర్ణచంద్.

"మీ రెవరైనా చూశారా దొంగను ?" అన్నాడు శ్రీకాంత్.

"చూస్తే వూరుకుంటామా ? పట్టుకుని, వీధిలో స్తంభానికి కట్టివేసి, పోలీసులకు ఫోన్‌కొట్టేవాళ్ళం కాదూ !" అన్నాడు పూర్ణచంద్.

"ఏదో అయిపోయింది. ఇంకా అదృష్టం. పూచికపుల్లకూడా పోలేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అసలా దొంగ ఎందుకొచ్చాడో !" అన్నాడు పూర్ణచంద్.

శ్రీకాంత్ చురుగ్గా పూర్ణచంద్ కేసి చూశాడు.

"దొంగ లెందుకొస్తారు ? వస్తువుల్ని దొంగిలించుకుపోవటానికి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

దొంగల్లో అనేక రకాలమంది వుంటారు. అందరూ కేవలం వస్తువుల్ని దొంగిలించుకుపోవటానికే రారు సుబ్రహ్మణ్యంగారూ ! కొంతమంది కొన్ని కొన్ని దురుద్దేశాలతో గోడలు దూకవచ్చు" అన్నాడు పూర్ణచంద్ వ్యంగ్యంగా.

సుబ్రహ్మణ్యం అతని మాటల వెనుక దాగివున్న అర్థాన్ని గ్రహించి ఆశ్చర్యంగా చూశాడు.

శ్రీకాంత్‌కు బుస్సున కోపం వచ్చింది.

"దొంగ ఎందుకొచ్చాడనే దానిమీద ఇప్పుడు చర్చ అనవసరం. మా ఇంట్లో వస్తువులేం పోలేదు. దయచేసి మీరు వెళ్ళిపోతారా !" అన్నాడు శ్రీకాంత్ దూకుడుగా.

సుబ్రహ్మణ్యం కనురెప్పలు అల్లలాడించాడు.

పూర్ణచంద్‌కు అవమానంతో మొహం జేవురించింది.

"మీ ఇంట్లో ఉండిపోవటానికి వచ్చాననుకున్నావా ఏమిటి ? ఏదో అరంగులు కేకలువేస్తే, ఏం జరిగిందోనని, వాకబు చేయటాని కొచ్చాం. ఏదో సానుభూతి సాయం..."

"మీ సానుభూతీ, సహాయాలు మాకేం అవసరంలేదు. వాటిని అర్థించే ఇబ్బందుల్లో ఏమీ లేం" అన్నాడు శ్రీకాంత్ కట్టెవిరిచి పొయ్యిలో పెట్టినట్టుగా.

వెళ్ళిపోయాడు పూర్ణచంద్.

బుసలుకక్కుతు

సుబ్రహ్మణ్యం కూడా అతన్ని అనుసరించాడు.

వెలుగుతున్న లైట్లన్నీ ఆర్పివేసి, వీధితలుపు గడియపెట్టి, ఇంట్లోకి వచ్చాడు శ్రీకాంత్. అప్పటికి సుజాత, సుభాషితలు హాలులో కూర్చుని వున్నారు. నాగరత్నమ్మ మళ్ళీ వంటగదిలో చేరి చాపమీద మేను వాల్చింది.

"అసలేం జరిగిందో చెప్పు అక్కా !" అన్నాడు శ్రీకాంత్ మళ్ళీ సుజాత నుద్దేశించి.

"మేం వద్దన్నకొద్దీ రెండో ఆట సినిమా కెళ్ళావు అదెవడో కనిపెట్టి ఇంట్లోకి రావటానికి ధైర్యం చేశాడు" అంది సుభాషిత.

"ఇలా జరుగుతుందని నాకేం తెలుసు ? ఎన్నిసార్లు రెండో ఆట సినిమా కెళ్ళలేదూ !" అన్నాడు శ్రీకాంత్.

"ఏమో నాకు భయంగా ఉంది శ్రీకాంత్. ఆ వచ్చినవాడు దొంగతనానికి రాలేదు" అంది సుజాత.

"మరి, ఎందుకొచ్చాడంటావు ? వాడ్ని గుర్తుపట్టగలవా ? ఈ లోకాలిటీ వాడేనా ?" అన్నాడు శ్రీకాంత్.

"ఏమో తెల్లటి పంచె ముసుగుగా కప్పుకున్నాడు. ముందుగా తలుపు తట్టాడు. నువ్వనుకున్నాను. మళ్లీ అనుమానం వొచ్చింది. నువ్వయితే 'అక్కా' అని పిలిచేవాడివి గదా ! కొన్ని క్షణాలపాటు తటపటాయించాను. తలుపు తీయలేదు. సుభా మొద్దునిద్రలో వుంది. 'ఎవరు' అన్నాను. 'నీ మొగుడ్ని!' అన్నాడు వాడు. స్టన్ అయ్యాను. వెంటనే హాలులోనూ, బయటా లైట్లు వేశాను. సుభాను లేపాను. 'దొంగ' 'దొంగ' అని అరుస్తూ కిటికీ తలుపులు తెరిచాను. అప్పటికే వాడు గోడదూకి బయటకు పోతున్నాడు. తెల్లముసుగు కప్పుకున్నాడు. గుర్తుపట్టటానికి వీలులేకపోయింది" అంది సుజాత.

పళ్లు పటపట కొరికాడు శ్రీకాంత్ కోపంతో. పిడికిలి బిగించాడు. హాలులో అటూ అటూ పచార్లు చేశాడు చల్లారని ఆవేశంతో.

"వాడు నిజంగా దొంగతనానికే వచ్చాడంటావా ?" అంది సుభాషిత.

"కాదు" అన్నాడు శ్రీకాంత్ గర్జిస్తూ.

"మేం కూడా అలానే అనుకున్నాం అల్లరిచేయటానికే వచ్చి వుంటాడు" అంది సుజాత. భయంతో ఆమె గొంతు కొద్దిగా వొణికింది.

శ్రీకాంత్ మొహం గంభీరమై, కొండరాయిలా గట్టిపడింది.

"ఆ స్కూటర్ వాడే నేమో వీడు" అంది సుభాషిత.

"కావొచ్చు" అంది సుజాత.

"మీరేం భయపడకండి. వాడి అంతు నేను చూస్తాను. వాడు ఈ చుట్టు పక్కలవాడే అయివుంటాడు. గోముఖవ్యాఘ్రాలు ఎన్నో మన చుట్టూ తిరుగుతూ వుంటాయి సమయంకోసం కాచుకొని, కబళించటానికి వేచి వుంటాయి. వాడు దొరక్కపోడు. వాడి రక్తం కళ్ళజూడకపోను. నా తడాఖా ఏమిటో చూపిస్తాను" అన్నాడు శ్రీకాంత్ ఆగ్రహావేశంతో వూగిపోతూ.

"ఎవడు వాడు ? నీ కేమైనా అనుమానముందా ? అంది సుజాత.

"ఈ వీధిలో వాడెవరైనా..." అంది సుభాషిత.

శ్రీకాంత్ ఏం మాట్లాడలేదు. అతని అనుమానం పూర్ణచంద్ మీదికి పోయింది. ఇంత సాహసానికి వాడే పాల్పడి వుంటాడు. అంత ధైర్యం మరెవ్వరికి వుంటుంది ? తాను సినిమాకు వెళ్లేటప్పుడు వాడు స్కూటర్ మీద ఇంటికొస్తూ రోడ్డుమలుపులో ఎదురయ్యాడు. దుర్మార్గుడు. గోముఖ వ్యాఘ్రం. అక్కయ్యలమీద వాడి కన్ను ఎప్పుడో పడింది. అందుచేతనే రోజూ ఉదయం పదిగంటలకు తాము రోడ్డుమీద కొచ్చినప్పుడు వాడూ షాపుకు బయలుదేరి రోడ్డుమీద కొస్తాడు. తాము బయల్దేరేవరకూ రోడ్డు పక్కనే స్కూటర్ మీదనే వుండి, అక్కయ్యలకేసి ఆవురావురుమంటూ చూస్తూనే వుంటాడు. దుష్టుడు. మస్తాన్ చెప్పింది కరక్టే ! సందేహం లేదు. ఈ దుస్సాహసం వాడిదే ! అనుకున్నాడు శ్రీకాంత్. కాని తన అనుమానాన్ని బయటకు చెప్పలేదు, అక్కయ్యలు భయపడతారనుకున్నాడు.

"ఏం శ్రీకాంత్ ! నీ కెవ్వరిమీదా అనుమానం లేదా ?" అంది సుజాత మళ్ళీ

"ఇట్లాంటి విషయాల్లో అనుమానాలు పెట్టుకుని ప్రయోజన మేముం

దక్కయ్యా! స్పష్టంగా చూసి, పట్టుకోవాలి. ఎంతమందిని అనుమానించ గలం? అనుమానించి అడిగే విషయం కూడా కాదు" అన్నాడు శ్రీకాంత్.

"ఏమిటో నాకు భయంగా వుంది. ఇల్లు మారితేనో" అంది సుభాషిత.

"ఇల్లు మారినంత మాత్రాన అవతల మనుషులు మారతారా? ఇంకో చోటుకు పోతే, వాళ్ళు అక్కడకు రావచ్చు. అల్లరిపెట్టేవాళ్ళకు గుణపాఠం నేర్పాలిగానీ, వాళ్ళకు భయపడి పారిపోతే, వెంటాడి తరుముతారు" అన్నాడు శ్రీకాంత్.

"మరేం చేద్దామంటావ్?" అంది సుజాత.

"మీరేం భయపడకండి. మీ రక్షణ బాధ్యత నాది. నిశ్చింతగా వుండండి. మీమీద ఈగవాలనీయకుండా నేను చేస్తాను" అన్నాడు శ్రీకాంత్.

"ఏం చూస్తావ్? చూశావుగా. రెండో ఆట సినిమా కెళ్ళావు. ఆ అదను కనిపెట్టి పోకిరీవాడెవడో గోడదూకి లోపల కొచ్చాడు. ఈ సంగతి నలుగురికీ తెలిస్తే అలుసైపోమూ. అంది సుజాత

"నలుగురికీ తెలియకుండా వుంటుందా? రేపు ఉదయమే పేటంతా మ్రోగి పోతుంది. నానా రకాలుగా చెప్పుకుంటారు" అంది సుభాషిత.

"చూద్దాం. ఇదేదో కుట్రపన్ని చేస్తున్నట్టుగా వుంది. ఆ కుట్ర వెనుక ఎవరున్నారో తెల్సుకుంటేగానీ, మనం ముందుకు పోవటానికి వీల్లేదు. మీరేం భయపడకండి. ఏం వొచ్చినా నేను చూసుకుంటాను" అన్నాడు శ్రీకాంత్ అభయం యిచ్చినంత ధీమాగా.

"మాకు భయమేమీ లేదు. మా గురించి అనవసరంగా నువ్వు తగాదాలకు దిగుతావేమోననే భయం. అసలే నీది దూకుడు తత్వం. ఒంటికాలుమీద కొండను ఢీ కొంటానంటావు. ఆవేశంలో వెనుకా ముందూ చూడవు. ఎదుటి వాళ్ళ బలాన్ని గ్రహించవు" అంది సుజాత.

శ్రీకాంత్ హాలులో పచార్లుచేస్తూనే ఆలోచించసాగాడు.

రాత్రి రెండుగంటలు కావస్తోంది.

"రేపు ఆలోచించవచ్చులే. పడుకుందాం" అంది సుభాషిత.

తెల్లవారుఝామున నాలుగు గంటలకుగానీ శ్రీకాంత్‌కు నిద్ర పట్టలేదు. అప్పటిదాకా పూర్ణచంద్‌ను గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు.

8

స్వరూప కర్నూలు కాలేజీలో చేరింతర్వాత దాదాపు వారానికో ఉత్తరం వ్రాస్తూనే వుంది స్నేహితురాంద్రకు. సుజాత, సుభాషితలు కూడా సమాధానాలు

వ్రాస్తూనే వున్నారు. అప్పుడప్పుడూ శ్రీకాంత్ కూడా ఉత్తరాలు వ్రాస్తున్నాడు. అయితే ఆరోజు రాత్రి ఇంట్లో ఓ వ్యక్తి ప్రవేశించిన సంగతి స్వరూపకు ఎవ్వరూ వ్రాయలేదు. భయపడుతుందని వూరుకున్నారు.

ఆ రోజు ఆదివారం.

సుజాత, సుభాషిత, శ్రీకాంత్ ఇంటిదగ్గర ఉన్నారు. వాళ్ళు ముగ్గురూ మ్యాట్నీకి వెళదామనుకున్నారుగానీ. 'ఏ సినిమాకు వెళ్లాలి ?' అనే దానిమీద ముగ్గురికీ ఏక మనస్కత కుదరక మానివేశారు. సుజాత హిందీ సినిమాకు వెళదామంది; సుభాషిత తెలుగు సినిమాకు వెళదామంది; శ్రీకాంత్ ఇంగ్లీషు సినిమాకు వెళదామన్నాడు. ఓ పావుగంటసేపు వాదించుకున్నారు. చివరకు విరమించుకున్నారు. నాగరత్నమ్మను పిలిచి ఉల్లిపాయ పకోడీలు తయారు చేయించుకుని తింటూ కబుర్లు చెప్పుకొనేందుకు నిర్ణయించుకున్నారు. వాళ్ళ సినిమా ప్రోగ్రాం కుదరకపోవటం మంచిదైంది. ఎందుకంటే, సాయంత్రం నాలుగున్నర గంటలకు సుజాత తండ్రి నారాయణమూర్తి వచ్చాడు.

ఆ సమయంలో అందరూ హాలులో కూర్చుని ఉల్లిపాయ పకోడీలు తింటూ కబుర్లు చెప్పుకుంటూ. జోక్సు వేసుకుంటూ విరగబడి నవ్వుకుంటు న్నారు ముగ్గురూ. ఆయన్ను చూడగానే నవ్వులు తక్కున ఆగిపోయాయి

నారాయణమూర్తి తనతోపాటు ఓ యువకుడ్ని వెంటబెట్టుకొచ్చాడు. పాతికేళ్ళు ఉండొచ్చు అతనికి. నీట్‌గా వున్నాడు. పొడగరి. కోలమొహం, తెల్లని శరీర ఛాయమీద పక్కపాపిటగల నల్లని జుత్తు. ఎముకపుష్టిగల దేహం. చెవులు కొంచెం పెద్దవి. మొహంకంటే అవే ముందుగా కనబడేట్టు వుంటాయి క్రీమ్ కలర్ స్ట్రెచ్‌లాన్ బెల్‌బాటమ్ ప్యాంటుమీద సన్‌రైజ్ ఆరెంజ్, జెట్‌బ్లాక్ చెక్స్ గల టెరీకాట్ స్లాక్ వేసుకున్నాడు. అతన్ని అంతకుముందు వాళ్ళెవ్వరూ చూడలేదు

"రండి" అంటూ నారాయణమూర్తి ఆ యువకుడ్ని లోపలకు ఆహ్వానించి కుర్చీలో కూర్చోబెట్టాడు. సుజాత, సుభాషితలు లోపలికి వెళ్ళారు. శ్రీకాంత్ అక్కడే కూర్చున్నాడు.

ఆ యువకుడూ, శ్రీకాంత్ మొహమొహాలు చూసుకున్నారు గానీ, ఎవరో, ఏమిటో తెలియక వూరుకున్నారు.

నారాయణమూర్తి లోపలకు వెళ్ళాడు.

"ఇదేనా రావటం నాన్నా!" అంది సుజాత.

"అవునమ్మా! ఫోంచేసి బస్సుకొచ్చాను. సమయానికి ఇంట్లోనే వున్నావు. ఏ మ్యాట్నీకో, ఫ్రెండ్ దగ్గరకో వెళతావని తెగ భయపడ్డాను" అన్నాడు నారాయణమూర్తి ఉత్తరీయంతీసి మంచంమీద వేస్తూ.

"ఎవరతను బాబాయ్?" అంది సుభాషిత.

"సుజాతకు వరుణ్ని వెతుక్కొచ్చానమ్మా!" అన్నాడు నారాయణమూర్తి. ఆయన మొహంలో చిరునవ్వు దొర్లింది.

సుజాత ఆశ్చర్యపోతూ తండ్రికేసి చూసింది.

"త్వరగా కాస్త మొహం కడుక్కొని మంచి చీర కట్టుకోమ్మా ! ఒకరకంగా పెళ్ళిచూపులే అనుకో! ముందుగా చెప్పటానికి టైం లేకపోయింది. నేరుగా అబ్బాయిని ఇక్కడకు తీసుకొచ్చాను. అసలు నిన్నే మన వూరు పిలిపిద్దామనుకున్నాను. కాని ఆ పల్లెటూళ్ళో పెళ్ళిచూపులు దేనికి ? ఒకవేళ కుదరకపోతే అమ్మలక్కలు ఆక్షేపిస్తారు నాలుగు రకాలుగా అనుకుంటారు. పల్చనైపోతాం. అందుకని ఇక్కడ ఏర్పాటు చేయించాను పిల్లవాడు బుద్ధిమంతుడు. ఎం.ఎస్సీ ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాడు. మనవూరి దగ్గర బ్రాహ్మణకోడూరు లేదూ ! ఆ వూరే అబ్బాయిది. పిల్లలుగల కుటుంబం. ఊళ్ళో పరువు ప్రతిష్ఠలు గల వంశం" అన్నాడు నారాయణమూర్తి వివరాలను త్వరగా చెబుతూ.

గుమ్మందగ్గర నిలబడ్డ శ్రీకాంత్ ఆ వివరాలను విన్నాడు.

"ఉద్యోగం ఏదైనా చేస్తున్నాడా ?" అంది సుభాషిత.

"ఇంకా లేదమ్మా! రెండు మూడు కాలేజీలకు అప్లయి చేశాడట. ఫస్టుక్లాస్ ఎం. ఎస్సీ. గదా? ఉద్యోగం రాకపోతుందా ? అబ్బాయి ఎట్లా వున్నాడమ్మా ?" అన్నాడు నారాయణమూర్తి.

"ఆ సంగతి సుజాత చెప్పాలి" అంది సుభాషిత స్నేహితురాలికేసి చూస్తూ.

"నువ్వు చెప్పమ్మా!" అన్నాడు నారాయణమూర్తి.

"నన్ను చెప్పమంటారా?" అన్నాడు శ్రీకాంత్ మధ్యలో కల్పించుకొని.

నారాయణమూర్తి అతనికేసి నిశితంగా చూశాడు – నిన్నెవరు అడిగారు అన్నట్టు అయినా ఆయన అంగీకారంకోసం ఆగకుండా శ్రీకాంత్ చెప్పేశాడు:

"అబ్బాయి పర్సనాలిటీ నంబరు వన్‌గా వుంది. అక్కయ్యకు తగిన వరుడు. మరి కట్నం ఎంతో!"

"ఇంకా అంతదాకా రాలేదు. అమ్మాయి నచ్చితే అదేమంత ముఖ్యమైన విషయంకాదు" అన్నాడు నారాయణమూర్తి.



"అయితే సంబంధం మంచిదే. వరుడికి ఆమాత్రం వ్యక్తిత్వం వుంటే, అంతకంటే ఇంకా ఏం కావాలి ?" అన్నాడు శ్రీకాంత్.

సహజమైన సిగ్గువల్లనో, మరేకారణంచేతనో సుజాత ఏం మాట్లాడలేదు. అందరూ మాట్లాడుకొనేది మాత్రం శ్రద్ధగా వినసాగింది. కిటికీలోంచి రెండు మూడుసార్లు హాల్లో కూర్చున్న ఆ యువకుడ్ని చూసింది. ఆమెకూ అతని పర్సనాలిటీ నచ్చింది. చదువూ బాగానే ఉంది. అయితే ఉద్యోగం మాత్రం లేదు. కట్నం ఎంతో తేలలేదు. గత సంవత్సరంగా పెళ్ళిచేసుకుని జీవితంలో స్థిరపడిపోవాలనే కాంక్ష సుజాతలో ప్రబలంగా ఉంది. ఆ కాంక్షను ప్రత్యక్షంగా ఎవరిదగ్గరా వెల్లడిచేయక పోయినప్పటికీ, తల్లిదండ్రులు సంబంధాలు చూస్తూంటే ఏమీ అభ్యంతరం చెప్పడంలేదు.

సుజాతను త్వరగా తయారుకమ్మని నారాయణమూర్తి అనడంతో ఆమె బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

వచ్చినవాళ్ళకు ఫలహారాలు, కాఫీ వ్యవహారం సుభాషిత చూడసాగింది. శ్రీకాంత్‌చేత బజార్నుంచి స్వీట్స్ తెప్పించింది. నాగరత్నమ్మ చేత మళ్ళీ పకోడీలు చేయించింది.

ఫలహారాలు, కాఫీలు అయింతర్వాత సుజాత పెళ్ళిచూపుల కళతో హాలులోకి వచ్చింది. కృష్ణప్రసాద్ అనబడే ఆ యువకుడూ, సుజాత ఎదురుబదురుగా కళ్ళతో చూసుకున్నారు. చూపులతో పలకరించుకున్నారు.

సుజాతను సింపుల్‌గా అలంకరించింది సుభాషిత. టర్కాయిన్ బ్లూకలర్ బ్యాగ్రౌండ్‌మీద సన్‌సెటింగ్ రెడ్ ఫ్లవర్స్ ప్రింటుగల వూల్లీచీర ధరించింది. మెడలో రెండుపేటల గొలుసు. ఒకచేతికి హెచ్.ఎం.టి. రిస్టువాచీ, మరో చేతికి మూడు మట్టిగాజులు. మొహానికి నామమాత్రంగా స్నో, పౌడర్లు. నుదుటిమీద నిలువుబొట్టు.

కృష్ణప్రసాద్‌కు సుజాత నచ్చింది. ఆ మాట మనసులో అనుకున్నాడు.

సుజాతకు కృష్ణప్రసాద్ నచ్చాడు. ఆ మాట మనసులో అనుకుంది.

"ఇద్దరూ మౌనంగా చూసుకోవటమేనా, మాట్లాడుకొనేదేమైనా వుందా?" అన్నాడు శ్రీకాంత్ ఇరువురి మధ్యా మౌనాన్ని భగ్నంచేయటానికి.

కృష్ణప్రసాద్, సుజాత ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. అంతేకాని పెదవులు విప్పలేదు.

"ఇద్దరికీ మాటలు రావా ?" అన్నాడు శ్రీకాంత్ మళ్ళీ

అయినా వాళ్ళు మాట్లాడుకోలేదు.

వాళ్ళచేత ఏదో మాట్లాడించాలనే తహతహ, ఉత్కంఠ శ్రీకాంత్‌లో హెచ్చుకాసాగింది.

"ఇద్దరూ మూగవాళ్ళ? ఏం బావగారూ! ఏం అక్కయ్యా!" అన్నాడు శ్రీకాంత్ పట్టుదలగా.

ఇద్దరూ ఫక్కున నవ్వారు.

"దేన్ని గురించి మాట్లాడుకోవాలి చెప్పండి" అన్నాడు కృష్ణప్రసాద్.

"పెళ్ళి అయింతర్వాత జీవితం ఎలా వుండాలి? ఏయే ఆదర్శాల ప్రకారం ఏయే ఆశయాల ప్రకారం జీవిత శకటాన్ని ముందుకు నడిపించాలి? జీవితంలో డబ్బు సంపాదన ముఖ్యమా! జీవితాన్ని సుఖంగా అనుభవించడం ముఖ్యమా ! జీవితాన్ని సార్థకం చేసుకోవటం ముఖ్యమా!—మొదలైన విషయాల్ని గురించి నిర్మొహమాటంగా మాట్లాడుకోవచ్చు. పరస్పరమైన అభిరుచులు, అభిలాషలు, అభిప్రాయాలు తెల్సుకుంటే ముందు ముందు పొరపొచ్చాలు, మనస్పర్థలు రాకుండా వుంటాయి. జీవితం కొండమీద మంచుజారిపోయినట్టు సుఖంగా, కులాసాగా గడిచిపోతుంది. అయినా నా కంటె ఇద్దరూ పెద్దవాళ్ళు, నాకంటే బాగా చదువుకున్నవాళ్ళు. నేను మీకు చెప్పేదేమిటి ?" అన్నాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ అంత చొరవగా, స్వేచ్ఛగా మాట్లాడటం నారాయణమూర్తికి నచ్చలేదు. అనవసరమైన వాగుడుతో సంబంధాన్ని ఎక్కడ చెడగొడతాడో

అనే భయం ఉందాయనకు. అసలు శ్రీకాంత్ ఆ ఇంట్లో వుండటమే ఆయన కిష్టంలేదు. ఆ మధ్యవరకూ సొంత అక్కయ్య వుందిగాబట్టి ఏమీ ఆక్షేపించ లేకపోయాడు. ఇప్పుడామె ఇక్కడ వుండటంలేదు. వీడు ఇద్దరు ఆడవాళ్ల మధ్య వుండటం దేనికి? లోకులు ఏమైనా అనుకోవచ్చు. వాడ్ని అనేదేముంది! సుజాత, సుభాషితలను అనాలి. వాళ్లకు ఇంగితజ్ఞానం ఉండాలి అనుకున్నాడు.

"శ్రీకాంత్ చిన్నవాడు. ఏవేవో వాగుతూవుంటాడు, పట్టించుకోకండి," అన్నాడు నారాయణమూర్తి మధ్యలో కల్పించుకుంటూ.

"అదేం లేదులెండి. శ్రీకాంత్ ఉషారైన యువకుడు. వయసుకు మించిన ఆలోచనలు గలవాడు. ఏం చదువుతున్నావు మిస్టర్" అన్నాడు కృష్ణప్రసాద్.

"బి కాం ఫస్టియర్" అన్నాడు శ్రీకాంత్

"స్వరూప అని మా అమ్మాయి స్నేహితురాలు. మొన్నటిదాకా ఆమె ఇక్కడే వుండేది. ఈ మధ్యనే కర్నూలుకు ట్రాన్స్ఫరయింది. సుజాత, స్వరూప, సుభాషిత—ఈ ముగ్గురూ ప్రాణానికి ప్రాణం యిచ్చుకొనే స్నేహితు రాండ్రు చదువుకునే రోజుల్నించీ! స్వరూప తమ్ముడే శ్రీకాంత్. అసలు అక్కయ్య కర్నూలు వెళ్ళినా, మధ్యలో ఎక్కడ కెళ్లడమని అక్కయ్యల దగ్గరే ఉంటున్నాడు కాస్త సాయంగా" అన్నాడు నారాయణమూర్తి. ఆ ఇంట్లో శ్రీకాంత్ ఎందుకుంటున్నాడో ముందుగా చెప్పడం భావ్యంగాతోచింది ఆయనకు.

కృష్ణప్రసాద్ చేతిగడియారం చూసుకున్నాడు. అయిదున్నరైంది.

'వెళదామా' అన్నట్టు నారాయణమూర్తి కేసి చూశాడు అతను.

"పొద్దుగూకుతోంది. వెళతామమ్మా?" అన్నాడు నారాయణమూర్తి.

"అంతా బాగానే వుంది. పెళ్ళిచూపుల ఫలితమేమిటో చెప్పలేదు" అన్నాడు శ్రీకాంత్.

కృష్ణప్రసాద్ చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో కించిత్ సిగ్గు తొంగి చూడకపోలేదు. దాన్నిబట్టి అతను పెళ్ళికి సుముఖంగా ఉన్నట్టు అర్థమైపోయింది.

"అంత తొందరపడతావేమిటోయ్! పెద్దలతో సంప్రదించవల్సి వుందిగా. ఆ తర్వాతనే ముహూర్త నిర్ణయం అన్నాడు నారాయణమూర్తి.

కృష్ణప్రసాద్‌ను వెంటబెట్టుకొని నారాయణమూర్తి వెళ్ళాడు. కళాసాయైన చిరునవ్వుతో అందరికీ నమస్కారాలు చెప్పి వెళ్ళాడు కృష్ణప్రసాద్. సుజాతకు మాత్రం కళ్ళతో చెప్పాడు.

దాదాపు ఆ సంబంధం స్థిరపడినట్లుగా అనుకున్నారు అంతా.

"అక్కయ్యా! కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు శ్రీకాంత్ నిండైన సంతోషంతో.

'ఎందుకు?' అన్నట్టు చూసింది సుజాత.

"అదేమిటక్కా అలా చూస్తావు! మంచి భర్త దొరికినందుకు" అన్నాడు శ్రీకాంత్.

"అప్పుడే ఏమైందోయ్!" అంది సుజాత.

"ముఖ్యమైన ఘట్టం ముగిసింది. మిగతాదంతా మామూలు తతంగమేగా! పెళ్ళికొడుక్కి నువ్వు నచ్చావు. నీకు పెళ్ళికొడుకు నచ్చాడు. ప్రధాన ఘట్టం అయిపోయినట్లేగా! వాళ్ల తల్లిదండ్రుల్ని సంప్రదించి ముహూర్తం పెట్టుకోవటమే మిగిలింది. అదెంతసేపు. మంచి ముహూర్తం సాధ్యమైనంత ముందుగా వుంటేనే మంచిది. అక్కయ్యా! నీ పెళ్ళికి పెత్తనమంతా నాదే!" అన్నాడు శ్రీకాంత్ చప్పట్లు చరుస్తూ.

శ్రీకాంత్ పరవశత్వానికి సుజాత, సుభాషితలు మురిసిపోయారు.

"సుజా! నీవు జీవితంలో స్థిరపడబోతున్నావు. ఎంతో సంతోషంగా వుందే! పెళ్లి కాగానే మమ్మల్ని విడిచి మరో ఇల్లు చూసుకుంటావు కాబోలు!" అంది సుభాషిత.

"మరి నీ పెళ్ళి అయితే నువ్వూ మరో ఇల్లు చూసుకుంటావుగా! అప్పుడు నే నొక్కడ్నే మిగిలిపోతాను" అన్నాడు శ్రీకాంత్ బుంగమూతి పెట్టి.

"నువ్వు ఒక్కడివే మిగిలిపోవటం దేనికోయ్! నువ్వూ పెళ్లి చేసుకుంటే సరిపోతుంది. ఇల్లు తీసుకొని కాపురం పెట్టొచ్చు" అంది సుజాత.

"ఛో? అక్కయ్యా?" అన్నాడు శ్రీకాంత్ సిగ్గుపడుతూ.

"అబ్బో! పెళ్ళి పేరెత్తగానే ఎక్కడలేని సిగ్గు ముంచుకొచ్చిందే!" అంది సుభాషిత.

నవ్వింది సుజాత. ఆ నవ్వులో తన నవ్వుకూడా కలిపింది సుభాషిత. అక్కయ్యలతోపాటు తనకీ నవ్వక తప్పలేదు శ్రీకాంత్‌కు.

9

సుజాత పెళ్లిచూపులై వారమైంది. ఇంకా ఏ సమాచారమూ తెలియలేదు. నారాయణమూర్తి రాలేదు. సుజాతకు ఓ రకమైన ఆదుర్దా ఎక్కువైంది. కాని బయటపడలేదు.

ఆ రోజు ఉదయం శ్రీకాంత్ అన్నాడు.

"అక్కయ్య పెళ్లి ముహూర్తమెప్పుడో ! ఇంకా ఏమీ తెలియలేదే!"

సుజాత మాట్లాడలేదు.

"దగ్గర్లో ముహూర్తాలు లేవేమో!" అంది సుభాషిత.

"పురోహితుడ్ని కనుక్కొని రమ్మంటావా ?" అన్నాడు శ్రీకాంత్.

"మధ్యలో నీ హడావుడి ఎక్కువగా ఉందే" అంది సుభాషిత.

"మరి పెళ్ళికి పెత్తనం వహించవద్దూ!" అన్నాడు శ్రీకాంత్.

"అతని తల్లిదండ్రులు ఏమన్నారో!" అంది సుజాత మనసులోని సందేహాన్ని వెలిబుచ్చుతూ.

"తల్లితండ్రులది ఏమీ లేదుటగా! అంతా అబ్బాయిదేనట. అతనికి నచ్చితే చాలట. కట్నం కానుకల ప్రసక్తి కూడా లేదట. మీ నాన్నగారు అన్నారు" అంది సుభాషిత.

"పోనీ అక్కయ్యా ! నువ్వు ఓసారి మీ వూరు వెళ్ళిరాకూడదూ, వచ్చే ఆదివారం. నన్ను తోడుగా రమ్మన్నా వస్తాను" అన్నాడు శ్రీకాంత్.

సుజాత ఏం మాట్లాడలేదు. టవల్ తీసుకుని బాత్‌రూం కెళ్ళింది.

ఆ రోజు కాలేజీలో సెకండ్ పిరియడ్ అయింతర్వాత, సెకండియర్ బి.యస్సీ క్లాసుకెళ్ళి స్టాఫ్‌రూంకి వచ్చింది సుజాత. ఛాక్‌పీసులను, డస్టర్‌ను టేబుల్‌మీద పడేసి అట్లా కుర్చీలో కూర్చుందో, లేదో కబురొచ్చింది ప్రిన్సిపాల్ గారు రమ్మంటున్నారంటూ, ఓ నిట్టూర్పు విడిచి వెంటనే బయలుదేరింది సుజాత.

ఆమెకు కారిడార్‌లో సుభాషిత కల్సింది.

"ఎక్కడికే ?" అంది సుజాత

"ప్రిన్సిపాల్ రమ్మంది. మరి నువ్వు" అంది సుభాషిత.

"నన్నూ రమ్మంది. ఎందుకో" అంది సుజాత.

ప్రిన్సిపాల్ రమ్మన్న కారణాన్ని ఇద్దరూ ఊహించలేకపోయారు.

"ఒకవేళ మనకూ ట్రాన్స్‌ఫర్లు వచ్చాయేమో!" అంది సుజాత.

"మైగాడ్! నిజమా!" అంది సుభాషిత.

"ఏమో అలా అనిపిస్తోంది."

"ఇద్దర్నీ కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ చేస్తే బావుండు."

"బావుంటుంది. కాని చెయ్యాలిగా. ఏ శ్రీకాకుళమో ట్రాన్స్‌ఫర్ చేశారంటే చచ్చి వూరుకుంటాం."

''చూద్దాం. అసలెందుకు రమ్మందో !''

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ ప్రిన్సిపాల్ రూమ్‌కు వెళ్ళారు. ఆ రూమ్‌లో ఎవ్వరూలేరు. ప్రిన్సిపాల్ ఒక్కతే ఉంది. ఆవిడ మొహం బెరడు వలిచిన తుమ్మమొద్దులా గంభీరంగా వుంది. శూన్యంలోకి చూస్తూ నిశ్శబ్దంగా వుంది. ఆవిడను చూడగానే సుజాత, సుభాషితలు కొద్దిగా జంకారు. తప్పు చేసిన స్టూడెంట్స్‌ను శిక్షించేముందు ఆవిడ ఎంత సీరియస్‌గా వుంటుందో, అంత సీరియస్‌గా వుండేసరికి, సుజాత, సుభాషితలు ఒకరి మొహాలు మరొకళ్ళు అమాయకంగా చూసుకున్నారు—తాము ఏం తప్పు చేశామా అనుకుంటూ.

ప్రిన్సిపాల్ ఎదురుగ్గా వెళ్ళి నిలబడ్డారు వాళ్ళు.

''సిట్ డౌన్'' అంది ప్రిన్సిపాల్ సీరియస్‌గా.

కూర్చున్నారు వాళ్ళు.

''ఎక్కడ మీరు ఉండేది?''

చెప్పింది సుజాత.

''ఇద్దరూ ఒకేఇంట్లో వుంటున్నారా?''

తలలు ఆడించారు ఇద్దరూ.

''మీ ఇద్దరేకాక ఆ ఇంట్లో ఇంకెవరుంటున్నారు?''

ప్రిన్సిపాల్ అంత యిదిగా ఎందుకడుగుతూందో అర్థంకాలేదు వాళ్ళకు. బోనులో నిలబడ్డవాళ్ళను లాయరు క్రాస్ ఎగ్జామిన్ చేస్తూన్నట్టుంది.

''వంటమనిషి. బి. కాం. ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ కుర్రాడు.'' అంది సుభాషిత.

''ఎవరా కుర్రాడు?'' అంది ప్రిన్సిపాల్ నిశితంగా.

''తమ్ముడు'' అంది సుజాత.

''ఎవరికి తమ్ముడు'' అంది ప్రిన్సిపాల్.

''ఇద్దరికీ'' అంది సుభాషిత.

''మీ రిద్దరూ సిస్టర్సా'' అంది ప్రిన్సిపాల్.

''కాదు. అంతకంటె ఎక్కువ.'' సుభాషిత సమాధానం.

అర్థంగాక అయోమయంలో పడింది ప్రిన్సిపాల్.

''నిజం చెప్పండి. ఎవరా కుర్రాడు? మీకూ అతనికి సంబంధమేమిటి?''

''నిజమే చెబుతున్నాం. మీరు ఇంత లోతుగా ఎందుకడుగుతున్నారో మాకు అర్థంకావటంలేదు'' అంది సుజాత. రోషంతో ఆమె మొహం కొంచెం ఎరుపుకు తిరిగింది.

"అవసరం ఉండబట్టే అడుగుతున్నాను. అన్యథా భావించకండి. పవిత్ర దేవాలయంవంటి విద్యాసంస్థలో మీరు పనిచేస్తున్నారు. మీ వ్యక్తిగత జీవితాలు కూడా ఆదర్శవంతంగా ఉండాలి. మీరు పనిచేసే సంస్థ పరువు మర్యాదలు కాపాడే కర్తవ్యం నామీద ఉంది. ఆ సంస్థలో పనిచేసేవాళ్ళు పొరపాటు చేసినా, తప్పుడు మార్గాలు తొక్కినా వాళ్ళను సరిచేసే బాధ్యత నాపైన ఉంది. అందుకే అధికారికంగా మాట్లాడుతున్నా. ఆ కుర్రవాడి పేరేమిటి ?"

"శ్రీకాంత్" అంది సుభాషిత.

"వయస్సెంత వుంటుంది?" ప్రిన్సిపాల్ ప్రశ్న.

"ఇరవయ్యేళ్ళు ఉండొచ్చు." అంది సుజాత.

"నిజంగా మీ ఇద్దరిలో ఎవరికి తమ్ముడు?" అంది ప్రిన్సిపాల్.

"ఎవరికీ కాదు. ఇదివరకు ఇంగ్లీషు లెక్చరర్‌గా ఇక్కడవుండి, ఆ మధ్య కర్నూలు ట్రాన్స్‌ఫరైపోయింది స్వరూప. ఆమె అసలు తమ్ముడు. మేం ముగ్గురమూ మొదట్నుంచీ ఒకే ఇంట్లో వుండేవాళ్ళం. మాతోపాటే శ్రీకాంత్ ఉంటున్నాడు. ఇంటర్మీడియట్ చదివాడు. ఇప్పుడు బి. కాం. చదువుతున్నాడు. మధ్యలో స్వరూప ట్రాన్స్‌ఫరొచ్చి వెళ్ళిపోయింది. శ్రీకాంత్ మాతోనే వుంటు న్నాడు. సొంత తమ్ముడులాగానే మాతో కల్సిపోయాడు" అంది సుభాషిత.

ఆ మాటల్లోని నిజాన్ని గ్రహించింది ప్రిన్సిపాల్. ఓ నిముషంపాటు స్తబ్ధురాలైనట్టు ఆలోచించసాగింది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోయారు సుజాత, సుభాషితలు. ఏదో జరగరాని దుర్ఘటన జరిగినట్లుగా భయపడసాగారు.

"మిమ్మల్ని చూస్తే నాకు జాలివేస్తోంది. మీరు అమాయకులు. మీ దృష్టిలో ఆ కుర్రవాడు తమ్ముడులాంటివాడు కావచ్చు. నేనూ నమ్ముతాను. కాని లోకం వేరు. విస్తీర్ణంలో విశాలమైందిగానీ, దాని మనసు బహు ఇరుకైంది. సంకుచిత మైంది. అనుమానాలకు ఆలవాలమైంది. లోకం దృష్టిలో అతను మీ తమ్ముడు కాదు, మీ ప్రియుడు." అంది ప్రిన్సిపాల్ బరువుగా.

సుజాత, సుభాషితలు నిలువునా నిశ్చేష్టులై, ప్రిన్సిపాల్‌కేసి చూసేటప్పటికే, ఆవిడ డ్రాయర్లోంచి ఓ ఎర్రటి కరపత్రాన్ని తీసి వాళ్ళకిచ్చింది.

"ఇంతకుముందే పోస్టులో వచ్చింది. చదువుకుంటే మీ గురించి లోకం ఏమనుకుంటుందో మీకే అర్థమవుతుంది" అంది ప్రిన్సిపాల్.

గబగబా చదివింది సుజాత ఆ కరపత్రాన్ని. ఆమెతోపాటు సుభాషితకూడా చదివింది. దాన్ని చదువుతూన్నప్పుడు మాటమాటకూ ఆ ఇరువురి మొహాల్లో రంగులు మారసాగాయి. నరనరాల్లో నెత్తురు దూకుడుగా ప్రవహించి, మొహాలు కందగడ్డలా తయారై, చివరకు మసిగుడ్డలువలె వ్రేళ్ళాడాయి. ఆ కరపత్రంలో ఇట్లా వుంది.

శీర్షిక : ప్రభుత్వ స్త్రీల కళాశాల అధ్యాపకరాండ్ర అవినీతి కార్యకలాపాలు.

గుంటూరు ప్రభుత్వ స్త్రీల కళాశాలలో సుజాత, సుభాషిత అనే ఇద్దరు లెక్చరర్లు పనిచేస్తున్నారు. వారు అరండేల్‌పేటలో ఓ ఇంట్లో వుంటున్నారు. ఇద్దరూ అందమైనవారు. మంచి వయసులో వున్నారు. ఇద్దరికీ ఇంకా పెళ్ళి కాలేదు. అయితే యేం? వాళ్ళిద్దరూ 'శ్రీకాంత్' అనే బి. కాం. చదివే ఓ యువకుడ్ని ఇంట్లో ఉంచుకొని, తమ తమ ప్రవృత్తిని గుట్టుచప్పుడు కాకుండా తీర్చుకొంటున్నారు. వాళ్ళ కామకేళీవిలాసాలతో ఆ వీధంతా మారుమోగి పోతూన్నది. విద్యార్థినులకు నీతిపాఠాలు బోధించే ఇద్దరు అధ్యాపకురాండ్రు ఇట్లాంటి అవినీతి కార్యకలాపాలను బహిరంగంగా కొనసాగించటాన్ని సమాజం సహించరాదు. ఈ విషయమై అధికారులు వెంటనే చర్య తీసుకోవాల్సిందిగా అర్థించడమైంది.

ఇట్లు
ప్రత్యక్ష సాక్షులు

ఆ ప్రత్యక్ష సాక్షుల పేర్లు లేవు. ఆ కరపత్రాన్ని అచ్చువేసిన ప్రెస్‌పేరు లేదు.

ఆ కరపత్రాన్ని చదివిన మీదట సుజాత, సుభాషితలు శిలాప్రతిమలై

కొన్ని నిముషాలపాటు అక్కడే కూర్చుండిపోయారు. వాళ్ళ మొహాల్లో కలిగిన అలజడినీ, అశాంతినీ, అవమాన జ్వాలనూ చూస్తూ కూర్చుంది ప్రిన్సిపాల్.

"ఆ కరపత్రం బూటకమని తెలుస్తూనేవుంది. ఎవరో మీరంటే గిట్టనివాళ్ళు మిమ్మల్ని బజారుకెక్కించి అపఖ్యాతిపాలు చేయాలని కుట్రపన్ని చేసిన పని. ఏది ఏమైనా పెళ్ళిగానివాళ్ళ పేర్లు ఇట్లా వీధికెక్కడం మంచిదికాదు. పెళ్ళిళ్ళు కావటం కష్టం. ఈ రోజుల్లో నిజాన్ని నిదానంగా ఎవరు చూస్తారు? నలుగురు నోళ్ళలో పడిందే నిజం. అది అభూత కల్పన అయినప్పటికీ. ఇట్లాంటివాటికి అవకాశాన్ని ఇవ్వకుండా జాగ్రత్తగా మసలుకోవాల్సిన అవసరముంది. ఇప్పటికైనా మీరు గ్రహించాలి," అంది ప్రిన్సిపాల్ సలహాగా.

నెత్తురు చుక్కలు ఎండిన మొహాలతో సుజాతా, సుభాషితలు అక్కణ్నుంచి లేచి, బరువుగా స్టాఫ్‌రూం కొచ్చారు.

ఆ స్టాఫ్‌రూంలో ఉన్న అయిదారుమంది లెక్చరర్లవద్ద ఆ ఎర్రటి కరపత్రాలున్నాయి. ఎవరో కుర్రాడువచ్చి ఆ కరపత్రాల్ని పంచిపెట్టి, పరుగెత్తాడట.

కాలేజీలో ఎవ్వరి మొహాన్నీ తలెత్తి చూడలేకపోయారు. వెంటనే మధ్యాహ్నానికి సెలవుచీటీలు వ్రాసి, రిక్షా ఎక్కి ఇంటికి బయలుదేరారు. కొంతమంది విద్యార్థినుల చేతుల్లోకూడా ఆ ఎర్రటి కరపత్రాలున్నాయి. కాలేజీ గేటుమీదనూ, గోడలమీదనూ కూడా ఆ కరపత్రాలు అంటించి ఉన్నాయి.

రిక్షాలో కూర్చుని ఇంటికి వస్తూన్న సుజాత, సుభాషితలు మాట్లాడుకోలేదు. అవజ్ఞా భారంతో వాళ్ళ మనసులు మొద్దుబారిపోయినయ్. ఆలోచనా యంత్రాంగం పనిచేయడం మానేసింది; ప్రపంచమంతా కక్షబూని కబళించ టానికి కరాళహస్తాలతో తమ వెంటబడుతూన్నట్లుంది.

ఇంటికి రాగానే ఇద్దరూ చెరో మంచంమీద జేరి, ముసుగులుపెట్టుకొని, పసిపిల్లల్లా ఏడ్వసాగారు.

10

ఇట్లా ఎందుకు జరిగింది ?

ఎవరిది తప్పు ?

ఈ అపవాదును ఎవరు పుట్టించారు ? అంత అవసరం ఎవరికి కలిగింది ? అందువల్ల వాళ్ళకు వచ్చే లాభమేమిటి ?

తమపై ఇంత కక్ష ఎవరికుంది ?

తమని అపఖ్యాతిపాలు చేయాల్సిన అగత్యం ఎవరికుంది ?

తమని ప్రత్యక్షంగా ఎవరూ ప్రేమించలేదు. ఎవరూ తమకు ప్రేమలేఖలు వ్రాసి, తమపై ఏకపక్ష ప్రేమను వెల్లడించలేదు.

రిక్షా యాక్సిడెంట్లకూ, అర్ధరాత్రివేళ దొంగ ఇంట్లో ప్రవేశించడానికి ప్రయత్నించడానికీ, ఈ కరపత్రాలకూ సంబంధమేమైనా వుందా ? వీటన్నింటి వెనుక అదృశ్య హస్తం ఒకరిదేనా ? ఎవరతను ?

తాము ఏ మగవాడ్ని కవ్వించలేదు. ఎగతాళి చేయలేదు. చివరకు కన్నెత్తి కూడా చూడలేదు. తమపై ఇంత పగ, శత్రుత్వం ఎవరికుంది ? ఎందుకుంది ?

శ్రీకాంత్ అమాయకుడు. అతగాడ్ని తమ్ముడిలా చూసుకోవటంలో తప్పు లేదు అతనూ తమని అక్కయ్యల్లాగే చూసుకుంటున్నాడు. అతని ప్రవర్తనలో ఆక్షేపించదగింది రవ్వంతలేదు. తమ అనుబంధంలోని పవిత్రతను లోకం శంకించిందంటే, తప్పు పట్టిందంటే, అవినీతి ముద్ర వేసిందంటే- దానికి తాము బాధ్యులా?

ఛి. ఛీ ఎంత ఘోరం! యువతీ, యువకుల మధ్య అక్కా, తమ్ముళ్ళ సంబంధాన్ని గుర్తించలేని ఈ లోకం ఎంత దైన్యస్థితికి దిగజారింది. లేనిపోని అవినీతి సంబంధాన్ని అంటగట్టటానికి కించింత్ కూడా వెనకాడనట్టుంది.

ఏంచేయాలి ?

ఈ క్లిష్టపరిస్థితుల్లో తమ కర్తవ్యమేమిటి ?

ఈ అపవాదులకు అవకాశాన్ని కల్పించిన తాము ఈ దుష్ఫలితాన్ని అనుభవించవల్సిందేనా? నేరం చేయని ఈ శిక్షను శిరసావహించవల్సిందేనా?

ఈ ఘోరం సంగతి తెలిస్తే శ్రీకాంత్ ఏమౌతాడు? విపరీతమైన ఆవేశంతో ఏ అఘాయిత్యానికి పూనుకున్నా ఆశ్చర్యపడక్కర్లేదు. అసలు అతన్ని ఇంట్లో వుంచుకోవడంవల్లనే ఈ అనర్థం వొచ్చింది. తాము అప్పుడు ఇంతదూరం ఆలోచించలేదు. పరిస్థితులు ఇంతగా విషమించే అవకాశముందని అనుకోలేదు. అక్కడికీ స్వరూప హెచ్చరించింది. అయినా తాము అభిమానంతో, వాత్సల్యంతో, స్నేహితురాలిమీద గౌరవంతో శ్రీకాంత్‌ను ఇంట్లో పెట్టుకొంటా మనే ఖచ్చితంగా చెప్పడం జరిగింది.

ఇప్పుడేం చేయాలి?

ఈ అపవాదు, అప్రదిష్ట, చెడ్డపేరు మాసిపోవటం ఎట్లా ?

లోకానికి నిజాన్ని ఎట్లా చాటి చెప్పాలి ?

—దాదాపు ఆ విధంగా సుజాత, సుభాషితలు సాయంత్రం మూడున్నరదాకా తలలు పట్టుకొని తీవ్రంగా ఆలోచిస్తూనేవున్నారు. కాని మార్గం దొరకలేదు. ఆలోచించుకున్నకొద్దీ దుఃఖం ఎక్కువవుతూన్నదిగానీ, ఉపశమనం ఏ మాత్రం లభించడంలేదు.

మూడున్నరకు నాగరత్తమ్మ యిచ్చిన వేడి వేడి కాఫీ త్రాగారు ఇద్దరూ.

"ఇంత దారుణం జరుగుతుందని అనుకోలేదే!" అంది సుభాషిత ఉబ్బిన కళ్ళతో.

"ఏం చేద్దాం? మనం నిర్దోషులం. ఆ సంగతి మన ఆత్మలకు తెలుసు. మనపై ఇంత ఘోరమైన నిందవేసి, అపఖ్యాతిపాలు చేసినవాళ్ళు అంతకంతకూ అనుభవించకపోతారా ?" అంది సుజాత తీరని కసితో.

"అది తర్వాత సంగతి. ముందు ఈ అపవాదును ఎదుర్కొనే మార్గం చెప్పు. చేయని తప్పుకు ఇంత పెద్ద శిక్ష పడితే ఎట్లా భరించడం ? రేపు కాలేజీకి ఎట్లా వెళ్ళడం ? అందరూ మనవంక అదోరకంగా చూస్తారే! ఆ చూపుల్ని ఎట్లా భరించడం?" అంది సుభాషిత.

అంతలో ఇంటిముందు సైకిలు రిక్షా ఆగిన చప్పుడైంది. ఆ రిక్షాలోంచి నారాయణమూర్తి దిగాడు. నేరుగా ఇంట్లోకి వచ్చాడు.

అల్లకల్లోలంగా వున్న సుజాత మనసు మరీ భీభత్సమైంది. తండ్రి ఒకవేళ కాలేజీకి వెళ్ళాడేమో, అక్కడ గోడలమీదున్న కరపత్రాల్ని చూశాడేమోనన్న భయం ఆమె వూపిర్ని పట్టేసింది.

"అప్పుడే కాలేజీనుంచి ఇంటికొచ్చావా ?" అన్నాడు నారాయణమూర్తి కూతుర్ని. ఆయన మాటల దూకుడూ, ధోరణీ చూడగా సుజాతకు మూడొంతులు ప్రాణాలు ఎగిరిపోయాయి.

"వర్క్ అయిపోతే ముందుగా ఇంటికొచ్చాం" అంది సుభాషిత.

హాలులో కుర్చీలో తాపీగా కూర్చున్నాడు నారాయణమూర్తి. సుజాత, సుభాషితలవంక పరిశీలనగా చూశాడు. దుఃఖోద్విగ్నతచేత మొహాలు ఉబ్బినట్టుగా వున్నాయి. అయినా వాళ్ళు ఆ దుఃఖాన్ని కనబడనీయకుండా ఉషారుగా వుండటానికి ప్రయత్నించసాగారు. అయినా ఆయన కనిపెట్టాడు.

"ఏమిటి ! మీ ఇద్దరి మొహాలు అట్లా వున్నాయి ? ఏం జరిగింది ?"

"ఎట్లా వున్నాయి? మామూలుగానే వున్నాయ్! నిద్రబోయి లేచాం. అంతే!" అంది సుజాత.

ఓ నిముషంపాటు నిశ్శబ్దంగా ఉన్నాడు నారాయణమూర్తి.

నాగరత్నమ్మ ఆయనకు కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆ కాఫీ త్రాగాక...

"వాడింకా ఇంట్లోనే ఉంటున్నాడా?" అన్నాడు నారాయణమూర్తి ఆగ్రహావేశాన్ని కనబరుస్తూ. వాడంటే 'శ్రీకాంత్' అని ఆయన ఉద్దేశం.

"ఎవరూ! శ్రీకాంతా ?" అంది సుభాషిత.

"ఆఁ!...ఆ ప్రబుద్ధుడే!" అన్నాడు నారాయణమూర్తి కసిగా.

"ఊఁ!" అంది సుభాషిత. ఆ మాట అనటానికి సుభాషితకు ధైర్యం చాలలేదు.

"మీకు బుద్ధీ, జ్ఞానం లేదమ్మా ! పెళ్ళి కావాల్సినవాళ్ళు ఎదిగిన కుర్రాణ్ని ఇంట్లో పెట్టుకుంటారా? లోకం ఏమనుకుంటుంది? లోకం అనుకునేదానికి మీరు చెప్పే సంజాయిషీ ఏమిటి? అదేమంటే తమ్ముడులాంటి వారంటారు. మీరు అంటేనూ, అనుకుంటేనూ సరిపోతుందా? స్నేహాలకుకూడా కొన్ని హద్దులుండాలి. ఔచిత్యాలుండాలి. వాడు మీకు తోడబుట్టినవాడా ? లోకానికి నమ్మాల్సిన అవసరమేముంది? వాడివల్లనే బంగారంలాంటి సంబంధం చెడిపోయింది" అన్నాడు నారాయణమూర్తి ఉద్విగ్నచిత్తుడై.

సుజాతా, సుభాషితలు నిర్విణ్ణులై, నిల్చున్నపాటుగా శిలాప్రతిమలైపోయారు.

సంబంధం ఎట్లా చెడిపోయిందోకూడా నారాయణమూర్తి చెప్పాడు.

"అంతా బాగానే వుందిగానీ, పిల్ల ప్రవర్తన సరైంది కాదని తెల్సిందట. ఇంట్లో బి. కాం. చదివే కుర్రాడ్ని పెట్టుకుని కులుకుతూందని ఎవరో ఆకాశరామన్న లేఖద్వారా తెలియజేశారట! అతగాడు నమ్మాడు. నమ్మటంలో తప్పేముంది? ప్రత్యక్షంగా ఆ రోజు శ్రీకాంత్‌ను చూశాడుగా! పైపెచ్చు వాడి ప్రవర్తన ఆకతాయిగా కనబడి వుంటుంది" అన్నాడు నారాయణమూర్తి.

సుజాతలో దుఃఖం పొంగి పొర్లింది. కళ్ళవెంట ఉబికే కన్నీటిని చాటుగా పైటకొంగుతో నొక్కిపెట్టింది. ఆమెకేసి చూసిన సుభాషిత మనస్సు సానుభూతితో ఆర్ద్రమైంది. ఇద్దరూ నోరు విప్పలేకపోయారు.

"నేను పెద్దవాడ్ని. లోకానుభవంతో వెంట్రుకలు నెరిసినవాడ్ని. మొదట్నుంచీ నా కిష్టంలేదు-వాడు ఈ ఇంట్లో మీతో ఉండటం! స్నేహాలు వేరు, అభిమానాలు వేరు. ప్రేమలు వేరు, బాధ్యతలు వేరు. ఏం పని చేసినా లోకాన్ని ఓ కంట కనిపెట్టి చేయాలి. అందులో పెళ్ళిగాని ఆడవాళ్ళు ఒకచోట వుంటున్నప్పుడు-పరిసరాల్ని గమనించి, మరీ మసలుకోవాలి. ఇతరులు ఆక్షేపించడానికి అవ



గింజంతకూడా అవకాశాన్ని ఇవ్వరాదు. శ్రీకాంత్ మీ ఇంట్లో లేడనుకోండి. మిమ్మల్ని ఎవరు వేలెత్తి చూపుతారు ? వాడు ఇంట్లో ఉన్నంతకాలమూ మీ చుట్టూ పొగ కమ్ముకొనే వుంటుంది. ఆ పొగ మీ బ్రతుకులకు మసిపట్టిస్తుంది. ఇప్పటికైనా గ్రహించి వాడ్ని వెంటనే ఇంట్లోంచి వెళ్ళగొట్టండి. రేపే మరో చోట రూమ్ చూసుకొని అందులోకి మారమని చెప్పండి" అన్నాడు నారాయణ మూర్తి గట్టిగా.

సుజాత, సుభాషితలు మౌనంగా వుండిపోయారు. వాళ్ళ మనస్సుల్లో ఒక ప్రక్కన ప్రళయ భీకర సంఘర్షణ; మరో పక్క తీవ్రాతి తీవ్రమైన దుఃఖాగ్ని జ్వాలలు. రెండింటికీ తట్టుకోలేక ఏ పొటాషియమ్ సైనైడో పుచ్చుకొని క్షణాల మీద చనిపోతే ఎంత బావుండు? అనుకొనే దుస్థితికి వచ్చారు.

నారాయణమూర్తి లేచివెళుతూ చివరగా కూతురితో అన్నాడు.

"ఇదిగో! సుజా! నేను మళ్ళీ నాలుగైదురోజుల్లో వస్తాను. నేను వచ్చేసరికి వాడు ఈ కొంపలో వున్నాడంటే వూరుకొనేదిలేదు. మళ్ళీ నీ మొహం చూడను. నీకు పెళ్ళి సంబంధాలు చూడడం వృధా. నీ కర్మకు నిన్నే వదిలేస్తాను. నా మాట వినని కూతురుకోసం నేను నానా అగచాట్లూ పడటం దేనికి?"

11

ఆఖరి పిరియడ్ అయిదుగంటలకుగానీ అయిపోదు. టైం టేబుల్‌నుంచి అఖరి పిరియడ్‌ను తీసివేస్తే బావుంటుందని అటు విద్యార్థులూ, ఇటు లెక్చరర్లూ

అనుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాని నిబంధనల ప్రకారం ఆ పిరియడ్‌కు భరతవాక్యం పలకటానికి వీల్లేదు. ఆఖరి పిరియడ్ తీసుకోకుండా క్లాసు వొదిలేసే లెక్చరర్లంటే విద్యార్థులకు అభిమానం జాస్తి. కాని ఆ అభిమానాన్ని అందరు లెక్చరర్లు పొందలేరు. ప్రిన్సిపాల్ లేనప్పుడు కొంతమంది లెక్చరర్లు ఆఖరి పిరియడ్‌ను వొదిలివేస్తూ వుంటారు. దానికి మరికొంత ధైర్యం కావాలి.

ఆ రోజు ఆఖరి పిరియడ్ వాణిజ్య భూగోళశాస్త్రం. వరి పుట్టు పూర్వోత్తరాలు; దాని పెరుగుదలకు అవసరమైన శీతోష్ణస్థితి, వర్షపాతం, భూసారం, ఇతరత్రా అనుకూల పరిస్థితులు; వరి ఏయే దేశాలలో విరివిగా పండుతుంది; భారత దేశంలో ఎక్కడెక్కడ పండుతుంది; ఏయే దేశాలు బియ్యాన్ని ఎగుమతి చేస్తాయి; ఏయే దేశాలు బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాయి; భారతదేశంలో వరి ఉత్పత్తి వివరాలు మొదలైనవాటిని గురించి లెక్చరర్ చెబుతూంటే, క్లాసులోని విద్యార్థులంతా పరమబోర్ ఫీలయి చేతి గడియారాలకేసి చూడ సాగారు. శ్రీకాంత్‌కూడా చేతి గడియారంకేసి చూసుకున్నాడు. ఇంకా మూడు నిముషాల టైమ్ వుంది పిరియడ్ అయిపోవటానికి. లెక్చరర్ పాఠం ఆపుచేశాడు.

ఇద్దరు స్టూడెంట్స్ లేచారు.

"అదేమిటోయ్! ఇంకా బెల్ కాలేదు" అన్నాడు లెక్చరర్.

"అయింది సార్. మనరూమ్‌కి సరీగ్గా బెల్ వినపడదు. పక్క రూమ్‌లో వాళ్ళు ఎప్పుడో వెళ్ళిపోయారు సార్!" అన్నాడో స్టూడెంట్.

లెక్చరర్ తబ్బిబ్బయ్యాడు. తన వాచీకేసి చూసుకున్నాడు. అయిదూ ఎనిమిదైంది. కాలేజీకి ఎప్పుడూ లేటుగా రాకూడదనే సిద్ధాంతరీత్యా ఎప్పుడూ పదినిముషాలు టైం ముందుపెట్టే అలవాటు.

స్టూడెంట్స్ లేచారు. గతిలేక లెక్చరర్ కూడా లేచాడు.

రూమ్ బయటికి వచ్చేసరికి బెల్ అయింది.

రూమ్ బయటికి వచ్చీరాగానే శ్రీకాంత్‌కు ఎవరో కుర్రాడు ఓ కవరు ఇచ్చి, స్టూడెంట్స్‌తో కలిసి వెళ్ళిపోయాడు. ఆ కుర్రాడ్ని లీలగా చూశాడు. పద్నాలుగేళ్ళు ఉంటాయేమో! ఖాకీ నిక్కరుమీద, ఎర్రచారల చొక్కా వేసుకున్నాడు. నుదుర్ను కప్పివేసే జుత్తు. క్షవరం చేయించుకొని ఎన్ని మాసాలైందో!

"ఏమిటో యిది" అని శ్రీకాంత్ అంటూవుండగానే ఆ కుర్రాడూ స్టూడెంట్స్‌లో కలిసిపోయాడు.

ఆ కవరు చించగా ఓ ఎర్రటి కరపత్రం ఉంది. గబగబా చదువు కున్నాడు శ్రీకాంత్. వొళ్ళంతా కుతకుత వొణికిపోయింది. కోపావేశంతో వూగిపోయాడు.

తనకీ, అక్కయ్యలకూ అక్రమ సంబంధాన్ని ఆపాదిస్తూ వేసిన కరపత్ర మది ! ఆ కుర్రవాడికోసం చూశాడు శ్రీకాంత్. గబగబా మెట్లు దిగి వచ్చాడు. గేటు బయట సైకిలుమీద పోతూ కనబడ్డాడు ఆ కుర్రాడు. వెంటనే శ్రీకాంత్ షెడ్డులోకి వెళ్ళి, తన సైకిల్ను తీసుకొని వేగంగా రోడ్డు మీదకొచ్చాడు. ఆ కుర్రాడు మాయమయ్యాడు.

శ్రీకాంత్‌కు పిచ్చెక్కినట్లయింది. వొళ్ళంతా వేడెక్కింది. నరనరాల్లో రక్తం చిమ్ముతోంది. కళ్ళు ఎర్రబాడ్డాయి. కాళ్ళు బలహీనమయ్యాయి. మనస్సంతా మండిపోతోంది. ఆగ్రహానికి హద్దులు లేకుండా పోతున్నాయి. ఆ కుర్రవాడ్ని పట్టుకొని ఆ చెంపా ఈ చెంపా వాయించి, ఆ కరపత్రాన్ని వేసినవాళ్ళ ఆచూకీ తీద్దామనుకున్నాడు.

జిన్నా టవర్ కేసి సైకిలు పోనిచ్చాడు. జనంలో, ట్రాఫిక్‌లో ఆ కుర్రవాడు ఎటు వెళ్లాడో అంతుబట్టలేదు. సైకిలుమీద వీధి వీధీ పిచ్చిబట్టినట్టు తిరిగాడు. కాని ఆ కుర్రవాని జాడ దొరకలేదు.

ఆ కరపత్రాన్ని ఎవరు వేశారు ?

ఎందుకేశారు ?

అక్కయ్యలను అపఖ్యాతిపాలు చేస్తే వాళ్ళకు వొరిగేదేముంది ?

తనకీ, అక్కయ్యలకూ ఎంత దారుణమైన, ఘోరమైన సంబంధాన్ని అంటగట్టారు ? తను కలలోకూడా ఊహించలేదే !

ఈ కరపత్రం సంగతి అక్కయ్యలకు తెలిసివుంటుందా ? తెలిస్తే ఎంత బాధపడతారు ?

దీనికి కారకులైనవాళ్ళను నాశనం చేయాల్సిందే ! అప్పుడుగానీ తన కోపం సద్దుమణగదు; తనకు మనశ్శాంతి కలగదు.

— ఆ విధంగా ఆలోచిస్తూ శ్రీధర్ రూమ్ కెళ్ళాడు శ్రీకాంత్. అతనికి కరపత్రాన్ని చూపెట్టాడు.

ఎంత అన్యాయంరా ? నిప్పులాంటి నీమీదే దుర్మార్గులు అవినీతి బురదను పులిమారు. వాళ్లను ఏం చేస్తే పాపముంది ?" అన్నాడు శ్రీధర్.

"ఈ దుర్మార్గం చేయించిన వాళ్ళను ప్రాణాలతో వొదలను" అన్నాడు శ్రీకాంత్ గర్జిస్తూ.

ఇద్దరూ కలిసి సైకిళ్ళమీద భావనారాయణ దగ్గరకు వెళ్ళారు. అప్పుడే భావనారాయణ స్నానంచేసి, విప్లవ కవులు వ్రాసిన గేయాలను చదువుతున్నాడు. శ్రీకాంత్ ఆ కరపత్రాన్ని భావనారాయణకు చూపెట్టాడు. ఆ కరపత్రాన్ని చివరిదాకా చదివాడతను. ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఏంచేద్దాంరా ?" అన్నాడు శ్రీధర్.

శ్రీకాంత్ మొహం గంభీరాతి గంభీరంగా ఉంది. కోపోద్రేకాలు కరడుగట్టి మొహాన్ని రాయిలా మార్చాయి.

"అన్యాయం జరిగిపోయింది. ఇప్పుడు అఘోరించి లాభమేముంది ? పాపం, అమాయకులైన మీ అక్కయ్యలపై అంతులేని అపవాదు పడింది. ఈ అపవాదు వాళ్ళ జీవితాలకు మాయని మచ్చ" అన్నాడు భావనారాయణ తన సానుభూతిని తెలుపుతూ.

"కర్తవ్యం బోధించరా !" అన్నాడు శ్రీధర్.

"కర్తవ్య మేముంది ? ఈ అపవాదు రూపుమాపలేనిది. కరపత్రంలోకి ఎక్కిందంటే ఎంతమంది కళ్ళబడుతుందో చెప్పలేం. దీనికి కారకులైన వాళ్ళెవరో తెల్సుకుని మాత్రం చేసేదేముంది ?" అన్నాడు భావనారాయణ.

"అంతేనా ?" అన్నాడు శ్రీకాంత్ సెగలు కక్కే కసితో.

"ఒక్క సలహా యిస్తాను. వింటావా ?" అన్నాడు భావనారాయణ సీరియస్‌గా.

"చెప్పు" అన్నాడు శ్రీధర్.

"ఏమిటా సలహా ?" అన్నాడు శ్రీకాంత్.

"వెంటనే నువ్వు ఆ యింట్లోంచి బయటకు రా. నా రూమ్‌లో వచ్చి వుండు. నీవల్ల వాళ్లకు అపఖ్యాతీ, ఇబ్బందీ, కష్టాలూ కలక్కుండా చూడు" అన్నాడు భావనారాయణ.

స్నేహితుని సలహాకు స్టన్ అయ్యాడు శ్రీకాంత్. అట్లాంటి సలహాను అతను ఆశించలేదు. తల అడ్డంగా తిప్పాడు.

"నేను ఆ యింట్లోనే వుంటాను. అంత పిరికివాడ్ని కాదు. మా మధ్య నిజమైన అక్కా తమ్ముడి సంబంధ ముందనీ, కొంతమంది దుర్మార్గులు దాన్ని

అవినీతి చర్యగా మార్చారనీ లోకానికి తెల్సివచ్చేటట్లు చేయడమే నా కర్తవ్యం. నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత నా పైనుంది" అన్నాడు శ్రీకాంత్ దృఢంగా.

"నా అభిప్రాయం చెప్పాను. ఆ తర్వాత నీ యిష్టంరా" అన్నాడు బాపనారాయణ చివరగా.

అతని అభిప్రాయమూ, సలహా నచ్చకపోగా శ్రీకాంత్ సైకిలెక్కి ఇంటికి బయలుదేరాడు. అతనితోపాటు బయలుదేరిన శ్రీధర్ నాజ్ థియేటర్ వద్ద ఆగిపోయాడు.

* * *

ఆలోచనలతో బుర్ర ఇనుపకొలిమిలా వుంది. ధ్యాసంతా ఆ కరపత్రం మీదా, దాన్ని అందించిన కుర్రవాడిమీదా వుంది. సైకిలు తొక్కుతున్నాడు శ్రీకాంత్.

సాయంత్రం ఎర్రగా నెత్తురు రంగులో ఉంది. సూర్యుడు అస్తమించటానికి సిద్ధంగా ఉన్నాడు.

సైకిలు తొక్కుకుంటూ అరండేల్ పేటకు వచ్చాడు శ్రీకాంత్. దారి పొడవునా ఆ కుర్రవాడికోసం అతని కళ్ళు గాలిస్తూనే వున్నాయి. వాడెక్కడ కనబడితే అక్కడే వాడ్ని పాతేద్దామన్న అతని కోపం వీసమెత్తు తగ్గలేదు.

శ్రీకాంత్ అదృష్టమో మరి దురదృష్టమో ఆ కుర్రవాడు అరండేల్ పేటలో కట్టెల దుకాణం దగ్గర కనబడ్డాడు. అంతదూరంలో కనిపెట్టాడు శ్రీకాంత్. వాడే! ఆ జుత్తూ, కాకీ నిక్కరూ, ఎర్రచారల చొక్కా? ఆ కుర్రవాడు ఒక పక్కగా తిరిగి ఐస్‌క్రీమ్ కాండిల్ స్టిక్ చీకుతున్నాడు. మెల్లగా సైకిలు దిగి, స్టాండ్ వేసి, చప్పుడుకాకుండా ఆ కుర్రవాడి మెడ పట్టుకున్నాడు శ్రీకాంత్.

శ్రీకాంత్‌ను చూడటంతోటే వాడి ప్రాణాలు గాలిలో కల్సినంత పనైంది. నోట్లోవున్న ఐస్‌క్రీమ్ కాండిల్‌స్టిక్ జారి నేలమీద పడింది. గజగజ వొణికి పోయాడు.

"నువ్వేనట్రా ఆ కరపత్రాన్ని ఇచ్చింది" అన్నాడు శ్రీకాంత్ వొళ్ళు తెలీని కోపంతో.

ఆ కుర్రావాడు భయోత్పాతంతో 'ఊఁ' 'ఆఁ!' అంటూ నీళ్ళు నమిలాడు.

"ఎవరిమ్మన్నారు ఆ కరపత్రాన్ని?" గర్జించాడు శ్రీకాంత్.

వాడు చెప్పలేదు.

"చెబుతావా ? చెంప ఛెళ్లు మనిపించమంటావా ?" శ్రీకాంత్ కేకలకు వాడు భయపడుతున్నాడుగానీ, నోరు విప్పటంలేదు.

"నిన్నే !"

"చెబుతావా ? వీపు చీరెయ్యమంటావా ?"

వాడి మౌనానికి శ్రీకాంత్‌కు వొళ్ళు మండింది. నాలుగు తగిలిస్తేగానీ నిజం చెప్పడని, చెంపమీద ఒక్కటి వేశాడు శ్రీకాంత్.

ఆ కుర్రాడు కెవ్వున కేక బెట్టాడు. ఆ కేకకు రోడ్డుమీద పోయేవాళ్ళు ఇద్దరు ముగ్గురు అక్కడ కొచ్చారు. జనం మూగితే, తాను నిజం చెప్పించటం అసాధ్యమని భావించి, ఆ కుర్రాడ్ని బలవంతాన లాక్కెళ్లి సైకిలుమీద కూర్చుండబెట్టి, ఇంటికి తీసుకెళ్ళాడు శ్రీకాంత్.

అప్పటికి సాంతం ప్రొద్దు గ్రుంకింది

ఆ కుర్రవాడ్ని ఇంట్లోకిలాక్కురావటాన్ని చూసిన సుజాత, సుభాషితలు తెల్లబోయారు. ఎవరా కుర్రాడు? అతన్ని శ్రీకాంత్ ఎందుకట్లా యీడ్చుకొస్తున్నాడు ? – వాళ్ళకు అర్థంకాలేదు.

ఆ కుర్రాడ్ని గదిలోకి తీసుకెళ్ళి గది తలుపులు గడియపెట్టాడు.

"ఇప్పుడు చెప్పు. ఆ కరపత్రాన్ని నిన్నెవ్వరు ఇవ్వమన్నారు ?" గర్జించాడు శ్రీకాంత్.

వాడు నోరు విప్పలేదు. భయంతో వొణికిపోతున్నాడు.

"నిజం చెప్పావంటే నిన్ను కొట్టను. చెప్పకపోయావో నీ రక్తం కళ్ళజూస్తాను" అన్నాడు శ్రీకాంత్ ప్యాంట్ బెల్టు బయటికితీస్తూ.

ఆ కుర్రవాడు పట్టుదలగా నోరు విప్పలేదు. ఆ పట్టుదల చూసేసరికి శ్రీకాంత్‌కు పిచ్చికోపం వొచ్చింది. ఆ బెల్టుతో రెండు తగిలించాడు.

కుర్రవాడు దెబ్బలకు వోర్చుకోలేక గొంతు విప్పాడు. గది దద్దరిల్లిపోయేట్టు కేకలు, పెడబొబ్బలు.

బయటనుంచి సుజాత, సుభాషితలు తలుపు బాదుతున్నారు.

"శ్రీకాంత్ !... శ్రీకాంత్ ! ఆ కుర్రాడ్ని విడిచిపెట్టు...కొట్టకు...కొట్టకు ...శ్రీకాంత్ !.. శ్రీకాంత్ !"

కుర్రవాడిచేత నిజం చెప్పించాలనే పట్టుదలతో, నిశ్చయంతోవున్న శ్రీకాంత్‌కు వాళ్ళ మాటలు, తలుపు కొట్టడాలు వినిపించలేదు.

అయిదు నిముషాలు గడిచాయి.

గదిలోపల బెల్టు దెబ్బలు, కుర్రవాడి ఏడుపు. మధ్య మధ్యలో కేకలు.

ఇరుగూ పొరుగూ ఇళ్ళనుంచి ఆ కేకలు విని ఇద్దరు ముగ్గురు వచ్చారు. ఏమిటేమిటని అడుగుతున్నారు. సుజాత, సుభాషితలు తలుపులు బాదుతూనే వున్నారు.

హఠాత్తుగా లోపలనుంచి కుర్రవాడి ఏడుపు ఆగిపోయింది.

ఖర్మంచాలక వాడు చచ్చాడేమోనని సుజాత, సుభాషితలు భయపడ్డారు.

దెబ్బలకు వోర్చుకోలేక కుర్రవాడు నిజం చెప్పేశాడు.

ఆ కరపత్రాల్ని పంచమని యిచ్చింది ఎదురింటి పూర్ణచంద్ అట. పంచి నందుకు పాతిక రూపాయలు బహుమతి యిచ్చాడట.

ఆ సంగతి విన్న శ్రీకాంత్ ఓ నిమిషంపాటు నిర్విణ్ణుడయ్యాడు. నెమ్మదిమీద ఆ కుర్రవాడి మాటలు యదార్థంగా తోచాయి శ్రీకాంత్‌కు.

గది తలుపులు తెరిచాడు శ్రీకాంత్.

ఆ కుర్రవాడికి జేబులోంచి తీసి అయిదురూపాయలు ఇచ్చాడు. బెల్టు దెబ్బలతో అక్కడక్కడా వాడి మొహం పొంగింది. మెడమీద కొద్దిగా రక్తం కారుతోంది చొక్కా, నిక్కరూ వుండటంవల్ల వొంటిమీద గాయాలు కనబడటం లేదు. అయినప్పటికీ అయిదురూపాయలు శ్రీకాంత్ ఇవ్వడంతో ఆ దెబ్బలన్నింటినీ మరిచిపోయాడు. చిరునవ్వు మొహంతో గదిబయటపడి, మామూలుగా నడిచి వెళ్ళాడు. ఇరుగూ పొరుగూ వాళ్లు ఏం మాట్లాడకుండానే వెళ్ళిపోయారు.

ఆ కుర్రవాడ్ని గొడ్డును బాదినట్టు బాదినందుకు ఆ కుర్రవాడి తల్లిదండ్రులు ఇంటిమీదకొచ్చి ఏం గొడవ చేస్తారోనని సుజాత, సుభాషితలు భయపడ్డారు. వాళ్ళకు శ్రీకాంత్‌మీద బాగా కోపమొచ్చింది.

"శ్రీకాంత్! నీ ప్రవర్తన ఏం బాగుండలేదు. ఇప్పటికే మా పరువుప్రతిష్ఠల్ని వీధిపాలు చేశావు. పైగా ఈ హింసాకాండ. దీని పర్యవసాన మేమిటో! ఆ కుర్రవాడి తల్లిదండ్రులు ఇంటిమీదకు దండెత్తివస్తే!" అంది సుజాత కోపంతో.

"శ్రీకాంత్! మమ్మల్ని ప్రశాంతంగా బ్రతకనిచ్చేట్టులేవు. ఈ దౌర్జన్య మేమిటి? కుర్రవాడ్ని ఇంట్లోకి లాక్కొచ్చి కొట్టడమేమిటి?" అంది సుభాషిత అంతకంటే కోపంగా.

కుర్రవాడు చెప్పిన విషయానికే శ్రీకాంత్ నిశ్చేష్టుడై వున్నాడు. పైపెచ్చు అక్కయ్యల ఆగ్రహం. ఎన్నడూ తనని అనని మాటలు అనడం. శ్రీకాంత్ తల గిర్రున తిరిగింది.

"ఆ కరపత్రాల్ని పంచింది ఆ కుర్రాడే అక్కా! వాడిచేత నిజం కక్కించాను. ఆ కరపత్రాలు వేయించింది ఎవరో తెల్సిపోయింది" అన్నాడు శ్రీకాంత్ ఆవేశాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ.

"కరపత్రాలు ఎవరు వేస్తేనేం, ఎవరు పంచితేనేం. మేం బజారుకెక్కాం. మా బ్రతుకుల్లో మాయనిమచ్చ పడింది. దాన్ని నువ్వు తొలిగించగలవా, శ్రీకాంత్ !" అంది సుభాషిత.

"నేనేం చేశానక్కా ! నేను ఇన్నోసెంట్‌ని. నిర్దోషిని. నేనేం తప్పు చేయలేదు" అన్నాడు శ్రీకాంత్ ఆవేశంతో కూడిన అమాయకత్వంతో.

"నువ్వేం తప్పుచేయలేదు. మేమూ ఏం తప్పుచేయలేదు. ముల్లువచ్చి అరిటాకుమీద పడింది. మేం చేసుకున్న ఖర్మ. దీనికి ఎవరూ బాధ్యులుకారు. స్వరూప మీదగల ప్రేమాభిమానాలతో, ఆమెతోగల సన్నిహిత స్నేహంతో నిన్ను ఇంట్లో పెట్టుకున్నాం. ఊహించని పరిణామాలు ఏర్పడ్డాయి. పరిస్థితులు దుర్భరంగా మారాయి. ఇక నువ్వు మాతో ఈ ఇంట్లో వుండటం మంచిదికాదు. ఎక్కడేనా రూమ్ చూసుకొని రేపే మరో చోటుకు వెళ్ళిపో !" అంది సుజాత మనస్సు రాయిచేసుకుని. ఆ నిర్ణయానికి రావటానికి ఆమె చాలా ఆలోచించింది; ఎంతోసేపు సంఘర్షణకు లోనైంది.

"అక్కా ! ఇది అన్యాయం. ఎవరో ఏదో కుట్రపన్ని చేసిందానికి నన్ను శిక్షిస్తారా ? నేను ఎటువంటివాణ్ణో మీకు తెలుసు. నేను ఏ బంధుత్వంతో, బాంధవ్యంతో మిమ్మల్ని ఆరాధిస్తున్నానో మీకు తెలుసు" అన్నాడు శ్రీకాంత్. అతని గొంతులో ఆవేశం స్థానే ఆవేదన తొంగిచూస్తోంది.

"మాకు తెలుసు శ్రీకాంత్ నిన్ను ఇంట్లోంచి పంపెయ్యాలని మాకు ఏ కోశానా లేదు. కాని పరిస్థితులు అట్లా విషమించాయి. సుజాత పెళ్ళి తప్పిపోయింది. ఎందుకో తెలుసా ! నీ వల్లనే. నిన్ను ఇంట్లో వుంచుకోవడం వల్లనే. ఎవరో ఏదో చెప్పారు. కృష్ణప్రసాద్ మనస్సు విరిగిపోయింది. పెళ్లికి ఒప్పుకోలేదు. నీ వంటే నారాయణమూర్తిగారికి మహా కోపంగా వుంది. నువ్వు ఈ ఇంట్లోవుంటే మళ్ళీ ఈ ఇంటి గడప తొక్కనన్నారు. చెప్పు. నీ కోసం సుజాత కన్నతండ్రిని వొదులుకుంటుందా ? మాపై నీకు నిజంగా అభిమానం, ఆప్యాయత వుంటే, మమల్ని అక్షరాలా అక్కలుగా భావిస్తుంటే, ఈ ఇంట్లోంచి తక్షణం వెళ్ళిపో !" అంది సుభాషిత గట్టిగా.

శ్రీకాంత్ నిలువునా నీరు కారిపోయాడు. అందరూ తనమీద కుట్ర పన్ని, తనని వెలివేయటానికి చూస్తూన్నట్టు కనబడుతోంది. తాను అక్కల్ని ఎంతో పవిత్రంగా ఆరాధించాడు. అందరితోపాటు వాళ్ళు తనని అపార్థం చేసుకుంటున్నారు. అంతేగాదు ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటున్నారు. తాను ఎవరి కోసం

ఆదుర్దాపడ్డాడో, అలజడి పొందాడో, ఎవరి క్షేమంకోసం, రక్షణకోసం తాపత్రయపడ్డాడో వాళ్లే ఈనాడు తనని గుర్తించలేదు. ఇది వాళ్ళ తప్పుకాదు. వాళ్ళల్లో ధైర్యంలేదు. పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యంలేదు.

"అక్కయ్యా! నేను మిమ్మల్ని విడిచి బ్రతగ్గలను. మరోచోట వుండి చదువుకోగలను. కాని ఇప్పుడు కాదు. లోకం మనల్ని అనుమానించినప్పుడు, మనపై అవినీతిని ఆరోపించినప్పుడు, లోకానికి భయపడి పారిపోవటం నా అభిమతంకాదు. మనం నిష్కల్మషులమని, మన అనుబంధం పవిత్రమైందనీ, సోదర సోదరీ భావంతో కూడుకున్నదనీ అందరికీ తెలియజేయడం నా కర్తవ్యం ఆ కరపత్రంలో వ్రాసిందంతా అబద్ధమనీ, దురాలోచనతో చేసిన దుష్కృత్యమనీ ఆ కరపత్రం వేసినవాడిచేతనే పదిమంది ఎదుట చెప్పిస్తాను. అప్పటిదాకా ఈ ఇంట్లోనే వుంటాను. ఆ కరపత్రంవేసిన దుర్మార్గు డెవడో కాదు. మన యింటి ఎదురుగా లేడూ స్కూటర్ మీద తిరుగుతూవుంటాడు. పూర్ణచంద్ అని వాడే! వాడి అంతు తేలుస్తాను" అంటూ శ్రీకాంత్ గబగబా బయటికి వెళ్ళాడు.

పూర్ణచంద్ పేరు వినగానే సుజాత, సుభాషితలు వొణికిపోయారు. అతన్ని గురించీ, అతని కింద ఉండే రౌడీలను గురించీ, టవున్లో అతనికున్న పలుకుబడిని గురించీ, అతని దుష్కృత్యాలను గురించీ వాళ్ళిద్దరూ నాగరత్నమ్మ చెప్పగా, మరెవరో అనుకూంటుండగా విన్నారు అతనిమీదకు శ్రీకాంత్ వెళ్ళడం కొండతో మూర్ఖంగా ఢీకొనడమే అనుకున్నారు. మరీ భయపడ్డారు.

మూడు నిముషాల్లోనే బుసలు పెడుతూ తిరిగివొచ్చాడు శ్రీకాంత్.

"దుర్మార్గుడు. ఊళ్లో లేడట. విజయవాడ వెళ్ళాడట. ఎప్పుడొస్తాడో తెలియదట. రేపైనా రాకపోతాడా? వాడిచేత నిజాన్ని కక్కించలేకపోతానా?"

"వాడొట్టి దుర్మార్గుడురా! వాడికి బోలెడంత బలగముంది. వాడితో నువ్వు పెట్టుకోకు" అంది సుభాషిత బ్రతిమిలాడుతూ.

"జరిగిందేదో జరిగిపోయింది. ఆ దుష్టుడిజోలికి పోకు. మా గురించి నువ్వు డేంజర్‌లో పడకు" అంది సుజాత.

"నాకేం డేంజరులేదు. వాడికే డేంజరు-తప్పు ఒప్పుకోకపోతే. మీరేం భయపడకండి! రేపు వాడిచేత నిజం చెప్పిస్తాను," అన్నాడు శ్రీకాంత్ తన పంతాన్ని వొదలకుండా.

ఆ రోజు రాత్రి సుజాత, సుభాషితలు ఎంతో చెప్పిచూశారు శ్రీకాంత్‌కు

పూర్ణచంద్ జోలికి వెళ్ళవద్దని. కాని అందుకు శ్రీకాంత్ ఒప్పుకోలేదు. మొండి పట్టు పట్టాడు. ఎంతో రాత్రివరకు సుజాత, సుభాషితలు ఆలోచిస్తూనే ఉన్నారు తమ కర్తవ్యాన్ని గురించి. శ్రీకాంత్ తనగదిలో కూర్చున్నాడు తన ఆలోచనలతో.

12

ఆ మరునాడు ఉదయం కాఫీలు త్రాగాక హాలులో కూర్చున్నారు సుజాత, సుభాషితలు. పేపరు పట్టుకొని అక్కడికొచ్చాడు శ్రీకాంత్. కొన్ని క్షణాల పాటు ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

“శ్రీకాంత్!” అంది సుభాషిత.

పేపర్లోంచి మొహాన్ని తొలగించి చూశాడు శ్రీకాంత్. గళ్ళలుంగీ మీద నేత లాల్చీ ధరించాడు. రాత్రిపూట బాగా మేల్కొన్నాడేమో కళ్లు ఎర్రబడి వున్నాయి.

“ఏం చేశావు?” అంది సుభాషిత.

“ఏమిటది?” అన్నాడు శ్రీకాంత్.

“ఇంట్లోంచి వెళ్ళే విషయం” అంది సుభాషిత కరుగ్గా.

“వెళ్ళనన్నానుగా!” అన్నాడు శ్రీకాంత్ ముక్తసరిగా.

“నువ్వు వెళ్ళనంటే సరిపోతుందా? మేం వెళ్ళమంటున్నాం. నువ్వు ఈ ఇంట్లో వుండటానికి వీల్లేదు” అంది సుజాత ఖంగుమనే స్వరంతో.

“మీ రెన్నయినా అనండి, నేను మాత్రం ఇప్పట్లో ఈ ఇంట్లోనుంచి

వెళ్ళను- మా అక్కయ్య వెళ్ళినప్పుడు నన్ను మీరే ఇంట్లో ఉండమన్నారు. ఇప్పుడు పొమ్మంటే పోతానా!" అన్నాడు శ్రీకాంత్ మొండిగా.

"అప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడు పరిస్థితులు వేరు. నువ్వు ఈ ఇంట్లో వుండి మా బ్రతుకులతో చెలగాటమాడతావా? మమ్మల్ని సమాజంలో తలెత్తుకో నివ్వకుండా చేస్తావా?" అంది సుభాషిత.

"అక్కా! నన్ను మీరు అర్థంచేసుకోవడంలేదు. పూర్ణచంద్‌గాడిచేత నిజం చెప్పించి, ఈ గాలిదుమారం కేవలం కల్పితమైందేననీ, స్వార్థంతో ఓ దుర్మార్గుడు సృష్టించిందేననీ నిరూపించి అప్పుడు మీకు దూరంగా పోతాను. అంతవరకూ ఇంట్లో ఉండనివ్వండి" అన్నాడు శ్రీకాంత్.

"ఈ నిరూపణలూ, సాక్ష్యాలూ మాకేమీ వొద్దు. వెంటనే పెట్టె సర్దుకుని ఇంట్లోంచి వెళ్ళిపో. ఇంట్లోవుండి ఆ పూర్ణచంద్‌తో తగాదా పెట్టుకొన్నావంటే మేం ఈ ఇంట్లో ఉండలేం," అంది సుభాషిత.

"నువ్వు ఈ ఇంట్లోంచి పోకపోతే మేమే ఈ ఇంట్లోంచి తక్షణం వెళ్ళి పోతాం," అంది సుజాత.

"ఎక్కడికి వెళతారు? మీరెక్కడికి వెళ్ళినా మీతో నేనూ వస్తాను," అన్నాడు శ్రీకాంత్.

"ఇదెక్కడి బెడద? మమ్మల్ని దయ్యంపట్టినట్టు పట్టావు" అంది సుజాత కోపంతో రెచ్చిపోయి.

"మీ అక్కయ్యకు టెలిగ్రాం ఇస్తాను. వెంటనే బయలుదేరి రమ్మనమని" అంది సుభాషిత.

మాట్లాడలేదు శ్రీకాంత్.

అంతపనీ చేసింది సుభాషిత. రిక్షాలో ఎనిమిది గంటలకు టెలిగ్రాఫ్ ఆఫీసుకు వెళ్ళి, 'వెంటనే రావాల్సింది' అని స్వరూపకు టెలిగ్రామ్ ఇచ్చింది సుభాషిత.

ఆ రోజు సుజాత, సుభాషితలు కాలేజీకి సెలవుపెట్టారు. కాలేజీకి వెళ్ళడానికి వాళ్ళకు మొహం చెల్లలేదు. పైపెచ్చు శ్రీకాంత్‌ను ఇంట్లోంచి బయటకు పంపించలేకపోతున్నారు. ఏం చేయడానికి, ఏం చేయకుండా వుండటానికి తోచడంలేదు. పరిస్థితులు ఏదో భయాన్ని కలిగిస్తున్నాయి. జరగరానిదేదో జరగబోతున్నట్టు వాళ్ళ మనసులు శంకిస్తున్నాయి. సెలవుపెట్టి ఇంట్లోనే పచార్లుచేయసాగారు వాళ్ళిద్దరూ.

తొమ్మిదిగంటల ప్రాంతంలో శ్రీకాంత్ ఓసారి పూర్ణచంద్ ఇంటికెళ్ళి వచ్చాడు. అతను ఇంకా విజయవాడనుంచి రాలేదుట.

తొమ్మిదిన్నరకు షేవ్ చేసుకొని, స్నానం చేశాడు శ్రీకాంత్. వెంటనే భోంచేశాడు. టెర్రీకాట్ వైట్‌ప్యాంట్‌మీద బాటిక్ టైపు ప్రింటింగ్ శ్లాకు వేసుకున్నాడు. రెండు పుస్తకాలు సైకిలు క్యారియర్‌మీద పెట్టుకొని, "కాలేజీకి వెళుతున్నాను" అన్నాడు శ్రీకాంత్

సుజాత, సుభాషితలు మాట్లాడలేదు. మొహాలు యింతలావు చేసుకొని కూర్చున్నారు. స్వరూప వస్తేగాని శ్రీకాంత్ మాటవినడని నిర్ణయించుకున్నారు వాళ్ళు.

ఇంటిముందు సైకిలెక్కి పది మీటర్లు వెళ్ళాడో లేదో, ఎదురుగ్గా స్కూటర్ మీద వస్తున్న పూర్ణచంద్ కనిపించాడు శ్రీకాంత్‌కు. వెంటనే సైకిలు దిగాడు. స్టాండ్ వేశాడు.

పదిగంటల ఎండ మిటమిట లాడుతోంది. ఆ ఎండను మించిన కోపం అతనిలో ఒక్కుమ్మడిగా పూనకంలా వచ్చింది. వస్తున్న స్కూటర్‌ను చేయెత్తి ఆపాడు శ్రీకాంత్.

'ఏం కావాలి?' అన్నట్టు స్కూటర్‌మీదనుంచి చూశాడు పూర్ణచంద్. రేబాన్ కూలింగ్ గ్లాసులు పెట్టుకున్నాడు. ఆత్తంగా రేగివుంది. విజయవాడ నుంచి స్కూటర్‌మీద వస్తున్నట్లున్నాడు. బ్లాక్ చెక్స్‌గల టెర్రీవూల్ ప్యాంట్ మీద గళ్ళ శ్లాకు వేసుకున్నాడు. మనిషి కొంచెం బడలికగా వున్నాడు.

ప్యాంట్ జేబులోంచి గబుక్కున ఎర్రటి కరపత్రాన్ని తీసి పూర్ణచంద్‌కు చూపిస్తూ, "ఈ కరపత్రాన్ని వేయించింది నువ్వేనా?" అన్నాడు శ్రీకాంత్.

"ఎవరన్నారు?" అన్నాడు పూర్ణచంద్ నిమ్మకు నీరెత్తిన నిర్లక్ష్యంగా.

"నే నంటున్నాను."

"నువ్వంటే, అనుకో."

"నిజం చెప్పు. ఈ కరపత్రాల్ని పంచిపెట్టిన కుర్రాడు చెప్పాడు".

"ఏమని ?"

"నువ్వు వేయించినట్టు. పంచినందుకు పాతికరూపాయలు ఇచ్చినట్టు."

"ఏమో! నాకు తెలీదు."

"అబద్ధం. ఈ దుర్మార్గపుపని నీదే! నువ్వు అలాంటివాడివే. నీ గురించి అంతా తెల్సుకున్నాను. దీనివల్ల నీకొచ్చిన లాభమేమిటి?"

శ్రీకాంత్ వొళ్ళు తెలీని ఆవేశంతో మాట్లాడుతున్నాడు. పూర్ణచంద్ నిండు కుండలా తొణకకుండా సమాధానాలు చెబుతున్నాడు.

"మర్యాదగా మాట్లాడు" అన్నాడు పూర్ణచంద్.

"నీలాంటి కిరాతకుడికి మర్యాదేమిటి! చెప్పు. ఆ కరపత్రాన్ని ఎందుకేయిం చావు? నీ ఉద్దేశమేమిటి? మమ్మల్ని అపఖ్యాతిపాలుచేస్తే నీ కేమొస్తుంది? తప్పు ఒప్పుకో! క్షమాపణ చెప్పుకో! లేకపోతే నీ రక్తం కళ్ళజూస్తాను" అంటూ శ్రీకాంత్ అతని చొక్కా కాలర్ పట్టుకున్నాడు.

"ఏయ్! మర్యాదగా వొదులు" అన్నాడు పూర్ణచంద్ కొంచెం గొంతు పెంచి.

"మా అక్కల దగ్గరకొచ్చి క్షమాపణ చెప్పుకొనేదాకా నిన్ను వొదలను" అంటూ శ్రీకాంత్ అతన్ని ముందుకు గుంజాడు.

స్కూటర్‌తోసహా పూర్ణచంద్ ముందుకొరిగి పడ్డాడు. అయినా అతనిలో కోపోద్రేకాలు విజృంభించలేదు. నిలదొక్కుకున్నాడు.

వీధిన వెళ్ళేవాళ్లు ఇద్దరు ముగ్గురు అక్కడ చేరారు.

"ఏం చెప్పరా!" అంటూ శ్రీకాంత్ మళ్ళీ పూర్ణచంద్ చొక్కా కాలరు పట్టుకున్నాడు. పూర్ణచంద్ విడిలించుకున్నాడు.

శ్రీకాంత్‌లో పిచ్చికోపం ఉవ్వెత్తుగా లేచింది. ఉడుకు రక్తం ఝుంఝా మారుతంవలె ప్రవహించింది. ఆ ఆవేశంలో తనను తాను మర్చిపోయాడు శ్రీకాంత్. ఏం చేస్తున్నాడోకూడా గ్రహించలేని ఉద్ధృతమైన కోపోద్రేకాలతో కసితో పూర్ణచంద్‌ను మెడమీద, చెంపలమీద నాలుగుదెబ్బలు వేశాడు. నోటి కొచ్చినట్లు బూతులు తిట్టాడు.

కాని పూర్ణచంద్ అహింసామార్గాన్ని అవలంబించాడు. అతనికి విపరీతంగా కోపం రాకపోలేదు; మొహం జేవురించకపోలేదు; అవమానం పొందకపోలేదు; శ్రీకాంత్‌ను పట్టుకొని ఆ దవడా ఈ దవడా వాయించి, జుట్టుపట్టుకొని సైడు కాల్వలోకి ఈడ్చి అందులో కుక్కి దామని అనుకోపోలేదు. అతనికి అదేమంత కష్టమైన పనికాదు. అతని బలం ముందు, శక్తి ముందు, కొట్లాటల్లో అనుభవం ముందు శ్రీకాంత్ పసివాడు. అయినప్పటికీ ఎంతో నిగ్రహంతో కోపావేశాన్ని నిలదొక్కుకున్నాడు.

అక్కడ చేరినవాళ్లు పూర్ణచంద్ నిగ్రహానికి, మెదలకుండా వూరుకోటానికి అమితంగా ఆశ్చర్యపడ్డారు. అందులో ఒక యువకుడు పూర్ణచంద శిష్యు

వర్గంలోవాడు. గురువుగారిమీద ఒక స్టూడెంట్ అట్లా కలియబడటాన్ని వాడు కళ్ళారాచూసి సహించలేకపోయాడు. అతనిలో రక్తం పరవళ్ళు త్రొక్కింది. వెనగ్గా శ్రీకాంత్ భుజం పట్టుకొని, పిడికిలి బిగించి, మెడమీద గుద్దబోయాడు.

"ఒరేయ్ రాములూ' వూరుకోరా! వొదిలిపెట్టు" అన్నాడు పూర్ణచంద్ శాంతంగా.

మరి నలుగురు మనుషులు ప్రోగయ్యారు.

రాములు పట్టును వొదిలించుకొని, పూర్ణచంద్ మీదకు మళ్ళీ కలబడాలని శ్రీకాంత్ ప్రయత్నం చేయసాగాడు. నోటికొద్దీ తిట్టసాగాడు.

"ఏంటి గురూ! ఇవాళ అపరగాంధీ అయిపోయావు. గుంటూరులో నీ మీద చేయిచేసుకొనే మగాడుండాడా?" అన్నాడు రాములు రెండు చేతులతో శ్రీకాంత్ రెక్కల్ని గట్టిగా పట్టుకొని.

"ఆ ఎలక్ట్రిక్ స్తంభానికి కట్టేయండ్రా వాడ్ని" అన్నాడు మరొకడు. అతనూ పూర్ణచంద్ శిష్యవర్గంలోవాడే.

"ఉండరా సత్యం! ఏదో కుర్రకుంక. మన సంగతి తెలీక కుప్పిగంతు లేస్తున్నాడు. వొదిలివేయండి కాలేజీకిపోయి చదువుకుంటాడు," అన్నాడు పూర్ణచంద్.

రాములు తన పట్టు వొదిలేశాడు. కాని శ్రీకాంత్ పూర్ణచంద్ మీదకు వెళ్ళ లేదు. అతని మనుషులు చాలామంది అక్కడ ఉన్నట్టు తెలుసుకున్నాడు. అ సమయం కాదని భావించాడు. పూర్ణచంద్ ఒంటరిగా వున్నప్పుడే ఎదుర్కొని, అతనిచేత నేరాన్ని ఒప్పించాలనుకున్నాడు. సైకిలు దగ్గరకు వెళుతూ, "నీ అంతు తర్వాత చూస్తాను. కాలేజీ టైం అయింది" అన్నాడు శ్రీకాంత్ బుసలు పెడుతూ.

అక్కడున్నవాళ్ళు నవ్వుకున్నారు.

"పోరా, కుర్రకుంకా!" అన్నాడు రాములు.

"నువ్వెంత? నీ బ్రతుకెంత? 'ఉఫ్' అంటే గాలిలో గడ్డిపోచలా ఎగిరి పోతావ్!" అన్నాడు సత్యం.

వాళ్ళిద్దరూ గురువుగారివెంట వెళ్ళిపోయారు.

సైకిలు తొక్కుకుంటూ కాలేజీకి వెళ్ళాడు శ్రీకాంత్.

* * *

స్కూటర్‌మీద వస్తోన్న పూర్ణచంద్‌ను శ్రీకాంత్ కొట్టిన సంగతి అరగంట లోనే ఆ వీధి మొత్తానికి తెల్సిపోయింది. ఆ విషయాన్ని నాగరత్నమ్మ మోసుకు

వచ్చి సుజాత, సుభాషితలకు చెప్పింది. వాళ్ల నిర్ఘాంతపోవటమే కాకుండా, నిలువునా భయపడిపోయారు.

"ఎంతపని చేశాడే శ్రీకాంత్?" అంది సుభాషిత.

"ఏదో అఘాత్యానికి పాల్పడతాడని అనుకుంటూనేవున్నా. అట్లాగే చేశాడు" అంది సుజాత.

"మరిప్పుడేం చేద్దామే!"

"పూర్ణచంద్ దుర్మార్గుడు. రౌడీ. వాడు పగపడితే తప్పించుకోవటంకష్టం."

"అందుకనే! నాకేదో భయంగా వుందే ! ఈ రాత్రికి మన కొంపమీదకు రౌడీలను వుసికొల్పడుగదా!"

"ఎలా చెబుతాం? వాడు తెగిస్తే ఎంత దారుణానికైనా వెనుకాడడు. మనం జాగ్రత్తపడటం మంచిది."

"ఎల్లాగే"

"ఇద్దరమూ వారంరోజులు సెలవుపెట్టి ఎవరి వూళ్ళకు వాళ్లం వెళ్ళిపోదాం. వారం తర్వాత పరిస్థితులు కూల్ కావచ్చు. ఈ ఆవేశాలు, దూకుళ్లు ఉండక పోవచ్చు."

"అదే బెటర్!"

సుజాత, సుభాషితలు దృఢంగా ఓ నిర్ణయానికి వచ్చారు. వెంటనే విడి విడిగా ప్రిన్సిపాల్‌కు సెలవు చీటీలు వ్రాశారు-తమకు తమ తమ స్వగ్రామాలలో అర్జంటుపని ఉన్నదనీ, వారంరోజులపాటు సెలవు మంజూరు చేయించ వల్సిందనీ. ఆ సెలవుచీటీలను నాగరత్నమ్మ కిచ్చి, ఆవిడ చేతిలో రెండు రూపాయలు పెట్టి, కాలేజీకి వెళ్ళి ప్రిన్సిపాల్‌కు ఇచ్చిరమ్మన్నారు. నాగరత్నమ్మ ఆ డబ్బును బొడ్లో దోపుకుని ఎర్రని ఎండలో నడిచివెళ్ళి నడిచి వచ్చింది గంట తర్వాత.

ఆ లోపల సుజాత, సుభాషితలు సూట్‌కేసుల్లో తమ బట్టలను సర్దుకున్నారు.

"నాగరత్నమ్మా! ఇంతసేపూ ఏంచేశావు?"

"మధ్యలో రిక్షా చెడిపోయింది. నడిచివెళ్ళాను" అంది ఆవిడ.

"మేం వూరికి పోతున్నాం. ఇల్లు జాగ్రత్తగా చూసుకో. శ్రీకాంత్ బాబుకు అన్నం వండిపెట్టు. మేం వారంరోజులకుగానీ తిరిగిరాం," అంది సుజాత.

అంత అర్ధాంతరంగా వాళ్ళెందుకు ప్రయాణం కట్టారో ఆవిడకు తెలుసు. కాని తల ఆడించి వూరుకుంది. వాళ్ళు లేని సమయంలో తన ఇష్టమొచ్చిన తినుబండారాలు చేసుకు తినొచ్చునని ఆవిడ కుశాలుగా వుంది.

"మరి మనం స్వరూపకు టెలిగ్రాం ఇచ్చాం గదా! ఇవాళ రాత్రికో, రేపు పొద్దున్నో వస్తే ఎట్లా?" అంది సుభాషిత.

"నిజమే! ఎలా? మరి ఆమె కోసం ఆగితే ఇబ్బందుల్లో పడతామే!" అంది సుజాత.

"వస్తే వస్తుంది. ఇంట్లో వుంటుంది. నాగరత్నమ్మ వుంటుందిగా. తమ్ముడి వ్యవహారం స్వయంగా చూసుకుంటుంది," అంది సుభాషిత.

"సరే అంది సుజాత సంతృప్తిపడినట్టుగా.

ఓ రిక్షా పిలిపించుకొని తర్వాత అరగంటలోనే వాళ్ళిద్దరూ బస్‌స్టాండుకు వెళ్ళారు.

అప్పటికే ఎర్రటి ఎండపోయి, ఆకాశంలో మబ్బులు గుమిగూడాయి-భారీ వర్షానికి సూచనగా.

13

ఆకాశాన్ని కమ్ముకున్న కారుమేఘాలు రెండుగంటల ప్రాంతంలో వర్షించాయి. పావుగంటసేపు పెద్ద వర్షం కురిసింది. వీధులన్నీ వాన నీటితో నిండిపోయాయి. వర్షం కురిశాక మబ్బులన్నీ విడిపోయి, తెల్లటి ఎండ వచ్చింది.

సాయంత్రంపూట ఫస్ట్ పిరియడ్ జరుగుతోంది. 'వ్యాపార వ్యవస్థ: నిర్వహణ' సబ్జక్టులో కోఆపరేటివ్ సొసైటీలను గురించి లెక్చరర్ చెబుతున్నాడు. స్టూడెంట్సు అందరితోపాటు శ్రీకాంత్ క్లాసులో కూర్చున్నాడుగానీ అతని మనస్సు మనస్సులో లేదు.

...పూర్ణచంద్‌చేత నిజాన్ని చెప్పించలేకపోయాడు. జనం గుమిగూడటంతో తను అనుకొన్నట్టు జరగలేదు. లేకపోతే పూర్ణచంద్‌చేత నిజాన్ని చెప్పించేవాడే! అయినా వాడెక్కడకు పోతాడు? సాయంత్రం వాడి సంగతి చూడాలి. ఇవాళ కాకపోయినా, రేపైనా వాడిచేత తప్పు ఒప్పించలేకపోలేదు. ఆ దుర్మార్గుడి వల్ల అక్కయ్యలకు ఎంత చెడ్డపేరు వచ్చింది? సుజాత అక్కయ్య పెళ్ళి సంబంధం కూడా చెడిపోయింది. ఆ పూర్ణచంద్‌గాడే కృష్ణప్రసాద్‌కు ఆకాశరామన్న లేఖ వ్రాయించి వుంటాడు. ఎంత నీచానికైనా ఎంత దారుణానికైనా వాడు పాల్పడగలడు. వాడిలో మానవత్వం లేదు. తాను గానీ, అక్కయ్యలు గానీ వాడికి చేసిన ద్రోహం ఏమీ లేదు. తమ మీద వాడు కక్ష బూనటానికి కారణమేమీ లేదు. ఏ దురుద్దేశంతో ఈ ద్రోహానికి పూనుకున్నాడో!

అక్కయ్య లెంతో బాధపడుతున్నారు. ఈ అవాంఛిత పరిస్థితులకు తననే కారణంగా పేర్కొంటున్నారు, తనెందుకు కారణమవుతాడు? తనని దృష్టిబాణానికి ఒక సాధనంగా అవతలివాళ్ళు ఉపయోగించుకున్నారు గానీ, తనెట్లా కారణమవుతాడు. సుజాతక్కయ్య పెళ్ళి చెడిపోవటానికి తానెట్లా హేతువు? ఆకాశరామన్న ఉత్తరం చూసి బెదిరిపోయిన ఆ పెళ్ళికొడుకు జీవితంలో ఎదురయ్యే సంకట పరిస్థితులను ఎట్లా ఎదుర్కొగలడు? అట్లాంటి ఆకాశరామన్న ఉత్తరాలు పెళ్ళి అయినాక కూడా రావొచ్చు. అప్పుడు భార్యను వొదిలేస్తాడా?

ఏమైనా అక్కయ్యలకు తనమీద విపరీతమైన కోపం వచ్చింది; ద్వేషం కలిగింది. తనని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని ఒకటికి నాలుగుసార్లు చెప్పారు. తనవల్ల ఎంత వ్యథ, ఎంత బాధ, ఎంత జుగుప్స పొందకపోతే అట్లా నిర్మొహమోటంగా అంటారు. తను ఇంట్లోనుంచి వెళ్ళనని మొండిగా ప్రవర్తించి, వాళ్ళ మనస్సులకు మరీ బాధ కలిగించాడేమో! అంత మూర్ఖంగా ప్రవర్తించి వుండాల్సింది కాదు. అనుకోని మలుపులు తిరిగిన పరిస్థితుల ప్రాబల్యానికి వాళ్ళు తట్టుకోలేకపోయారు. లోకానికి భయపడ్డారు. అదృశ్య శక్తులకు బెదిరిపోయారు. అది వాళ్ళ బలహీనత కావచ్చు. ఆ బలహీనతతోనే తనని ఇంట్లోంచి పొమ్మన్నారు. తను ఇంట్లోంచి పోతే, సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినట్టున్నారు.

తను ఆ ఇల్లు ఖాళీచేయడమే మంచిదేమో!

తద్వారా అక్కయ్యలకు మనశ్శాంతి చిక్కితే అంతకంటె ఏంకావాలి?

తను సమస్యగా తయారయ్యాడేమో! ఆ ఇంట్లోంచి వెళ్ళిపోతే ఆ సమస్య పరిష్కారమవుతుందేమో!

తను ఇల్లు మారాలి. టెంపరెరీగా భావనారాయణ రూమ్‌లో చేరితేసరి. ఆ తర్వాత మరోరూమ్ చూసుకోవచ్చు.

స్వరూప అక్కయ్య వస్తుందేమో! టెలిగ్రాం ఇచ్చినమాట నిజమైతే, అదర్దాపడి వస్తుంది. తననే నిందిస్తుంది. తప్పంతా తనదే అంటుంది. ఆమెతో ఉన్నదున్నట్టు చెప్పాలి. ఆమెను నమ్మించడానికి ప్రయత్నించాలి- తను నిరపరాధని...

శ్రీకాంత్‌కు క్లాసులో కూర్చొబుద్ధి కాలేదు. మనస్సంతా చికాగ్గా వుంది. ఆలోచనలన్నీ అనిశ్చితంగా వున్నాయి. ఏదో అశాంతి, అవ్యక్తమైన క్షోభ! ఏదో చేద్దామనే ఆవేశం; చేయడానికి అనుకూలించని పరిస్థితులు! తీవ్రమైన సంఘర్షణతో మనస్సంతా పొగలూ, సెగలూ వలె వుంది.

ఆఖరి పిరియడ్ క్లాసులో వుండకుండా బయటికొచ్చాడు శ్రీకాంత్. వర్షం కురిసిన తర్వాత పడుతూన్న ఎండ తెల్లగా, ప్రశాంతంగా, కులాసాగా వుంది.

షెడ్డులోంచి సైకిల్ని బయటకు తీశాడు శ్రీకాంత్.

"హల్లో! శ్రీకాంత్! లీలామహల్‌లో మంచి ఇంగ్లీషు పిక్చరుంది. సోఫియా లారెన్‌ది. ఫస్టుషోకు వస్తావా?" అన్నాడు ఓ మిత్రుడు కనబడి.

రానని తల అడ్డంగా తిప్పి, సైకిలెక్కాడు శ్రీకాంత్.

కాలేజీ బయటగేటు దగ్గర శ్రీధర్ తటస్థపడ్డాడు.

"ఏమిట్రా! అప్పుడే ఇంటికి వెళుతున్నావు? ఏమిటి విశేషం?" అన్నాడు శ్రీధర్.

"ఏంలేదురా? ఏం తోచటంలేదు?" అన్నాడు శ్రీకాంత్.

"ఏం తోచకపోతే అలా సుదర్శన్‌కు వెళ్ళి కాఫీ తాగొద్దాం పద" అన్నాడు శ్రీధర్.

"ఇప్పుడొద్దులే! ఇంటికెళతాను" అన్నాడు శ్రీకాంత్.

"ఏమిట్రా! అంత డల్‌గా వున్నావు?" అన్నాడు శ్రీధర్.

"మనస్సు బావుండలేదు." అన్నాడు శ్రీకాంత్.

"ఏం? ఎందుకని?" అన్నాడు శ్రీధర్.

"తర్వాత చెబుతాలే!" అంటూ సైకిలెక్కాడు శ్రీకాంత్.

మెయిన్‌రోడ్డుమీద మెల్లగా సైకిలు తొక్కుకుంటూ పోతున్నాడు శ్రీకాంత్. రోడ్డుమీద కార్లూ, రిక్షాలూ, బస్సులూ, లారీలూ, స్కూటర్లూ పోతున్నాయి చప్పుళ్ళు చేసుకుంటూ. మనుషులు నిశ్శబ్దంగా నడుస్తున్నారు.

సాయంత్రం నాలుగున్నర గంటలవుతూంది.

శ్రీకాంత్ సైకిలు తొక్కుతున్నాడు గానీ బుర్రలో అనేక ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. ట్రాఫిక్‌ను గమనించే దృష్టిలో లేడు.

ఎ సి. కాలేజీ దాటాడు శ్రీకాంత్.

అంతలో వెనకనుంచి ఓ లారీ పెద్ద చప్పుడుతో, హారన్‌తో, వేగంతోవచ్చి రోడ్డుకు ఎడం పక్కగా పోతూన్న శ్రీకాంత్ సైకిల్ను కొట్టింది. సైకిలు అంత దూరాన పడింది. దానిమీదున్న శ్రీకాంత్ నెత్తురు ముద్దయి రోడ్డుపక్కన కూలి పోయాడు.

ట్రాఫిక్ బంద్ అయింది.

'అయ్యో!' 'అరెరే!' 'యాక్సిడెంట్!' అంటూ రోడ్డుమీదున్న జనం గుమి కూడారు.

కార్లు ఆగిపోయాయి.

రిక్షాలు ఆగిపోయాయి.

స్కూటర్లు ఆగిపోయాయి.

సైకిళ్ళు ఆగిపోయాయి.

జనం ఆగిపోయారు.

కాని శ్రీకాంత్ సైకిల్ను కొట్టిన లారీ ఆగలేదు. దాని రంగుకూడా సరిగ్గా ఎవ్వరికీ గుర్తులేదు. నెంబరుప్లేటు మీద బురదా, దుమ్మూ కొట్టుకొని వుండటం వల్ల, ఆ లారీ నెంబరు ఎవ్వరికీ గుర్తులేదు.

ఆ లారీ సాంబశివపేట మీదుగా దూసుకుపోయింది. ఎటుపోయిందో, ఏమిటో ఎవ్వరూ చూడలేదు.

నెత్తురుముద్దలా పడివున్న శ్రీకాంత్ను ఎవరో గవర్నమెంట్ హాస్పిటల్కు తీసుకెళ్ళారు— శవంగా ధృవీకరించడానికి.

అది యాక్సిడెంటా ?

కాదు అది హత్య.

రోడ్డుకు ఎడంవైపు పోతూన్న శ్రీకాంత్ సైకిల్ని ఆ లారీ కొట్టాలేస్ బాగా లెఫ్ట్సైడుకొచ్చి కొట్టింది. అది యాక్సిడెంట్ ఎంతమాత్రం కాదు. లారీతో హత్య చేయడమే- అన్నారు ప్రత్యక్షంగా చూసిన కొందరు.

అయితే—

ఆ లారీ ఎవరిది ?

ఆ లారీని డ్రైవ్ చేసిందెవరు ?

అట్లా డ్రైవ్ చేయమన్నదెవరు ?

——ఈ విషయాలన్నీ పూర్ణచంద్కు తెలుసు.

ఆ మరునాడు ఉదయమే కర్నూలునుంచి ఎంతో ఆదుర్దాతో వచ్చిన స్వరూపకు గవర్నమెంట్ హాస్పటల్లో తమ్ముడి శవాన్ని గుర్తుపట్టవల్సిన దుర్గతి పట్టింది.

రెండురోజుల తర్వాత దినపత్రికలో వచ్చిన ఓ వార్తను చదివి సుజాత, సుభాషితలు విలవిల్లాడిపోయారు.

"గుంటూరులో మెయిన్రోడ్డుమీద ఎ.సి. కాలేజీ సమీపంలో బి కాం. చదివే 'శ్రీకాంత్' అనే విద్యార్థి సైకిలుమీద పోతూ లారీకింద పడి దారుణంగా మరణించాడు. పోలీసుల దర్యాప్తు జరుగుతూన్నది."